www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

300 వార్డులుగా జీహెచ్ఎంసీ

వార్డుల పునర్ నిర్ధారణకు సర్కారు ఆమోదం.. ఉత్తర్వులు జారీ

అభ్యంతరాలు స్వీకరించనున్న కమిషనర్.. నేడో, రేపో నోటిఫికేషన్?

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్(టీ-క్యూర్) వరకు విస్తరించిన జీహెచ్ఎంసీని 300 వార్డులుగా పునర్ నిర్ధారించారు. 2 వేల చదరపు కిలోమీటర్లకు పైగా విస్తీర్ణంలో ఉన్న ప్రాంతాలకు సంబంధించి వార్డుల(డివిజన్) హద్దులను పునర్ నిర్ధారిస్తూ(రీ ఫిక్సేషన్), కార్పొరేటర్ల సంఖ్యను తెలుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం మెట్రోపాలిటన్ ఏరియా అర్బన్ డెవలప్‌మెంట్

మిగతా 3వ పేజీలో...



మంగళవారం | 9-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 251 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: పంచమి మ.2:29 తదుపరి షష్ఠి; నక్షత్రం: ఆశ్లేష రా2:23 తదుపరి మఖ; వర్జ్యం: మ.3.25-4.59, దుర్ముహూర్తం: ఉ.8.49-9.33, రా.9.53-10.44, అమృతఘడియలు: రా.12.49-2.23, రాహుకాలం: మ.3.00-4.30, సూర్యోదయం: 6.37, సూర్యాస్తమయం: 5.37 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరైన దేశ, విదేశీ ప్రతినిధులు; వేదికపై టీపీఎస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ దినేశ్, నోబెల్ గ్రహీత కైలాష్ సత్యార్థి, సీఎం రేవంత్, గవర్నర్ జిష్ణుదేవ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, భట్టి, శోభన కామినేని, ఎరిక్ స్విడర్



సదస్సుకు వస్తున్న విదేశీ ప్రతినిధులు

పెట్టుబడుల సునామీ



తొలిరోజే 35 కంపెనీలు.. రూ.2.43 లక్షల కోట్ల ఇన్వెస్ట్‌మెంట్స్

- ఇంధన రంగంలోనే రూ.లక్ష కోట్లు.. లక్షన్నర ఉద్యోగాలు
- పదేళ్లలో లక్ష కోట్ల పెట్టుబడి.. తొలిరోజే 41 వేల కోట్ల ఒప్పందాలు: ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్
- డీప్ టెక్ రంగంలో బ్రూక్‌ఫీల్డ్ యాక్సిస్ 75 వేల కోట్లు
- 31వేల కోట్ల పెట్టుబడులకు ఎవ్రెన్/యాక్సిస్ సంతకాలు
- రూ.27 వేల కోట్ల పెట్టుబడులకు విన్ గ్రూప్ సిద్ధం
- సల్మాన్‌ఖాన్ రూ.10 వేల కోట్లు.. మేఘా 8 వేల కోట్లు
- వంతారా తరహాలో జూ ఏర్పాటుకు రిలయన్స్ ఓకే
- మై హోం నుంచి గ్లోబల్ కంపెనీల దాకా ఎంవోయూల వెల్లువ.. సీఎం రేవంత్ రెడ్డిపై ప్రశంసల వర్షం
- తెలంగాణ గ్లోబల్ సదస్సు తొలిరోజు సూపర్ సక్సెస్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతినిధి వచ్చారు! పదేళ్లలో లక్ష కోట్ల పెట్టుబడులు పెడతామని ప్రకటించారు! దేశ కుబేరుడు ముఖేశ్ అంబానీ కంపెనీ రిలయన్స్ ప్రతినిధులు వచ్చారు! గుజరాత్‌లోని వంతారా తరహాలో ఫ్యూచర్ సిటీలోనూ 'జంతువుల సేవ' చేస్తామని ప్రకటించారు! రెండో కుబేరుడు అదానీ కుమారుడు కరణ్ మాట్లాడారు! మరిన్ని పెట్టుబడులకు హామీ ఇచ్చారు! 'మై హోం' గ్రూపు రూ.7,000 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుంది! అంతేనా.. ట్రంప్ కంపెనీ ప్రతినిధి ఎరిక్ స్విడర్ నుంచి సదస్సుకు వచ్చిన ప్రతినిధులంతా సీఎం రేవంత్ విజన్‌ను కొనియాడారు! రాష్ట్రంలో పెట్టుబడులకు క్యూ కట్టారు! 3 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసుకుంటే.. తొలిరోజే ఏకంగా రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి! వెరసి, దావోస్‌ను మరిపించేలా రెండు రోజులపాటు నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' తొలిరోజే సూపర్ సక్సెస్ అయింది!

తెలంగాణ నంబర్ వన్!



గ్లోబల్ సమ్మిట్‌లో రోబోతో సీఎం రేవంత్ హైఫైవ్

- పదేళ్లలో మా ప్రభుత్వ లక్ష్యం ఇదే
- అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం
- దేశ జీడీపీలో 5% ఉన్న వాటాను 2047 నాటికి 10% చేస్తాం
- ప్రాంతాలవారీ అభివృద్ధి లక్ష్యాల్ని నిర్దేశించుకున్న రాష్ట్రమిదే
- చైనా, జపాన్, సింగపూర్ దేశాలే మాకు ప్రేరణ
- చైనాలోని గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తిగా ముందుకు
- తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్
- రండి.. భాగస్వాములు కండి..
- ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

..వివరాలు 11, 12, 13 పేజీల్లో

హైదరాబాద్‌లో బీచ్..!



- 35 ఎకరాల్లో.. రూ.235 కోట్లతో కొత్వాల్‌గూడలో కృత్రిమంగా ఏర్పాటు
- ఫ్లయింగ్ థియేటర్, టన్నెల్ అక్వేరియం
- వికారాబాద్‌లో క్యారవాన్ పార్కు
- నేడు ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం

సేద్యంలో అవకాశాలెన్నో!



- ఖమ్మంలో సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్సు
- హైదరాబాద్ శివార్లలో డెయిరీ ప్రాసెసింగ్ యూనిట్
- గ్రామీణ, విద్యా రంగాల్లో వసతుల కల్పనే ప్రాధాన్యాలు
- 'ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ'లో గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామి

కొరియా తర్వాత ఇక్కడే..



- హైదరాబాద్ మాకు కీలకం
- ప్రపంచవ్యాప్తంగా మాకున్న ఐదు పరిశోధన కేంద్రాల్లో ఒకటి తెలంగాణలో ఉంది
- ఇక్కడ మరిన్ని పెట్టుబడులు పెట్టే ఆలోచన చేస్తున్నాం
- 'ఆంధ్రజ్యోతి'తో హ్యుందయ్ ఎండీ చాంగ్ యో

రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెడతాం



పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన ప్రాంతం. అన్నిరకాల సహకారం అందిస్తామని రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. నాకు ఇచ్చిన గౌరవం, ఆతిథ్యం మరువలేనిది. ఫ్యూచర్ సిటీలో వచ్చే పదేళ్లలో లక్ష కోట్ల పెట్టుబడులు పెడతాం.

- ఎరిక్ స్విడర్, డైరెక్టర్, ట్రంప్ మీడియా

రేవంత్ పాలనతో విశ్వాసం



రేవంత్ పారదర్శక పాలన, వేగవంతమైన నిర్ణయాలు, దీర్ఘకాలిక ప్రణాళికలతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరుగుతోంది. ఆవిష్కరణలకు, సుస్థిరతకు, నైపుణ్యాభివృద్ధికి.. పోటీతత్వం కలగలిసిన వాతావరణాన్ని తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తోంది.

- కరణ్ అదానీ, ఎండీ, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్

ఉచిత బస్సు, రుణ మాఫీ భేష్



రేవంత్ విజన్ చూస్తుంటే.. భవిష్యత్తులో 'సరికొత్త తెలంగాణ'ను చూస్తామన్న నమ్మకం కలుగుతోంది. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ, ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు అభినందనీయం.

- కైలాష్ సత్యార్థి, నోబెల్ గ్రహీత



పెళ్లికి నో చెప్పిందని..

- మరదలిని కత్తితో గొంతు కోసి చంపిన బావ
- తల్లి కళ్లెదుటే దారుణం
- హైదరాబాద్ వారాసిగూడలో ఘటన

3


సహజీవనంలో అనుమానం

14

నిర్మల్‌లో మహిళ దారుణ హత్య

వందేమాతరానికి నెహ్రూ ద్రోహం

- జిన్నాకు తలొగ్గి గేయాన్ని ఛిన్నాభిన్నం చేశారు: మోదీ
- సామాజిక సామరస్యం ముసుగులో రెండు చరణాలకు కుదించారు
- ఇప్పటికీ అదే బుజ్జగింపు రాజకీయం.. కాంగ్రెస్‌పై ప్రధాని ధ్వజం



న్యూఢిల్లీ, డిసెంబరు 8: ముస్లింలీగ్ నేత మహ్మదాలీ జిన్నాకు తలొగ్గి.. ప్రథమ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ వందేమాతర గేయానికి ద్రోహం చేశారని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. దానిని ఛిన్నాభిన్నం చేసి.. భారత్‌ను బుజ్జగింపు రాజకీయాల వైపు తీసుకెళ్లారని ఆక్షేపించారు. బంకించంద్ర ఛటర్జీ 1875లో 'వందేమాతరం' గేయాన్ని రాశారు. ఇది జరిగి 150 ఏళ్లయిన సందర్భంగా సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు లోక్‌సభలో ప్రధాని ప్రత్యేక చర్చను ప్రారంభించారు. అర్ధరాత్రి 11.42 గంటల వరకు సుదీర్ఘంగా ఇది

మిగతా 2వ పేజీలో...



తిప్పికొట్టిన ప్రియాంక

- బెంగాల్ ఎన్నికల కోసమే ఈ అంశంపై చర్చ
- స్వతంత్రం కోసం నెహ్రూ 12 ఏళ్లు జైల్లో ఉన్నారు
- మోదీ ఆత్మవిశ్వాసం తగ్గుతోందన్న కాంగ్రెస్ నేత
- కాంగ్రెస్‌లో పశ్చాత్తాపమే లేదని బీజేపీ ఆగ్రహం
- లోక్‌సభలో 11 గంటలకు పైగా సుదీర్ఘ చర్చ

ఏడో రోజూ అంతే!

- కొనసాగిన ఇండి'గోల'.. సోమవారం 562 విమానాల రద్దు
- 6 మెట్రో ఎయిర్‌పోర్టులపై ఇండిగో తీవ్ర ప్రభావం.. సమస్య తీవ్రం: సీజేఐ
- 10వ తేదీకి దారిలోకి: ఇండిగో.. కేంద్రం జవాబు చెప్పాలి.. లోక్‌సభలో విపక్షాలు
- కఠిన చర్యలు తప్పవు.. 2 రోజుల్లో పరిస్థితి మార్చాం.. రాజ్యసభలో రామ్మోహన్
- విమర్శలు పట్టించుకోవద్దు: మోదీ.. కేంద్ర మంత్రికి ప్రధాని దన్ను

2



ఇండిగో విమానాలు నిలిచిపోవడంతో ఢిల్లీ ఎయిర్‌పోర్టులో పోగుపడిన ప్రయాణికుల లగేజీ

పూలమ్మిండు.. పాలమ్మిండు.. వేల ఎకరాలు కబ్జా పెట్టిండు!

- ఎమ్మెల్యే మల్లారెడ్డి పేదలకు చేసిందేమీ లేదు
- ఆయన అక్రమాలను సీఎం పట్టించుకోవట్లే
- బీఆర్ఎస్‌లో బీటీ బ్యాచ్‌కే మంత్రి పదవులు
- కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యేలు భూ కబ్జాలు చేయడం ఆపాలి: కవిత

14



ఓడిపోతానేమో..

- ఉరేసుకున్న సర్పంచ్ అభ్యర్థి
- గుండెపోటుతో మరో ఇద్దరి మృతి
- నేటితో ముగియనున్న తొలివిడత ఎన్నికల ప్రచారం
- ఎల్లుండి తొలివిడత సర్పంచ్, వార్డు స్థానాలకు పోలింగ్

14

బాబోయ్ చలి

- పలుచోట్ల అత్యల్ప ఉష్ణోగ్రతలు
- సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 6.6, ఆదిలాబాద్ జిల్లా అర్లి(టి)లో 7.4, కుమరం భీం ఏజెన్సీ గిన్నెధరిలో 8.2
- హైదరాబాద్‌లోనూ గజ గజ
- శేరిలింగంపల్లిలో 8.4 డిగ్రీలు

3

రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ రైజింగ్ కాదు.. ఫాలింగ్!

- గ్లోబల్ సమ్మిట్ కాదు.. గోబెల్స్ సమ్మిట్
- రెండేళ్ల పాలన.. నిస్సారం, నిష్ఫలం, నిరర్థకం
- రేవంత్‌రెడ్డిది వ్యవస్థీకృత అవినీతి
- విందు వినోదాలకు అడ్డాగా ప్రజాభవన్
- రాష్ట్రంలో ఆంధ్రా పెత్తనం: హరీశ్‌రావు

14



ప్రవేశ పరీక్షలకు రాత విధానమే మేలు

» పార్లమెంటరీ కమిటీ సిఫార్సు.. ఎన్‌టీఏ తీరుపై అసంతృప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 8: ప్రవేశ పరీక్షలను రాతపూర్వక విధానంలో నిర్వహిస్తే మంచిదని పార్లమెంటరీ కమిటీ అభిప్రాయపడింది. యూపీఎస్సీ, సీబీఎస్సీ బోర్డులు ఎలాంటి పేపరు లీకుల బెడద లేకుండానే సమర్థంగా రాత పూర్వక పరీక్షలు జరుపుతున్నందున అలాంటి విధానాన్ని పాటించడం మేలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)కు సూచించింది. పెన్-పేపరు విధానంలో పరీక్ష పేపర్ల లీకుకు అవకాశం ఉందని, అదే కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్-సీబీటీ) జరపాలనుకుంటే ఎవరూ కనిపెట్టలేని రీతిలో హ్యాకింగ్ చేసే ప్రమాదం ఉందని పేర్కొంది. అందువల్ల తగిన జాగ్రత్తలు తీసుకొని లిఖితపూర్వక విధానాన్నే అమలు చే యడమే మంచిదని అభిప్రాయపడింది. కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ్ సింగ్ ఆధ్వర్యంలో విద్య, మహిళా-శిశు సంక్షేమం, యువజన వ్యవహారాలు, క్రీడలపై ఏర్పాటయిన పార్లమెంటరీ స్థాయీ సంఘం తాజాగా సమర్పించిన నివేదికలో ఈ విషయాలను ప్రస్తావించింది. ఒకవేళ కంప్యూటర్ ద్వారా నిర్వహించాల్సి వస్తే ప్రయివేటు సంస్థల సెంటర్లకు అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేసింది. కేవలం ప్రభుత్వ సంస్థల సెంటర్లలోనే నిర్వహించాలని తెలిపింది. గత ఆరేళ్లలో ఎన్‌టీఏ ఫీజుల రూపంలో రూ.3,512.88 కోట్లను వసూలు చేసిందని, అందులో రూ.3,064.77 కోట్లను ఖర్చు చేసిందని తెలిపింది.

స్టార్‌లింక్ ఇంటర్‌నెట్.. నెలకు రూ.8600

న్యూఢిల్లీ, డిసెంబరు 8: అపర కుబేరుడు ఈలన్ మస్క్‌కు చెందిన ఉపగ్రహ ఇంటర్‌నెట్ సేవల సంస్థ 'స్టార్‌లింక్' సంస్థ భారత్‌లో అందించే సేవల ధరలను వెల్లడించింది. ఎలాంటి బ్రాడ్‌బ్యాండ్, మొబైల్ డేటా సేవలూ అందని ప్రదేశాల్లో ఉపయోగపడే ఈ శాటిలైట్ ఇంటర్‌నెట్ సేవలకు.. గృహవినియోగదారులు నెలకు రూ.8,600 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొంది. అలాగే.. దీనికి సంబంధించిన హార్డ్‌వేర్ కిట్‌ను రూ.34 వేలు చెల్లించి కొనుగోలు చేయాలి. ఈ ప్లాన్ కింద వినియోగదారులు అపరిమిత డేటాను అందుకుంటారు. 30రోజుల ఉచిత ట్రయల్ పీరియడ్ ఉంటుంది. గృహ వినియోగదారులకు సంబంధించి నెలవారీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను వెల్లడించిన స్టార్‌లింక్.. వాణిజ్య వినియోగానికి సంబంధించిన ప్లాన్లను విడుదల చేయలేదు. అయితే.. మనదేశంలో అదే రూ.8600తో ఏడాది మొత్తం బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుకోవచ్చని.. ఆ ప్యాకేజీలోనే కొన్ని ఓటీటీలను కూడా ఉచితంగా చూడొచ్చని నెటిజన్లు గుర్తుచేస్తున్నారు. రూ.500కే అపరిమిత ఇంటర్‌నెట్ సేవలు లభించే ఇండియాలో.. స్టార్‌లింక్ ఈ స్థాయి ధరలతో మనుగడ సాగించడం కష్టమేనంటున్నారు.

ఐదున్నరేళ్లలో 6.15 లక్షల కోట్ల లోన్లు రైటాఫ్

న్యూఢిల్లీ, డిసెంబరు 8: గత ఐదున్నరేళ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకు (పీఎస్‌బీ)లు రూ.6.15 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయని లోక్‌సభలో కేంద్రం తెలిపింది. 'ఆర్బీఐ డేటా ప్రకారం.. గత ఐదు ఆర్థిక సంవత్సరాలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరు 30 వరకు ప్రభుత్వ రంగ బ్యాంకులు మొత్తం రూ.6,15,647 కోట్ల రుణాలను రైటాఫ్ చేశాయి' అని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వక సమాధానంలో పేర్కొన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం నుంచి పీఎస్‌బీలకు ఎటువంటి మూలధన సాయం చేయలేదని.. ఆయా బ్యాంకులు తమ ఆర్థిక పనితీరు, మూలధన స్థితిని గణనీయంగా మెరుగుపర్చుకుని లాభదాయకంగా మారాయన్నారు. పీఎస్‌బీలు ఇప్పుడు తమ మూలధన అవసరాలను తీర్చుకోవడానికి మార్కెట్ వనరులు, అంతర్గత సముపార్జనలపై ఆధారపడుతున్నాయని.. అవి 2022 ఏప్రిల్ 1 నుంచి 2025 సెప్టెంబరు 31 వరకు ఈక్విటీ, బాండ్ల ద్వారా మార్కెట్ నుంచి రూ.1.79 లక్షల కోట్ల మూలధనాన్ని సేకరించాయని తెలిపారు.

హమాస్‌ను ఉగ్రవాదసంస్థగా ప్రకటించండి!

» భారత్‌కు ఇజ్రాయెల్ విజ్ఞప్తి

జెరూసలేం, డిసెంబరు 8: పాలస్తీనా మిలిటెంట్ సంస్థ హమా‌స్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని భారత్‌ను ఇజ్రాయెల్ కోరింది. భారత్‌లో పలు ఉగ్ర దాడులకు కారణమైన పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తాయిబాను తాము 2023లోనే టెర్రరిస్టు సంస్థగా గుర్తిస్తూ నిషేధించామని, ఇప్పుడు భారత్ నుంచి అదే రకమైన స్పందనను కోరుకుంటున్నామని పేర్కొంది. ఈ మేరకు ఇజ్రాయెల్ విదేశాంగశాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి సోమవారం విలేకర్లతో మాట్లాడారు. 'హమాస్‌కు లష్కరే తాయిబాతోపాటు పలు ఇరాన్ ప్రాయోజిత మిలిటెంట్ గ్రూపులతో సాన్నిహిత్యం పెరుగుతోంది. దీనివల్ల భారత్, ఇజ్రాయెల్‌లకు భద్రతాపరంగా ముప్పు రోజురోజుకూ అధికమవుతోంది' అని తెలిపారు. కాగా, ఇదే అంశంపై ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కర్నల్ నాదవ్ షోషనీ స్పందిస్తూ.. హమాస్‌ను భారత్ టెర్రరిస్టు సంస్థగా ప్రకటిస్తే, ఇరు దేశాలకూ ఒకే ఉమ్మడి శత్రువు ఉన్నట్లుగా స్పష్టమవుతుందని, హమాస్ పట్ల భారత్ వైఖరి ఏమిటన్నది ప్రపంచానికి తెలుస్తుందని వివరించారు.

ఉమీద్ పోర్టల్‌లో 5.17లక్షల ఆస్తుల నమోదు

న్యూఢిల్లీ, డిసెంబరు 8: వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు సంబంధించి కేంద్రం తీసుకువచ్చిన ఉమీద్ పోర్టల్‌లో గడువు ముగిసే నాటికి(డిసెంబరు 6) 5,17,040 ఆస్తుల వివరాలను అప్‌లోడ్ చేశారు. అయితే, ఇందులో ఇప్పటివరకు 2,16,905 ఆస్తులను మాత్రమే వక్ఫ్ ప్రాపర్టీలుగా సంబంధిత అధికారులు ఆమోదించారు. 10,869 ఆస్తులను తిరస్కరించారు. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ సమాచారాన్ని విడుదల చేసింది. ఉమీద్ పోర్టల్‌లో అత్యధికంగా యూపీ నుంచి 92,830 ఆస్తులను నమోదు చేయగా, 62,939ఆస్తులతో మహారాష్ట్ర తర్వాతి స్థానంలో ఉంది. వక్ఫ్ ఆస్తులను డిజిటలైజ్ చేయాలన్న ఉద్దేశ్యంతో కేంద్రం జూన్ 6న ఉమీద్ పోర్టల్‌ను తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా ఉన్న వక్ఫ్ ఆస్తులను అందులో రిజిస్టర్ చేసుకోవాలని సూచించింది. ఇందుకు ఆరు నెలల గడువు ఇస్తూ డిసెంబరు 6ను డెడ్‌లైన్‌గా విధించింది. ఉమీద్ పోర్టల్‌లో రిజిస్టర్ అయి, ధ్రువీకరించిన ఆస్తులను మాత్రమే వక్ఫ్ ఆస్తులుగా గుర్తిస్తామని కేంద్రం గతంలో ప్రకటించింది. ఈ నేపథ్యంలో పోర్టల్‌లో ఆస్తి పత్రాలు వేగంగా అప్‌లోడ్ కావడం లేదని, గడువును పెంచాలని ఎన్నో విజ్ఞప్తులు వచ్చాయి. కానీ, గడువు పొడిగింపుపై కేంద్రం ఏ ప్రకటనా చేయలేదు.

సిద్ధరామయ్యకు సుప్రీంకోర్టు నోటీసు

బెంగళూరు, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని దాఖలైన పిటిషన్‌కు స్పందించిన సుప్రీంకోర్టు ఆయనకు సోమవారం నోటీసులు జారీ చేసింది. మైసూరు జిల్లా వరుణ నియోజకవర్గం నుంచి 2023లో సిద్ధరామయ్య ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయన అక్రమాలకు పాల్పడ్డారని శంకర్ అనే వ్యక్తి గతంలో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు కొట్టివేయడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ విక్రమనాథ, జస్టిస్ సందీప్ మెహతా నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌ను సోమవారం విచారించింది. దీనికి బదులివ్వాలని సీఎం సిద్ధరామయ్యతో పాటు ఎన్నికల కమిషన్‌కు సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది.

రేప్ కేసుల విచారణలో జడ్జిల అనుచిత వ్యాఖ్యలపై సుప్రీంకోర్టు అసంతృప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 8: అత్యాచార కేసుల విచారణ సందర్భంగా జడ్జీలే బాధితుల పట్ల సున్నితత్వం లేని వ్యాఖ్యలు చేస్తుండడాన్ని సోమవారం సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. ఇలాంటి మాటలు బాధితులతో పాటు వారి కుటుంబ సభ్యులు, మొత్తం సమాజాన్నే వణికిస్తాయని తెలిపింది. ఇటువంటి సంఘటనలన్నింటినీ పరిశీలించి హైకోర్టులు, ట్రయల్ కోర్టులకు మార్గదర్శకాలు జారీ చేస్తామని ధర్మాసనం తెలిపింది. మార్చి 17న అలహాబాద్ హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై సుమోటోగా జరుపుతున్న విచారణ సందర్భంగా ఈ విషయాన్ని వెల్లడించింది. మైనర్ బాలిక స్తనాలను తాకడం, ఆమె పైజామా తాడు లాగడం, లోదుస్తులను లాగడానికి ప్రయత్నించడాన్ని అత్యాచార ప్రయత్నాలుగా పరిగణించలేమంటూ హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొనడంపై విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం దృష్టికి కొందరు న్యాయవాదులు మరికొన్ని ఉదంతాలను తీసుకెళ్లారు. సీనియర్ న్యాయవాది శోభా గుప్తా మాట్లాడుతూ 'రాత్రి వేళ సంఘటన జరిగిందంటే.. బాధితురాలు నిందితుడ్ని ఆహ్వానించినట్టే'నని మరో కేసులో ఇదే హైకోర్టు మౌఖికంగా వ్యాఖ్యానించిందని తెలిపారు. అన్నింటినీ పరిశీలించి సమగ్రంగా మార్గదర్శకాలు ఇస్తామని సుప్రీంకోర్టు పేర్కొంది.

వందేమాతరానికి నెహ్రూ ద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

జరిగింది. పాలక, ప్రతిపక్షాల నడుమ మాటల తూటాలు పేలాయి. 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంతో బ్రిటిష్ సామ్రాజ్యం గడగడలాడిందని.. ఆ తర్వాత వందేమాతర గేయం దానిని సవాల్ చేసిందని.. స్వాతంత్ర్య పోరాటాన్ని ఉధ్రుతలూగించి.. స్వాతంత్ర్య సాధన దిశగా జాతీయ సంకల్పానికి ప్రతీకగా నిలిచిందని.. దీనివల్లే దీనిని భారత జాతీయ గీతంగా చేయాలని మహాత్మాగాంధీ అభిలషించారని ఆయన చెప్పారు. గాంధీజీ మనోభావాలను తోసిరాజని.. ఈ గేయాన్ని వివాదంలోకి నెట్టి ఎందుకు ద్రోహం చేశారో తనకు అర్థం కాలేదన్నారు. 'ముస్లింలీగ్ నాయకుడు మహ్మదాలీ జిన్నా లఖ్‌నవూలో 1937 అక్టోబరు 15న వందేమాతరంపై తన వ్యతిరేకత వ్యక్తంచేశారు. ఆ తర్వాత ఐదు రోజులకే నెహ్రూ నేతాజీకి లేఖ రాశారు. బంకించంద్ర ఛటర్జీ 'ఆనందమఠ్' నవల కోసం ఈ గేయాన్ని రాశారని.. ఈ నేపథ్యం ముస్లింలను ఇబ్బందిపెట్టే అవకాశముందని అందులో పేర్కొన్నారు. బంకించంద్ర స్వరాష్ట్రమైన బెంగాల్లోనే.. కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం వందేమాతరంపై సమీక్ష జరిపింది. అక్టోబరు 26న సామాజిక సామరస్యం ముసుగులో.. గేయాన్ని రెండు చరణాలకు కుదించాలని నిర్ణయించింది. దీంతో యావద్దేశం దిగ్భ్రాంతికి గురైంది. కాంగ్రెస్ నిర్ణయానికి వ్యతిరేకంగా దేశభక్తులు నిరసనలు చేపట్టారు. ముస్లింలీగ్‌కు కాంగ్రెస్ మోకరిల్లి బుజ్జగింపు రాజకీయాలకు దిగిందనడానికి చరిత్ర తార్కాణంగా నిలిచింది. సదరు రాజకీయాల ఒత్తిడితోనే వందేమాతరంతోపాటు దేశవిభజనకూ తలొగ్గింది' అని మండిపడ్డారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాల వైఖరి ఇప్పటికీ మారలేదని.. బుజ్జగింపు రాజకీయాలు కొనసాగిస్తూ.. వందేమాతరంపై వివాదాలు సృష్టించే యత్నాలు చేస్తూనే ఉన్నాయన్నారు.

పూర్వవైభవం తేవాలి: రాజ్‌నాథ్

వందేమాతరం పూర్తి గేయం గానీ, ఆనందమఠ్ నవల ఇస్లాంకు వ్యతిరేకం కాదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నొక్కి చెప్పారు. నాటి బెంగాల్ నవాబుకు, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రజల మనోభావాలను అవి ప్రతిబింబిస్తున్నాయని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వందేమాతరాన్ని నిర్లక్ష్యం చేశామని, దానికి ఇవ్వాల్సిన ప్రాధాన్యం ఇవ్వలేదని చెప్పారు. దానికి పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపిచ్చారు. కాగా, గాంధీ కుటుంబాన్ని, కాంగ్రెస్‌ను మోదీ ఎండగడుతున్నందున.. అపరాధ భావనతోనే రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ సభలో వందేమాతరంపై మోదీ ప్రసంగించే సమయంలో గైర్హాజరయ్యారని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా ఆరోపించారు. వందేమాతరం విషయంలో కాంగ్రెస్‌లో పశ్చాత్తాపమే లేదని మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ ధ్వజమెత్తారు. ఇంకా తేజస్వీ సూర్య (బీజేపీ), బైరెడ్డి శబరి, జి.లక్ష్మీనారాయణ (టీడీపీ), సునీల్ తత్కరే (ఎన్‌సీపీ), రాజ్‌కుమార్ సాంఘ్వాన్ (ఆర్‌ఎల్‌డీ), దీపేందర్ హుడా, పరిణితి షిండే, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి (కాంగ్రెస్), మహువా మొయిత్రా, కాకోలీ ఘోష్ దస్తీదార్ (టీఎంసీ), అవధేశ్ ప్రసాద్, ఇక్రా చౌధరి, ప్రియా సరోజ్ (సమాజ్‌వాదీ), రాజారాంసింగ్ (సీపీఐఎంఎల్ లిబరేషన్), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), హనుమాన్ బెనీవాల్ (ఆర్‌ఎల్‌పీ), తదితరులు చర్చలో పాలుపంచుకున్నారు.



బంకిన్ దా కాదు.. బంకిన్ బాబు!

బంకించంద్ర ఛటర్జీని మోదీ తన ప్రసంగంలో 'బంకిన్ దా' అని పిలవడంపై టీఎంసీ ఎంపీ సౌగతారాయ్ అభ్యంతరం తెలిపారు. దీంతో ప్రధాని వెంటనే 'బంకిన్ బాబు' అని సరిదిద్దుకున్నారు. సౌగతారాయ్‌ను దాదా అనే అంటానని.. దీనిపైనా అభ్యంతరం చెబుతారా అని చురకంటించారు. కాగా, వందేమాతరంపై చర్చ కోసం ప్రధాని సోమవారం సభలో అడుగుపెట్టగానే..బీజేపీ ఎంపీలు 'బిహార్ కీ జీత్ హమారీ హై...అబ్ బెంగాల్ కీ బారీ హై(తర్వాతి వంతు బెంగాల్‌దే)' అని స్వాగతం పలికారు.

మహా అసెంబ్లీలో పూర్తిగా ఆలాపన

మహారాష్ట్ర అసెంబ్లీలో వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించారు. సోమవారం అసెంబ్లీ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. సంప్రదాయం ప్రకారం ఉభయ సభల్లోనూ వందేమాతరం తొలి రెండు చరణాలను ఆలపించిన తర్వాత రాష్ట్ర గీతం 'జై జై మహారాష్ట్ర' గేయాన్ని ఆలపించారు. అయితే, వందేమాతరం 150 సంవత్సరాల సందర్భంగా ఈ ఏడాది వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించాలని అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నర్వేకర్, శాసనమండలి చైర్మన్ రామ్ షిండే సూచించారు. దీంతో ఉభయసభల్లోనూ వందేమాతరం పూర్తి గేయాన్ని ఆలపించారు.

మోదీ ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతోంది: ప్రియాంక



మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తిప్పికొట్టారు. ఆయన ఆత్మవిశ్వాసం రోజురోజుకూ సన్నగిల్లుతోందన్నారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం వందేమాతరంపై చర్చను చేపట్టిందని ఆరోపించారు. 'నెహ్రూను తరచూ విమర్శించే బదులు ఆయనకు వ్యతిరేకంగా ఉన్న అన్ని నిందలపై ఒకేసారి చర్చించి ఆ అధ్యాయాన్ని ఇక ముగిద్దాం. అవి 999 లేదా 9999 నిందలు కావచ్చు. ఇందిర, రాజీవ్ ఏమి చేశారో? వారసత్వ రాజకీయాలు ఏమి చేశాయో? మీ ఫిర్యాదులన్నీ దేశానికి ఒకేసారి చెప్పండి. తర్వాత వాటిపై చర్చిద్దాం. ఆ తర్వాత ధరల పెరుగుదల, నిరుద్యోగ సమస్యలపై చర్చిద్దాం' అన్నారు. మోదీ ప్రధాని పదవిలో 12 ఏళ్లు పూర్తి చేసుకున్నారని, నెహ్రూ దేశ స్వాతంత్ర్యం కోసం 12 ఏళ్లు జైల్లో ఉన్నారని చెప్పారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ మోదీ ఏ అంశంపై మాట్లాడినా.. నెహ్రూ, కాంగ్రెస్‌లను ప్రస్తావించడం అలవాటైపోయిందన్నారు. బీజేపీ పూర్వీకులు వందేమాతరాన్ని ఆలపించలేదన్నారు. సమాజ్‌వాదీ నాయకుడు అఖిలేశ్ మాట్లాడుతూ స్వాతంత్య పోరాటంలో పాల్గొననివారు వందేమాతరం విలువల గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. 'విద్వేషాలు సృష్టించేందుకు విచ్ఛిన్న శక్తులు వందేమాతరాన్ని వాడుకుంటున్నాయి. బ్రిటిష్ పాలకుల విభజించు-పాలించు విధానాన్నే వీరు అవలంబిస్తున్నారు' అన్నారు. వందేమాతరం హిందువుల గీతం అన్నట్టు ప్రచారం చేసినవారే ఆ గీతంపై వివాద సృష్టికి, విభజనకు కారకులని డీఎంకే ఎంపీ ఎ.రాజా అన్నారు. దీనిపై వివాదం సమాజం సృష్టించింది కాదని, ముస్లింలు దానికి కారణం కాదని, ఈ గీతానికి మతం రంగు పులిమినవారి వల్లే సమస్య తలెత్తిందన్నారు.

లోకం తీరు



రాష్ట్ర బార్ కౌన్సిళ్ల పదవుల్లో మహిళలకు 30% కోటా

» ఎన్నికల ప్రక్రియ ప్రారంభం దృష్ట్యా ఏపీ, తెలంగాణలకు మినహాయింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 8: రాష్ట్ర బార్ కౌన్సిళ్ల పదవుల్లో 30 శాతాన్ని మహిళా న్యాయవాదులకు కేటాయించాలని సోమవారం సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది ఇంకా బార్ కౌన్సిల్ ఎగ్జిక్యూటివ్ కమిటీల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాని రాష్ట్రాల్లో ఈ ఆదేశాలను అమలు చేయాలని తెలిపింది. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో మాత్రం నోటిఫికేషన్ ప్రకారం ముందుకు సాగవచ్చని స్పష్టం చేసింది. ఒకవేళ తగినంత మంది మహిళా న్యాయవాదులు లేకున్నా, పోటీ చేయడానికి ఇష్టపడకున్నా అలాంటపుడు 20 శాతం పదవులను ఎన్నిక ద్వారా, మిగిలిన 10 శాతం పదవులను కోఆప్షన్ ద్వారా నియమించుకోవచ్చంటూ వెసులుబాటు కల్పించింది. మహిళలు ముందుకు రానప్పుడు కోఆప్షన్ ద్వారా నియమించుకోవచ్చని పేర్కొంది. కోఆప్షన్ ద్వారా నియమించేందుకు ప్రతిపాదించే మహిళా న్యాయవాదుల పేర్లను తొలుత కోర్టు ముందు ఉంచాలని తెలిపింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీల ధర్మాసనం ఉత్తర్వులిచ్చింది. తొలుత సీనియర్ న్యాయవాది, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) చైర్మన్ మనన్ కుమార్ మిశ్ర మాట్లాడుతూ.. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా బార్ కౌన్సిళ్ల ఎన్నికలు కొన్ని రాష్ట్రాల్లో ప్రారంభమయినట్టు చెప్పారు. దీంతో, ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్, బిహార్ ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఈ ఉత్తర్వులను వర్తింపజేయడం సరికాదని సుప్రీంకోర్టు తెలిపింది. ఇక్కడ నామినేషన్లు సమర్పించిన మహిళలు ఉత్సాహంగా పోటీ చేయాలని, మహిళా ప్రాతినిధ్యం ఉండేలా సభ్యులు కూడా ఓట్లు వేయాలని విజ్ఞప్తి చేసింది.

ఇండిగో వ్యవహారాన్ని తేలికగా తీసుకోలేదు

» కఠిన చర్యలు తప్పవు: మంత్రి రామ్మోహన్



న్యూఢిల్లీ, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇండిగో సంక్షోభంపై పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ అడిగిన ప్రశ్నకు స్పందించారు. "ఇండిగో సిబ్బంది రోస్టరింగ్ సహా అంతర్గత ప్రణాళిక వైఫల్యం కారణంగానే ఈ సంక్షోభం తలెత్తింది. పౌర విమానయాన రంగంలో కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నాం. ఈ నెల 3వ తేదీ వరకు అన్నీ సజావుగానే సాగాయి. తర్వాత ఇబ్బంది తలెత్తింది. విమానాల రద్దుకు దారితీసిన సాఫ్ట్‌వేర్ విషయంపై విచారణకు ఆదేశించాం. అన్ని విమాన సంస్థలతోనూ చర్చించాం. విమానాశ్రయాల్లో పరిస్థితులను నియంత్రించాం. దీంతో గత రెండు రోజుల్లో పరిస్థితుల్లో మార్పు స్పష్టంగా కనిపించింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని తేలికగా తీసుకోవడం లేదు. ఈ విషయంలో కఠిన చర్యలు తీసుకుంటాం" అని రామ్మోహన్‌నాయుడు తెలిపారు. పౌర విమానయాన రంగంలో భవిష్యత్తులో ఉల్లంఘనలకు పాల్పడే వారికి గుణపాఠం చెప్పేలా తమ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కాగా, ఇండిగో అంశంలో సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తున్నారని రామ్మోహన్‌కు ప్రధాని మోదీ కితాబు ఇచ్చారు. ఇండిగో సంక్షోభంపై సోమవారం రాజ్యసభలో రామ్మోహన్ ఇచ్చిన సమాధానంపై ప్రధాని సంతృప్తి వ్యక్తం చేశారు.

ఏడో రోజూ అంతే!

కొనసాగిన ఇండి'గోల'.. 562 విమానాల రద్దు

» అత్యవసర విచారణకు సుప్రీం నిరాకరణ

న్యూఢిల్లీ/చెన్నై, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇండిగో విమానాల సంక్షోభం వరుసగా ఏడురోజూ కొనసాగింది. సోమవారం కూడా బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ సహా పలు ఆరు మెట్రో విమానాశ్రయాల్లో 562 విమానాల సేవలు రద్దయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు ఇండిగో వ్యవహారంపై అత్యవసరంగా జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రభుత్వం ఈ విషయంలో స్పందించిందని, చర్యలు కూడా తీసుకుందని కోర్టు వ్యాఖ్యానించింది. లక్షల మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, అయితే.. ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించి, చర్యలకు ఆదేశించిందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇది తీవ్ర విషయమే అయినప్పటికీ.. ప్రభుత్వం చర్యలకు ఆదేశించిన నేపథ్యంలో వేచి చూద్దామని, అత్యవసర విచారణ అవసరం లేదని పేర్కొంది. ఇండిగో విమానాల రద్దు ప్రభావం వరుసగా ఏడో రోజు కూడా భారీగా కనిపించింది. బెంగళూరు విమానాశ్రయంలో 150, ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం(ఐజీఐ)లో 143, చెన్నైలో 71 విమానాలు రద్దయ్యాయి. అదేవిధంగా అహ్మదాబాద్, ముంబై, చెన్నై, జైపూర్, గువాహటి విమానాశ్రయాల్లోనూ వందలాది విమానాల రద్దుతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు, విమాన సర్వీసులను భారీ సంఖ్యలో రద్దు చేస్తుండడాన్ని ప్రశ్నిస్తూ డీజీసీఏ ఇచ్చిన షోకాజ్ నోటీసుకు ఇండిగో సంస్థ సోమవారం సమాధానం ఇచ్చింది. పలు కారణాల వల్ల సేవలకు అంతరాయం కలిగినట్టు పేర్కొంది. పలు సమస్యలు ఉన్నందున ఖచ్చితమైన కారణం ఏదన్నదాన్ని చెప్పలేమని పేర్కొంది.

శంషాబాద్‌లో 112 విమానాలు రద్దు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇండిగో విమాన సర్వీసుల రద్దు కొనసాగుతోంది. సోమవారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మొత్తం 112 విమాన సర్వీసులు రద్దయ్యాయి. వీటిలో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన 54 విమానాలు, అలాగే ఇతర ప్రాంతాల నుంచి శంషాబాద్‌కు చేరుకోవాల్సిన 58 విమాన సర్వీసులు ఉన్నాయి. ఆరు రోజులుగా ఈ విమానాశ్రయంలో దాదాపు 650 విమానాలు రద్దయ్యాయి. ఇదిలా ఉండగా, ఇండిగో సంక్షోభం నేపథ్యంలో ఆ కంపెనీని నిర్వహిస్తున్న ఇంటర్ గ్లోబ్ ఏవియేషన్ సంస్థ షేర్ల విలువ సోమవారం 8% కన్నా అధికంగా తగ్గింది.



అహ్మదాబాద్‌లో విమానాల రద్దుతో రైలుకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

10వ తేదీకల్లా పరిష్కారం: ఇండిగో

ప్రస్తుత సంక్షోభంపై వివరణ ఇచ్చేందుకు ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌కు నిర్దేశించిన గడువును డీజీసీఏ పొడిగించింది. మరో 24 గంటలపాటు(సోమవారం సాయంత్రం 6 వరకు)సమయం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. మరోవైపు ఇండిగో వ్యవహారంపై విచారణకు నలుగురు సభ్యులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. బుధవారం కమిటీ ముందు హాజరు కావాలని ఇండిగో సీఈవో పీటర్ ఎల్బెర్స్‌కు సమన్లు జారీ చేసింది. ఇదిలావుంటే, ఈ నెల 10వ తేదీ నాటికి అన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని ఇండిగో తెలిపింది. విమానాల సేవలు సాధారణ స్థితికి వస్తాయని వివరించింది. కాగా, సోమవారం టికెట్లకు సంబంధించి రూ.827 కోట్లను ప్రయాణికులకు తిరిగి చెల్లించారు. మరోవైపు.. ప్రస్తుత కీలక సమయంలో సహకరించాలని పైలట్లకు డీజీసీఏ విన్నవించింది.

దూసుకొస్తున్న బుల్లెట్ ట్రైన్!

2026 నాటికి అహ్మదాబాద్-ముంబై ట్రాక్ పనులు పూర్తి

» 2027లో ట్రయల్ రన్

(అహ్మదాబాద్ నుంచి ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

బుల్లెట్ ట్రైన్ త్వరలోనే భారత్‌కు దూసుకురానుంది. అహ్మదాబాద్-ముంబై వాణిజ్య కారిడార్ మధ్య చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగంగా 2027 ఆగస్టులో తొలిసారిగా ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. 2029 ఏడాది చివరినాటికి దీన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ప్రయత్నిస్తున్నారు. ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టుకు 2018లోనే రూపకల్పన జరిగింది. రైల్వే స్టేషన్లు, ట్రాక్‌ల నిర్మాణం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గంటలకు 320 కి.మీ. వేగంతో దూసుకెళ్లే బుల్లెట్ ట్రైన్ కోసం ప్రత్యేకంగా గుజరాత్‌లో 8 స్టేషన్లు, మహారాష్ట్రలో 4 స్టేషన్లు నిర్మిస్తున్నారు. ఈ రైలు అందుబాటులోకి వస్తే సబర్మతి నుంచి ముంబైకి 2 గంటలా 7 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. ఈ రైలు సబర్మతిలో బయల్దేరి అహ్మదాబాద్, వడోదర, భరూచ్, సూరత్, బిల్‌మోర, వాపి, బొయిసార్, విరార్, థానే మీదుగా ముంబైకి చేరుకుంటుంది. భారత్‌లో బుల్లెట్ ట్రైన్ వేగాన్ని గంటకు 350 కి.మీ.కే పరిమితం చేస్తున్నప్పటికీ.. 500 కి.మీ. వేగంతో దూసుకెళ్లినా తట్టుకునేలా ట్రాక్‌ను సిద్ధం చేస్తున్నారు. 2026 మార్చి నాటికి ట్రాక్ పనులు పూర్తవుతాయి. 2027ఆగస్టులో సబర్మతి నుంచి బిల్మోరా వరకు ట్రయల్ రన్ నిర్వహిస్తారు.

జపాన్ సాంకేతికతతో ట్రాక్..

బుల్లెట్ ట్రైన్ కోసం జపాన్ సాంకేతికతతో వయాడక్ట్ ట్రాక్ వేస్తున్నారు. దీనికోసం నదులపై ప్రత్యేకంగా బ్రిడ్జిలు నిర్మిస్తున్నారు. మొత్తం 508 కిలోమీటర్ల దూరానికి 8 కిలోమీటర్లు మాత్రమే నేలపై ట్రాక్ వేస్తున్నారు. కొండలను తవ్వి 8 టన్నెళ్లను ఏర్పాటు చేశారు. మిగిలిన దూరమంతా మెట్రో రైలు తరహాలో పిల్లర్లమీదే ట్రాక్ వేస్తారు. మెట్రో రైళ్ల కోసం యాజమాన్య నిర్వహణ సంస్థలు పత్యేకంగా ట్రాక్‌లు, స్టేషన్లను నిర్మిస్తున్నాయి. కానీ ఇవి ఇతర రైల్వే స్టేషన్లకు అనుసంధానంగా ఉండటం లేదు. కానీ, బుల్లెట్ ట్రైన్ కోసం మెట్రో, సాధారణ రైల్వే స్టేషన్లను కలిపేలా ప్రత్యేక స్టేషన్లను నిర్మిస్తున్నారు. అహ్మదాబాద్-ముంబై హైస్పీడ్ రైల్ ప్రాజెక్టు కోసం జపాన్ సాంకేతిక సహకారం అందిస్తోంది. రూ.1,08,000 కోట్లలో 81 శాతం నిధులను జపాన్ ప్రభుత్వ బ్యాంకు జైకా అందిస్తోంది. ఆర్థిక సహకారం, సాంకేతిక నైపుణ్యం మినహా.. స్టేషన్లు, ట్రాక్‌ల నిర్మాణాలకు స్వదేశీ వనరులనే ఉపయోగిస్తున్నారు. ఎల్ అండ్ టీ దీనికి సహకారం అందిస్తోంది.



నిర్మాణ దశలో ఉన్న బుల్లెట్ రైలు ట్రాక్

బుల్లెట్ ట్రైన్ స్టేషన్ల ప్రత్యేకతలు...

బుల్లెట్ ట్రైన్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న స్టేషన్లను... మెట్రో, రైల్వే స్టేషన్లను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్నారు. మెట్రో, రైల్వే స్టేషన్ల నుంచి నేరుగా బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌కు వెళ్లేందుకు వీలుగా ప్రత్యేకంగా ర్యాంపులు, వంతెనలు, మూవింగ్ వాక్ ట్రాక్‌లూ, ఎస్కలేటర్లను నిర్మిస్తున్నారు. ప్రయాణికుల కోసం 700 సీట్లతో కూడిన వెయిటింగ్ హాల్‌తో పాటు బిజినెస్ మీటింగ్‌లు ఏర్పాటు చేసుకునే సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ఎనిమిది అంతస్తుల్లో నిర్మించే ఈ స్టేషన్లలో మార్కెట్, సినిమాహాల్, కాన్ఫరెన్సు హాల్, 5స్టార్ హోటల్‌ను నిర్మిస్తున్నారు. సబర్మతి-ముంబై బుల్లెట్ ట్రైన్ దేశ ఆర్థిక గమనాన్నే మార్చేస్తుందని అహ్మదాబాద్ నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌హెచ్‌ఆర్‌సీఎల్) ప్రిన్సిపల్ ప్రాజెక్టు మేనేజర్ రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. అహ్మదాబాద్‌లోని ఎన్‌హెచ్‌ఆర్‌సీఎల్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన అమరావతి నుంచి పీఐబీ తరఫున వచ్చిన మీడియా ప్రతినిధులకు వివరాలు వెల్లడించారు.

రైస్‌మిల్లు వ్యాపారి నిర్బంధం

» బకాయిలు చెల్లించలేదని

సూర్యాపేటలో చిరు వ్యాపారుల ఆగ్రహం

సూర్యాపేట క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ వద్ద ధాన్యం కొనుగోలు చేసిన రైస్ మిల్లుల యజమాని సకాలంలో డబ్బు చెల్లించక పోవడంతో ఆగ్రహించిన చిరు వ్యాపారులు అయన్ను నిర్బంధించి నిరసన తెలిపిన ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. సూర్యాపేట, నిజామాబాద్ జిల్లాల్లో రైతుల నుంచి 2024 వానాకాలం సీజన్‌లో రూ.40 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసిన చిరు వ్యాపారులు.. గౌరు రాజేశ్‌కు చెందిన శ్రీసంతోషిమాత పార్‌బాయిల్డ్ (గరిడేపల్లి), వైష్ణవి రైస్ కార్పొరేషన్ మిల్లు (నేరేడుచర్ల)ల్లో విక్రయించారు. కానీ, సీఎంఆర్ బియ్యం సరఫరా చేయనందుకు గతేడాది డిసెంబరులో తనిఖీ చేసిన అధికారులు కేసులు నమోదు చేసి గౌరు రాజేశ్ రైస్ మిల్లులను సీజ్ చేశారు. ప్రభుత్వానికి బకాయి ఉన్న సీఎంఆర్‌ను రాబట్టేందుకు రెవెన్యూ రికవరీ యాక్ట్ అమలు చేశారు. దీంతో ఆయన తన భూములమ్మి చిరు వ్యాపారులకు కొంత సొమ్ము చెల్లించినా, రూ.10 కోట్లు బకాయి పడ్డారు. అయనతోపాటు మరో ఇద్దరు వ్యాపార భాగస్వాములు సూర్యాపేటలోని శివసాయి రైస్ మిల్లులో ఉన్నారన్న సమాచారంతో అక్కడికొచ్చిన చిరు వ్యాపారులు.. మిల్లుకు తాళం వేసి, తమ బకాయి సంగతి తేల్చే వరకూ వెళ్లేది లేదని భీష్మించారు. దీంతో అక్కడికి చేరుకున్న సూర్యాపేట పోలీసులు.. చిరు వ్యాపారులతో మాట్లాడి.. గౌరు రాజేశ్ తదితరులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చిరు వ్యాపారులకు ధాన్యం విక్రయాలపై రూ.10 కోట్లు చెల్లించాల్సి ఉందన్న గౌరు రాజేశ్.. నేరేడుచర్లలోని తన వైష్ణవి రైస్ కార్పొరేషన్ మిల్లును తన వ్యాపార భాగస్వాములకు రూ.10 కోట్లకు రిజిస్ట్రేషన్ చేశానన్నారు. తన వ్యాపార భాగస్వాములు నేటికీ డబ్బులివ్వనందువల్లే బాధితులు ఆందోళన చేస్తున్నారన్నారు.

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు

రాంధేర్ లొంగుబాటు

ఆయనపై రూ.కోటి రివార్డు.. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో లొంగిపోయిన 22 మంది మావోయిస్టులు

» పామేడు అడవుల్లో కాంట్రాక్టర్ హత్య



ఛత్తీస్‌గఢ్‌లో ఆయుధాలతో సహా లొంగిపోయిన 12 మంది మావోయిస్టులు



రాంధేర్ మాంజీ

చర్ల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు రాంధేర్ మాంజీ సోమవారం లొంగిపోయాడు. ఆయనతో పాటు మరో 11 మంది మావోయిస్టులు కూడా లొంగిపోయారు. రాంధేర్‌పై సుమారు రూ.కోటి రివార్డు ఉన్నట్లు తెలుస్తోంది. ఏకే 47తో సహా 10 తుపాకులను పోలీసులకు అప్పగించారు. మాంజీ గత 30 ఏళ్లుగా మావోయిస్టు పార్టీలో పని చేస్తున్నాడు. అబూజ్‌మడ్ ప్రాంతంలో ఎంఎంసీ కమిటీతో పాటు రాంధేర్ కమిటీ సభ్యులు కూడా ఇంతకాలం ఉద్యమాన్ని నడిపించారు. వారం క్రితం ఎంఎంసీ సభ్యుడు అనంత్ తన సహచరులతో కలిసి లొంగిపోయాడు. ఈ క్రమంలో రాంధేర్ మాంజీ కూడా సోమవారం ఉదయం ఛత్తీస్‌గఢ్‌లోని ఖైరాఘాట్ జిల్లా బకర్‌గట్టు పోలీస్ స్టేషన్‌లో 11 మంది మావోయిస్టులతో కలిసి లొంగిపోయాడు. వీరిలో ఐదుగురు మహిళలున్నారు. అనారోగ్య సమస్యలకు తోడు 14 మంది బృందంలో ఇద్దరు సభ్యులు వెళ్లిపోవడంతోనే తాను లొంగిపోయినట్లు మాంజీ తెలిపారు. వీరి లొంగుబాటును మంగళవారం పోలీసులు అధికారికంగా ప్రకటించనున్నారు. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ జిల్లాలో 10 మంది నక్సలైట్లు లొంగిపోయారు. ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ ఎదుట వీరంతా లొంగిపోయారు. వీరిలో నలుగురు మహిళలు కూడా ఉన్నారు. ఏకే47, ఇన్సాస్ సహా ఆధునిక రైఫిళ్లను పోలీసులకు అప్పగించారు. 10 మందిపై రూ.2.36 కోట్ల రివార్డు ఉన్నట్లు తెలిపారు. ఈ నక్సలైట్ల లొంగుబాటుతో దిండోరి, మండ్ల ప్రాంతాలు పూర్తిగా నక్సల్స్ రహితంగా మారిపోయాయని సీఎం మోహన్ యాదవ్ ప్రకటించారు. లొంగిపోయిన వారికి 15 ఏళ్ల పాటు పునరావాస ప్యాకేజీని అమలు చేస్తామన్నారు.

కాంట్రాక్టర్‌ని చంపేసిన నక్సల్స్..

రోడ్డు పనులు చేస్తున్న ఓ కాంట్రాక్టరును మావోయిస్టులు కిడ్నాప్ చేసి, హత్య చేశారు. ఈ ఘటన పామేడు అడవుల్లో ఆదివారం రాత్రి జరిగింది. ఇంతియాజ్(44) అనే కాంట్రాక్టర్ బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎర్రపల్లి అడవుల్లో పీఎంజీఎస్ నిధులతో రోడ్డు పనులు చేస్తున్నాడు.ఆదివారం పనులు జరుగుతున్న ప్రాంతం నుంచి ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌ను మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. విషయం తెలుసుకున్న ఇంతియాజ్ అక్కడికి వెళ్లగా.. మావోయిస్టులు డ్రైవర్‌ని వదిలేసి, అతన్ని పట్టుకొన్నారు. అనంతరం ఇంతియాజ్‌ను హత్య చేశారు. రోడ్ల పనులు ఎవరూ చేయొద్దని, చేస్తే ఇదే గతి పడుతుందని పామేడు ఏరియా కమిటీ పేరిట లేఖ వదిలారు. మృతుడు యూపీకి చెందిన వ్యక్తిగా తెలిసింది.

వేడి సాంబారులో పడి బాలుడి మృతి

» పెద్దపల్లి జిల్లా మల్లాపూర్‌లో ఘటన



మోక్షిత్ (ఫైల్)

ధర్మారం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు జరుపుకోవాల్సిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు వేడి సాంబారు పాత్రలో పడి మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మల్లాపూర్ గురుకుల పాఠశాల-కళాశాల (బాలికలు)లో మంచిర్యాల జిల్లా కోటపల్లి గ్రామానికి చెందిన మొగిలి మధుకర్ దంపతులు వంట మనుషులుగా పని చేస్తున్నారు. ఆదివారం మధుకర్ వంట చేస్తున్న క్రమంలో పక్కనే ఆడుకుంటున్న కుమారుడు మోక్షిత్ (4) ప్రమాదవశాత్తు వేడి సాంబారు పాత్రలో పడిపోయాడు. తీవ్ర గాయాల పాలైన మోక్షిత్‌ను కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం నాడు మృతి చెందాడు. సోమవారమే మోక్షిత్ పుట్టిన రోజు కాగా, అదే రోజు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

టిప్పర్ ఢీ.. ర్యాపిడో డ్రైవర్, ప్యాసింజర్ మృతి





జ్యోతి, సురేందర్‌రెడ్డి (ఫైల్)

గాజులరామారం, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): ర్యాపిడో బైకును టిప్పర్ ఢీకొట్టడంతో బైక్ డ్రైవర్, వెనకాల కూర్చున్న ప్యాసింజర్ ఇద్దరూ చనిపోయారు. హైదరాబాద్‌లోని సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. సూరారం వెంకట్రామ్ కాలనీకి చెందిన జ్యోతి(32), ఆమె భర్త శ్రీకాంత్ ఇద్దరు సమీపంలోని క్రాంతినగర్‌లో కూరగాయలు, కిరాణ దుకాణం నడుపుతున్నారు. సోమవారం జ్యోతి ర్యాపిడో బైక్‌పై దుకాణానికి వెళ్తుండగా.. ఆ బైకును వెనక నుంచి టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో జ్యోతి, ర్యాపిడో డ్రైవర్ సురేందర్‌రెడ్డి ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

3 విమానాలకు బాంబు బెదిరింపులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు ప్రాంతాల నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తున్న 3 విమాన సర్వీసులను బాంబులతో పేల్చివేస్తామని బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. ఆర్జీఐఏ ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 'ఫ్రాంక్‌ఫర్ట్ నుంచి వస్తున్న 'లుఫ్తాన్సా ఎల్‌హెచ్ 752' విమానంలో మానవ బాంబు ఉంది. లండన్ నుంచి వస్తున్న 'బీఏ277 బ్రిటిష్ ఎయిర్‌వేస్' విమానాన్ని శంషాబాద్‌లో పేల్చేస్తాం. కన్నూర్ నుంచి బయలుదేరిన 6ఈ 7178 ఇండిగో విమానంలో బాంబు ఉంది' అని జీఎంఆర్ విమానాశ్రయం కస్టమర్ కేర్‌కు సోమవారం వేర్వేరు సమయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు ఈ-మెయిల్ బెదిరింపులు పంపారు. దీంతో భద్రతా బలగాలు అప్రమత్తమయ్యాయి. ఆయా విమానాలు ల్యాండ్ కాగానే బాంబు, డాగ్ స్క్వాడ్‌లతో ఆయా విమానాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎలాంటి బాంబుల్లేవని తేల్చిన నిర్ధారించిన తర్వాత ప్రయాణికులు, భద్రతాధికారులు, ఎయిర్‌లైన్స్ అధికారులు, జీఎంఆర్ విమానాశ్రయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. బెదిరింపు మెయిల్స్‌పై ఆర్జీఐఏ ఔట్‌పోస్టు పోలీసులకు సంబంధిత విమానయాన సంస్థల అధికారులు చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఏడాదిలో సుమారు 21 బాంబు బెదిరింపు మెయిల్స్, కాల్స్ వస్తే కేవలం నలుగురిని మాత్రమే పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌పై పంపారు. పోలీసుల అలసత్వం వల్లే బాంబు బెదిరింపు మెయిల్స్ ఎక్కువవ్వాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు.

50 శాతానికి సంప్రదాయేతర ఇంధన వనరుల వాటా

» మరో ఐదేళ్లలో చేరిక.. ప్రస్తుతం 129 గిగావాట్లు: కేంద్రం

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ విద్యుత్తు వినియోగంలో 2030 నాటికి సంప్రదాయేతర ఇంధన వనరుల వాటా 50 శాతానికి చేరుకోనుందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2014లో మూడు గిగావాట్లు (మూడు వేల మెగావాట్లు)గా ఉన్న సంప్రదాయేతర ఇంధన వనరుల స్థాపిత సామర్థ్యం ప్రస్తుతం 129 గిగావాట్ల (129000 మెగావాట్ల)కు చేరింది. పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన కింద 7 వేల మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ పెట్టడానికి రూ.13,464.6 కోట్ల సబ్సిడీని విడుదల చేయడం జరిగిందని, దాంతో దేశవ్యాప్తంగా 24 లక్షల ఇళ్ల మిద్దెలపై రూఫ్‌టాప్ సోలార్ చేరిందని పేర్కొంది. ఇక 9.2 లక్షల వ్యవసాయ పంపుసెట్లను పీఎం కుసుమ్ కింద రైతాంగానికి అందించామని, దేశవ్యాప్తంగా ఈ ఏడాది అక్టోబరు నెలాఖరుకల్లా 13 రాష్ట్రాల్లో 40 వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన 55 సోలార్ పార్కులను మంజూరు చేశామని తెలిపింది. ఈ నిర్ణయాల కారణంగా అంతర్జాతీయ సోలార్ అలయన్స్ (ఐఎస్ఏ) వ్యవస్థాపక సభ్యుడిగా మనదేశం మారిందని వెల్లడించింది. 2030కల్లా 5 లక్షల మెగావాట్ల సంప్రదాయేతర ఇంధన సామర్థ్యం కలిగి ఉండాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 2025 సంప్రదాయేతర ఇంధన గణాంకాల ప్రకారం ప్రపంచంలో సౌర విద్యుత్తు ఉత్పాదనలో మూడో స్థానంలో, పవన విద్యుత్తులో నాలుగో స్థానంలో, సంప్రదాయేతర ఇంధన వనరుల స్థాపిత సామర్థ్యంలో 4వ స్థానంలో మనదేశం నిలిచిందని పేర్కొంది.

పెళ్లికి నో చెప్పిందని...

» మరదలిని కత్తితో గొంతు కోసి చంపిన మేనబావ

» హైదరాబాద్ వారాసిగూడలో ఘటన



పవిత్ర (ఫైల్)

బౌద్ధనగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): పెళ్లి ప్రతిపాదనను నిరాకరించిందన్న ఆగ్రహంతో పట్టపగలే ఓ యువతి గొంతుకోసి దారుణంగా హత్యచేశాడో ఉన్మాది. మేనబావ వరసయ్యే ఆ యువకుడు.. యువతి తల్లి కళ్లెదుటే దాడికి తెగబడి పరారయ్యాడు. ఈ ఘటన సోమవారం హైదరాబాద్ వారాసిగూడలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్శిగుట్ట బాపూజీనగర్‌లో పవిత్ర(19) తన కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటోంది. తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా.. పవిత్ర ఇంటర్ పూర్తి చేసి, కంప్యూటర్ కోర్సులు నేర్చుకుంటోంది. ఈ క్రమంలో జవహర్‌నగర్‌లో నివాసముండే మేనబావ వరసయ్యే ఉమాశంకర్‌తో పవిత్ర వివాహం చేయాలని ఇరు కుటుంబాల పెద్దలు నిశ్చయించారు. అయితే ఉమాశంకర్ తాగుబోతు కావడం, టైల్స్ పనిచేసే వృత్తిలో ఇంకా స్థిరపడక పోవడం వల్ల పవిత్ర కుటుంబం ఆ తర్వాత పెళ్లికి నిరాకరించింది. దాంతో వారి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో ఆదివారం పవిత్ర కుటుంబం విజయవాడకు అమ్మవారి దర్శనానికి వెళ్లి సోమవారం తిరిగి వచ్చింది. సోమవారం మధ్యాహ్నం పవిత్ర ఇంటికి వచ్చిన ఉమాశంకర్.. తనకు చెప్పకుండా విజయవాడ ఎందుకు వెళ్లావని యువతిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. అనంతరం వారిద్దరూ పెళ్లి విషయమై గొడవపడ్డారు. దాంతో ఉమాశంకర్ వెంట తెచ్చుకున్న కత్తితో పవిత్ర గొంతు నరకడంతో తీవ్ర రక్తస్రావమై.. ఆమె మృతిచెందింది. పవిత్ర తల్లి కేకలు వేస్తుండడంతో భయంతో ఉమాశంకర్ కత్తిని వదిలిపెట్టి పారిపోయాడు.

ఠాణా నుంచి ముగ్గురు నిందితుల పరారీ

వరంగల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలీసుల కళ్లు గప్పి.. ఠాణా నుంచి ముగ్గురు నిందితులు పరారైన ఘటన హనుమకొండలో చోటు చేసుకుంది. గంజాయి నుంచి తీసే 'హాశిష్ ఆయిల్' కోసం చెన్నై నుంచి నలుగురు వ్యక్తులు వస్తున్నారన్న పక్కా సమాచారంతో పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం ఆదివారం రాత్రి రెక్కీ నిర్వహించి.. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతంలో ఆ నలుగురు చెన్నై వాసులతోపాటు 'హాశిష్ ఆయిల్' విక్రేత- ఒడిశా వాసిని పట్టుకుంది. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో ఒడిశా వాసి పరారవడంతో మిగతా నలుగురి నిందితులను ఆదివారం అర్ధరాత్రి హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం పోలీసులు అప్పగించారు. ఒడిశా వాసి నుంచి 2 కిలోల హాశిష్ ఆయిల్ కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా, ఆ నలుగురిలో ముగ్గురు నిందితులు సోమవారం తెల్లవారు జామున ఠాణా వెనుక తలుపు నుంచి పారిపోయారు. రాత్రి విధుల్లో ఉన్న పోలీసుల నిర్లక్ష్యం వల్లే నిందితులు తప్పించుకున్నారని తెలుస్తోంది.

ఐఏఎస్ ఆమ్రపాలికి హైకోర్టులో ఎదురుదెబ్బ

హైదరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): క్యాడర్ వివాదంలో ఐఏఎస్ అధికారిణి ఆమ్రపాలికి సోమవారం హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అమెను తెలంగాణకు కేటాయించాలంటూ జూన్‌లో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్(క్యాట్) ఇచ్చిన ఆదేశాలను హైకోర్టు డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. క్యాట్ ఆదేశాలను వ్యతిరేకిస్తూ డీవోపీటీ హైకోర్టులో చేసిన అప్పీలుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. క్యాట్ ఉత్తర్వులను సస్పెండ్ చేస్తూ ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. వివరణ ఇవ్వాలని ఆమ్రపాలికి నోటీసులు జారీచేసింది.

గోదావరి పుష్కరాలకు సాయం కోరలేదు

రామగుండం బొగ్గు గని భూమి విషయంలో జరిమానా కట్టాల్సిందే.. తెలంగాణకు 3,852.61 కోట్ల 'కంపా' నిధులు

» వరంగల్ ఎయిర్‌పోర్టుకు భూమిని అప్పగించలేదు

» కాంగ్రెస్ ఎంపీల ప్రశ్నలకు కేంద్రం సమాధానాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలకు ప్రత్యేక సాయం అందించాలని తెలంగాణ ప్రభుత్వం నుంచి ఎటువంటి విజ్ఞప్తి రాలేదని కేంద్రం వెల్లడించింది. గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాలైన ధర్మపురి, కాళేశ్వరం ఆలయాల అభివృద్ధికి, ఘాట్ల నిర్మాణానికి నిధులు కేటాయించారా? అంటూ కాంగ్రెస్ ఎంపీ వంశీకృష్ణ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ లిఖితపూర్వక సమాధానమిచ్చారు. 2027 జూలై 23 నుంచి ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాల కోసం సాయం చేయాలని తెలంగాణ కేంద్రాన్ని కోరలేదని తెలిపారు. రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు వస్తే 'స్వదేశ్ దర్శన్ 2.0', 'ప్రసాద్' వంటి పథకాల కింద నిధులు మంజూరు చేస్తే అవకాశాలను పరిశీలిస్తామని వెల్లడించారు. పెద్దపల్లి జిల్లా ఆర్జీ కోల్‌మైన్ భూమికి సంబంధించి తాము విధించిన భారీ జరిమానాను తెలంగాణ చెల్లించాల్సిందేనని కేంద్రం తెలిపింది. కాంగ్రెస్ ఎంపీ రఘువీర్ రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ సింగ్ సమాధానమిచ్చారు. 'పెద్దపల్లి జిల్లా ఉప్పర్ల కేశారం ఫారెస్ట్ బ్లాక్ పరిధిలోని 330.18 హెక్టార్ల భూమిని 1973లో రెవెన్యూ శాఖ ప్రభుత్వ భూమిగా సింగరేణికి అప్పగించింది. 2013లో అది అటవీ భూమిని తేలడంతో కేంద్రం భారీ జరిమానా (ఐదు రెట్లు) విధించింది. ఈ పెనాల్టీని మాఫీ చేయాలని తెలంగాణ ప్రభుత్వం కోరగా అడ్వైజరీ కమిటీ పరిశీలించి అభ్యర్థనను తిరస్కరించింది' అని కేంద్ర మంత్రి వివరించారు. ఇప్పటికే సింగరేణి సంస్థ సాధారణ నెట్ ప్రజెంట్ వాల్యూ, సేఫ్టీ జోన్ నిర్వహణ కింద రూ.34.31 కోట్లను 2025 మే 7న చెల్లించిందని, అయితే, స్టేజ్-1 అనుమతుల్లో భాగంగా విధించిన జరిమానాను మాత్రం ఇంకా చెల్లించలేదని స్పష్టం చేశారు. తెలంగాణకు కాంపా (కాంపెన్సటరీ అఫారెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ) నిధులు రూ.3,852.61 కోట్లు ఇప్పటివరకు విడుదల చేసినట్లు కేంద్రం స్పష్టంచేసింది. కాంగ్రెస్ ఎంపీ ఆర్.రఘురాంరెడ్డి ప్రశ్నకు కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ సింగ్ ఈ మేరకు సమాధానమిచ్చారు. అటవీ భూములను అటవీయేతర అవసరాలకు మళ్లించినప్పుడు జరిగే పర్యావరణ నష్టాన్ని పూడ్చడానికి, ప్రత్యామ్నాయ అడవుల పెంపకం కోసం ఈ నిధులను వినియోగిస్తున్నట్లు చెప్పారు. ఇటు వరంగల్ విమానాశ్రయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులు ముందుకు సాగాలంటే తెలంగాణ ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు 253 ఎకరాల భూమిని అప్పగించాలని కేంద్రం స్పష్టం చేసింది. రాజ్యసభలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ప్రశ్నకు పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మొహోల్ సమాధానమిచ్చారు.

600 కోట్ల భూమిని కాపాడిన హైడ్రా

» మియాపూర్‌లో ఐదెకరాల స్థలం స్వాధీనం

» నాచారంలో తెలంగాణ అగ్రోస్ భూమి చెర

» విడిపించిన యంత్రాంగం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మియాపూర్‌లో ఐదెకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. మియాపూర్- బాచుపల్లి ప్రధాన రహదారికి సమాంతరంగా ఉన్న చెరువు కట్టపై 200 మీటర్ల మేర వేసిన 18 షెటర్లను తొలగించారు. దుకాణాల వెనుక వైపు ప్రైవేటు బస్సులు పార్కింగ్ స్థలాన్ని ఖాళీ చేయించారు. హైడ్రా కాపాడిన ఈ ఐదెకరాల భూమి విలువ రూ.600 కోట్ల వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు. చెరువు కట్టతోపాటు గతంలో మైనింగ్‌కు వచ్చిన సర్వే నంబరు 44/5లోని ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందంటూ స్థానికులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన పరిశీలించిన అధికారులు చర్యలకు శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం మియాపూర్ పరిధిలోని మక్తామహబూబ్‌పేట సర్వే నంబరు 44/5లో ఐదెకరాల ప్రభుత్వ భూమి ఉంది. సర్వే నంబరును 44/4గా మార్చి ఐదెకరాల సర్కారు స్థలాన్ని కబ్జా చేసినట్టు హైడ్రా విచారణలో గుర్తించారు. మైనింగ్‌కు ఇచ్చిన భూమిలో మొదట కారు వాషింగ్ సెంటర్ ఏర్పాటుచేసి.. క్రమేణా స్థలం కబ్జా చేసినట్టు తేల్చారు. మైనింగ్‌కు ఇచ్చిన గడువు పెంచాలని దరఖాస్తు చేసుకోగా ప్రభుత్వ తిరస్కరించడంతో కబ్జాకాండకు తెర తీశారు. సర్వే నంబరు మార్చి ఆక్రమించారు. 2013లోనే శేరిలింగంపల్లి తహసీల్దార్ నోటీసులు ఇచ్చి షెటర్లు తొలగించారు. కూన సత్యంగౌడ్, అశోక్‌బాబు కబ్జాకు పాల్పడ్డారని, వారి వెనుక బడా బాబులు ఉన్నారని హైడ్రా పేర్కొంది. భూమి తమదని చెబుతున్న వారి వద్ద ఎలాంటి డాక్యుమెంట్లు లేవు. వేరే వాళ్లతో అగ్రిమెంట్ చేసుకున్నట్టు చెబుతున్నారు. అగ్రిమెంట్ చేసింది ఎవరన్నది తేలాల్సి ఉంది. ఈ క్రమంలో సర్కారు భూమిగా నిర్ధారణకు వచ్చిన హైడ్రా.. స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేశారు. కబ్జా చెర విడిపించిన స్థలంలో 18 షెట్టర్లు ఉండగా.. ఒక్కో షెట్టర్ నుంచి నెలకు రూ.50 వేల చొప్పున రూ.18 లక్షలు అద్దె వస్తున్నట్లు హైడ్రా గుర్తించింది. ప్రైవేటు బస్సులకు పార్కింగ్ ద్వారా నెలకు రూ.8 లక్షల ఆదాయం వస్తున్నట్లు నిర్ధారణకు వచ్చారు. ఇక ఆక్రమణకు గురైన నాచారంలోని తెలంగాణ అగ్రోస్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ భూములను చెర విడిపించింది హైడ్రా. కార్పొరేషన్‌కు 29/1, 30 సర్వే నంబర్లలోని 23.28 ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం కేటాయించింది. దుర్గానగర్, కమలానగర్, బాబానగర్ వైపు నాలుగు ఎకరాల భూమి కబ్జాకు గురైంది. అగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ బాలరాజు ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. ఆక్రమిత భూమిలో ఇప్పటికే నివాసాలు ఉన్నవి మినహాయించి షెడ్లు, ప్రహరీలు, స్క్రాప్ దుకాణాలు తొలగించారు. లావణ్య అనే మహిళ తప్పుడు పత్రాలతో రెండెకరాల్లో ప్లాట్లు చేసి విక్రయించినట్టు గుర్తించారు. అగ్రోస్ కార్పొరేషన్‌లో పని చేస్తున్న రాజు అనే వ్యక్తితో కలిసి మరో 1200 గజాల స్థలం ఆక్రమించినట్టు తేల్చారు. ఆమెపై పోలీస్ స్టేషన్‌లో కేసులూ నమోదయ్యాయి. మహేందర్ అనే వ్యక్తి 2 వేల గజాలు ఆక్రమించి ప్లాట్లుగా అమ్మాడు. కొంత మేర షెడ్లు వేసి అద్దెకిచ్చాడు. వీటన్నింటిని హైడ్రా నేలమట్టం చేసి.. భూమిని స్వాధీనం చేసుకుంది.

300 వార్డులుగా జీహెచ్‌ఎంసీ

(మొదటి పేజీ తరువాయి)

విభాగం ఉత్తర్వులు(జీవో 266) విడుదల చేశారు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ)తో కలిసి జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్ వ్యవస్థీకరణపై సమగ్ర అధ్యయనం చేసింది. అనంతరం బల్దియా కమిషనర్ సమర్పించిన నివేదికను పరిశీలించిన ప్రభుత్వం 300 వార్డులను నోటిఫై చేసింది. ఔటర్ రింగ్ రోడ్డు లోపల, ఆవల ఉన్న 20 మునిసిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లను జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తూ గత బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో టీ-స్క్వేర్ వరకు జీహెచ్‌ఎంసీ పునర్విభజనపై అధికారులు సుదీర్ఘ కసరత్తు చేశారు. 300 వార్డుల ఏర్పాటుతో వార్డుకు ఒకరు చొప్పున 300 మంది కార్పొరేటర్లుగా ఎన్నిక కానున్నారు. మొన్నటి వరకు 650 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న జీహెచ్‌ఎంసీలో 150 వార్డులు, 30 సర్కిళ్లు, ఆరు జోన్లు ఉండేవి. విస్తరించిన జీహెచ్‌ఎంసీలో వార్డుల సంఖ్య 300కు పెరిగింది. 10 వరకు జోన్లు, 50 వరకు సర్కిళ్లు ఉండే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. సర్కారు ఉత్తర్వుల నేపథ్యంలో పునర్విభజనపై జీహెచ్‌ఎంసీ కమిషనర్ అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించనున్నారు. దీనికి సంబంధించి మంగళ లేదా బుధవారాల్లో నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది.

బాబోయ్ చలి

» పలుచోట్ల అత్యల్ప ఉష్ణోగ్రతలు

» సంగారెడ్డి జిల్లా కోహీర్‌లో 6.6, ఆదిలాబాద్ జిల్లా అర్లి(టి)లో 7.4,



ఆదిలాబాద్‌లో చలిమంట కాగుతున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్, డిసెంబరు 8 : రాష్ట్రంలో చలి తీవ్రత మరింత పెరిగింది. పలు జిల్లాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్ మండలంలో సోమవారం ఉదయం 6.6 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు అయ్యింది. ఈ జిల్లాలోని 17 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మెదక్ జిల్లాలోని శివ్వంపేట్‌లో 8.4 కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా 16 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని బేగంపేట్‌లో 8.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా ఇదే జిల్లాలోని 10 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా అర్లి(టి)లో సోమవారం 7.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గిన్నెధరిలో సోమవారం 8.2 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్ నగరంలోనూ చలి ప్రభావం రోజురోజుకు పెరుగుతోంది. శేరిలింగంపల్లిలో ఆదివారం రాత్రి రికార్డు స్థాయిలో 8.4 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యింది. మరో రెండు రోజుల పాటు కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణంకంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు తక్కువగా ఉంటాయని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

చలి మంట కాగుతూ నిప్పంటుకొని వృద్ధురాలి మృతి

జగిత్యాల జిల్లా మల్యాల మండలం తాటిపల్లి గ్రామంలో సోమవారం చలిమంట కాగుతూ నిప్పంటుకొని తొంట మల్లవ్వ(85) అనే వృద్ధురాలు మృతి చెందింది.

మా కుమారుడిని ఉగ్ర చెర నుంచి రక్షించండి

» కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి 'భువనగిరి' యువకుడి తల్లిదండ్రుల వినతి

భువనగిరి రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ ఆఫ్రికాలోని మాలి దేశంలో ఉగ్రవాదుల చెరలో చిక్కుకున్న తమ కుమారుడిని రక్షించాలని యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ప్రవీణ్ తల్లిదండ్రులు, కేంద్ర మంత్రి సంజయ్ కుమార్‌ను కోరారు. ఈ మేరకు ప్రవీణ్ తండ్రి నల్లమాస జంగయ్య సోమవారం నాడు బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. భువనగిరి మండలం బండసోమారం గ్రామానికి చెందిన నల్లమాస ప్రవీణ్ బతుకుదెరువు కోసం దక్షిణ ఆఫ్రికాలోని మాలి దేశంలో బోర్‌వెల్ సూపర్‌వైజర్‌గా పని చేసేందుకు ఏడాది క్రితం వెళ్లాడు. నవంబరు 23న పనులు ముగించుకుని తను నివసించే గదికి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో జేఎన్ఐఎం అనే ఉగ్రవాదులు కిడ్నాప్ చేశారు. సంఘటన జరిగి 15 రోజులైనా ఆచూకీ లభించడం లేదని, అక్కడి ప్రభుత్వం తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని జంగయ్య కన్నీటిపర్యంతమయ్యాడు. వెంటనే అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి తమ కుమారుడిని కిడ్నాపర్ల చెర నుంచి విడిపించాలని మొరపెట్టుకున్నాడు. సానుకూలంగా స్పందించిన బండి సంజయ్, భారత విదేశాంగ శాఖ కార్యాలయ అధికారులతో మాట్లాడారు. మాలి ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి కిడ్నాపర్ల చెర నుంచి తెలంగాణ వాసులను రక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇది సరికాదు...!

ప్రజాస్వామ్యంలో రాజకీయం పోటాపోటీగా ఉంటుంది. వాగ్యుద్ధాలకు అంతూపొంతూ ఉండదు. అధికార, విపక్షాల మధ్య ఘర్షణ చట్టసభల్లోనూ అరుబయటా నిత్యం సాగుతూంటుంది. ఆరోపణలూ ప్రత్యారోపణలు, నిందలూ నిష్ఠూరాలు, అవమానాలూ ఎత్తిపొడుపులూ అబ్బో చాలా ఉంటాయి. తనను ప్రభావితం చేయడానికి నాయకులు మా చెడ్డ ఇదైపోతున్నారని ఓటరుకు కూడా తెలుసు. అయితే, ఇదంతా రాజకీయ ప్రత్యర్థులు శత్రువులు కారు అన్న స్పృహతో, ప్రజాస్వామ్య స్ఫూర్తితో సరిహద్దుల్లోపల కొనసాగాల్సిన వ్యవహారం. దేశం ముందు తామూ, తమ పార్టీలు స్వల్పమైనవని, హద్దులు దాటిన ప్రవర్తనతో, చర్యలూ చేష్టలతో దేశం పరువు తీయకూడదని నాయకులు గుర్తుపెట్టుకోవాలి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, స్పీకర్, విపక్షనేత ఇత్యాదులంతా రాజ్యాంగ వ్యవస్థలో భాగమేనని, దాని ఆశయానికీ, స్ఫూర్తికీ భిన్నంగా వ్యవహరించకూడదని పాలకులకు తెలియదనుకోలేం. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవార్థం భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చిన విందుకు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీనీ, రాజ్యసభలో విపక్షనేత మల్లికార్జున్ ఖర్గేనూ ఆహ్వానించకుండా తగినశాస్తి చేశామని, అవమానించామని అధికారపక్షం కనుక భావించివుంటే, సరికాదు.

పైపెచ్చు, అస్మదీయ శశిథరూర్‌ను పిలిచి, కాంగ్రెస్‌ను మానసికంగా మరింత దెబ్బతీశామని కూడా బీజేపీ నాయకులు అనుకున్నారేమో. విపక్ష నేతను ఎందుకు పిలవలేదో, తనను ఎందుకు పిలిచారో తనకు తెలియదని అంటూనే ఈయన ఆ విందుకు హాజరవడం వేరే సంగతి. అందుకు ఆయనకు గల అర్హతల గురించి కూడా ఇక్కడ అప్రస్తుతం. విదేశీ అతిథులతో భేటీలకు విపక్షనేతలకు అవకాశం కల్పించే సంప్రదాయం నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చే ముందువరకూ అమలు జరిగిందని రాహుల్‌గాంధీ ఎంతో ముందుగానే ప్రభుత్వానికి గుర్తుచేశారు. ఆహ్వానం ఉండి కూడా ఇదే రాహుల్‌గాంధీ ఉపరాష్ట్రపతి, చీఫ్ జస్టిస్ ప్రమాణస్వీకారాలకు ఎందుకు రాలేదని అధికారపార్టీ నాయకులు ఏవో ఎదురు ప్రశ్నలు వేస్తున్నారు కానీ, ఒక దేశాధ్యక్షుడి గౌరవార్థం మన దేశాధ్యక్షులు ఇచ్చిన విందుకు విపక్షనేతలను ఆహ్వానించకపోవడం దుష్టసంప్రదాయం, తీవ్రమైన తప్పిదం. ఇది రాహుల్‌గాంధీకి సంబంధించిన అంశమో, ఆయనకు జరిగిన అవమానమో కాదు. ఈ చర్య ద్వారా ఒక రాజ్యాంగబద్ధపదవిని పాలకులు తేలికపరచారు, అగౌరవించారు. విపక్షనేత వెనుక ఒక పార్టీ ఉంది, ఆయన సారథ్యం వహిస్తున్న అనేక పార్టీల కూటమి ఉంది, వాటన్నింటి వెనుకా కోట్లాది ఓటర్లూ ఉన్నారు.

2014 డిసెంబరులో పుతిన్ భారత పర్యటనకు వచ్చిన సందర్భంలో సోనియా గాంధీతో భేటీకావడం అటుంచితే, దీనికిముందు పదేళ్ళ యూపీఏ పాలనలో అమెరికా, చైనా సహా వివిధ దేశాధినేతలు, దౌత్యప్రతినిధులతో అప్పటి విపక్షనేత 162సార్లు భేటీలు జరిపారని రికార్డులు చెబుతున్నాయి. విందు ఆహ్వానాలు లేకపోవడం సరే, కనీసం విదేశీ అతిథులతో మర్యాదపూర్వక భేటీలకు కూడా 2014 తరువాత విదేశాంగశాఖ విపక్షనేతలను అనుమతించడం మానేసింది. దీనిని సమర్థించుకోవడానికి ప్రభుత్వం దగ్గర చాలా కారణాలు ఉంటాయి కూడా. భారతరాష్ట్రపతి ఇచ్చిన విందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం రాహుల్‌గాంధీని ఉద్దేశపూర్వకంగా ఆహ్వానించలేదన్న విషయం వ్లాదిమిర్ పుతిన్‌కు తెలియకుండా పోదు. భారతదేశంతో సోవియట్ యూనియన్ ప్రాణస్నేహానికి, సర్వరంగాల్లో సహకారానికీ, రక్షణబంధానికీ బలమైన పునాదులు వేసిన జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీల వారసుడిని తనకు కనిపించకుండా చేశారని పుతిన్ అనుకొని ఉండవచ్చు. గతంలో బీజేపీ మూలపురుషులు, పెద్దలు భారత్–సోవియట్ స్నేహాన్ని తప్పుబట్టి, అమెరికాకు సన్నిహితం కానందుకు కాంగ్రెస్‌ను విమర్శించినవారే. ఎంతటి విపత్కర పరిస్థితుల్లోనూ భారత్ చేయివదలకుండా రష్యా ఇప్పటికీ తోడుగా అండగా ఉన్నదంటే అది కాంగ్రెస్ వేసిన పునాది బలం. అమెరికా తన నగ్న స్వరూపాన్ని ప్రదర్శించినప్పుడల్లా పరుగునపోయి రష్యా అధినేతను ఆలింగనం చేసుకుంటున్న ప్రస్తుత పాలకులకు ఈ చరిత్ర తెలియదనుకోలేం. మూడోపర్యాయం అధికారంలోకి వచ్చిన భారతీయ జనతాపార్టీ విదేశీ నేతల పర్యటనల సందర్భంలో కురుచగా వ్యవహరించాల్సిన అవసరం ఏమీ లేదు. వచ్చినవారితో భేటీకి ఇక్కడి పార్టీల పెద్దలకు దారులు తెరిచి ఉన్నతంగా, ఉదాత్తంగా ఉండవచ్చు. ఆపరేషన్ సిందూర్ మీద ప్రపంచదేశాలకు తమవాదన వినిపించడానికి విపక్షాన్ని ఎంచక్కావాడుకున్నవారు, అవసరం తీరాక ఇలా అవమానించడం సరికాదు.

‘టెట్’ అంటే భయమెందుకు?

ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించిన ఉపాధ్యాయ అర్హతా పరీక్ష (టెట్) ఇప్పుడు దేశవ్యాప్తంగా మళ్లీ చర్చనీయాంశమైంది. విద్యారంగం భవిష్యత్తును ప్రభావితం చేసే ఈ పరీక్షను నిర్బంధంగా కొనసాగించాలని చెపుతూ “టెట్ అనేది విద్యా నాణ్యతకు కనీస హామీ. రాష్ట్రాలు దానిని తప్పించుకోవడానికి ప్రయత్నించకూడదు. ప్రతీ ఉపాధ్యాయుడు తప్పనిసరిగా టెట్ పరీక్షలో అర్హత సాధించాలి. గరిష్ఠంగా రెండేళ్లలో అర్హత సాధించకపోతే ఉద్యోగం నుంచి పదవీ విరమణ పొందాలి” అని దేశ సర్వోన్నత న్యాయస్థానం సెప్టెంబరు 1న తీర్పు ఇచ్చింది. కోర్టు వ్యాఖ్యలు, నిజానికి దేశవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయ నియామకాలలో ఉన్న లోపాలను బట్టబయలు చేశాయి. నిరంతరం నేర్చుకునే తపన ఉన్న ఉపాధ్యాయుడే నాణ్యమైన విద్యను అందించి విద్యార్థి భవిష్యత్తును తీర్చిదిద్దుతాడని సుప్రీంకోర్టు విస్పష్టంగా పేర్కొంది.

దేశ విద్యావ్యవస్థలో కొనసాగుతున్న అతిపెద్ద లోపాన్ని గుర్తించి చరిత్రాత్మక తీర్పు వెలువరించిన సుప్రీంకోర్టును దేశవ్యాప్తంగా మేధావులు, విద్యావేత్తలు అభినందిస్తుండగా.. ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు వ్యతిరేకిస్తుండటం శోచనీయం. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు మాత్రం టెట్ అనవసరం.. అనుభవమే ప్రధాన అర్హత. దీంతో ఉపాధ్యాయులపై



ఒత్తిడి పెరుగుతుంది అంటూ వ్యతిరేకిస్తున్నారు. తీర్పు సమీక్షించాలంటూ తెలంగాణలోని ప్రముఖ ఉపాధ్యాయ సంఘం టీఎస్‌యూటీఎఫ్ ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసింది. మరో సంఘం పీఆర్టీయు కేంద్ర మంత్రులను కలిసి టెట్ అర్హత రద్దుచేయాలని, దీనికోసం విద్యాహక్కు చట్టాన్ని సవరించాలని కోరుతోంది. టెట్ అర్హత రద్దు చేయకపోతే ఉద్యమిస్తామని ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు ఇప్పటికే ప్రకటించాయి. సుప్రీంకోర్టు తీర్పును వారు వ్యతిరేకించడం వెనక ఒక్క సహేతుమైన కారణం కూడా లేదు. ఉపాధ్యాయుడిగా అపారమైన అనుభవం ఉన్నవారికి పరీక్ష రాయడం అంటే భయం ఎందుకు? నాణ్యతా ప్రమాణం పెట్టడంలో తప్పేమిటి? ఉపాధ్యాయులకు జీవితంలో ఒక పరీక్ష నిర్వహిస్తే వచ్చే ఇబ్బంది ఏమిటి..? ఈ ప్రశ్నలకు సంఘాల వద్ద కూడా సమాధానం లేదు.

ప్రపంచమంతా గురువులను మరింత నైపుణ్యమైన బోధకులుగా తీర్చిదిద్దుతున్నది. విద్యారంగంలో అత్యున్నత ప్రమాణాలతో ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తున్న ఫిన్లాండ్‌లో ఐదేళ్ల మాస్టర్స్ డిగ్రీ ఉన్నవారే బోధనకు అర్హులు. గురువుల నైపుణ్యాలు, విద్యాబోధనను అంచనా వేసేందుకు ప్రతి ఏటా ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వారి నైపుణ్యాలను అంచనా వేస్తారు. ప్రభుత్వ అంచనాల మేరకు రాణించని గురువులను బోధనకు అనర్హులుగా ప్రకటిస్తారు. సింగపూర్‌లో ఉపాధ్యాయులు ప్రతి ఏటా కనీసం 100 గంటల ఉపాధ్యాయ శిక్షణ పొందడం తప్పనిసరి. జపాన్‌లో ఉపాధ్యాయులకు ఇచ్చిన బోధన లైసెన్స్‌ను ప్రతి పదేళ్లకు సమీక్షిస్తారు. వీరు రిఫ్రెషర్ కోర్సులు నేర్చుకోవడం తప్పనిసరి. అమెరికాలో టీచర్ లైసెన్స్‌ను ప్రతి మూడేళ్లకు వారి నైపుణ్యాలను గుర్తించిన తర్వాతే పునరుద్ధరిస్తారు. యూకేలోనూ ప్రతి ఏడాది టీచర్ల విద్యాబోధన సామర్థ్యాన్ని అంచనా వేస్తారు. ఇలా ప్రపంచం అంతా విద్యారంగంలో సంస్కరణల వైపు పరుగులు పెడుతుంటే.. భారతదేశంలో దశాబ్దాల తర్వాత వచ్చిన ఒక చరిత్రాత్మక తీర్పును గురువులే వ్యతిరేకిస్తుండటం.. బహుశా ప్రపంచంలోనే ఎక్కడా కనిపించని విడ్డూరం.

తెలంగాణలో ప్రతి ఏటా వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ప్రభుత్వం విద్యపై ఖర్చు చేస్తోంది. అయినా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై ప్రతి ఏటా వస్తున్న నివేదికలు నాణ్యతలేమిని ఎత్తిచూపుతున్నాయి. ఉన్నత పాఠశాలల విద్యార్థులు కనీసం చిన్నపాటి కూడికలు, తీసివేతలు చేయలేని దుస్థితి. కనీసం మాతృభాషలో అక్షరదోషం లేకుండా ఒక వాక్యం కూడా రాయలేకుండా ఉన్నారు. ఇలాంటి విద్యకు బాధ్యులెవరు? పాఠశాలలకు పక్కా భవనాలు, మౌలిక వసతులు కల్పిస్తే విద్యలో నాణ్యత వచ్చేస్తుందా? ఎప్పుడో సంవత్సరాల క్రితం పోటీ పరీక్షలో విజయం సాధించి ప్రభుత్వ టీచర్‌గా ఎన్నికైతే.. ఇక తమకు పరీక్షలే పెట్టవద్దనడం ఎంతవరకు సమంజసం? విద్యలో నాణ్యత తగ్గటం వెనక ఉపాధ్యాయులకు బాధ్యత లేదా? విద్యార్థులు ప్రతీ ఏడాది పరీక్షలు రాస్తారు. మార్కులు తక్కువ వస్తే వాళ్లను ‘ఫెయిల్ అయినావ్’ అని ఉపాధ్యాయులే చీదరించుకుంటారు. అదే ఉపాధ్యాయులు టెట్ పరీక్షను రాయడానికి ఎందుకు భయపడుతున్నారు? ఉపాధ్యాయ సంఘాలు నిజంగా ఉపాధ్యాయుల గౌరవం, నాణ్యతపై దృష్టి పెడితే టెట్‌ను ఎదుర్కొని నిలబడగలగాలి. విద్యా వ్యవస్థ కోసం, విద్యార్థుల మెరుగైన భవిష్యత్తు కోసం అయినా విద్యారంగంలో సంస్కరణలను అంగీకరించాలి.

● **ముహమ్మద్ ఆర్‌హెచ్ షరీఫ్**
జర్నలిస్ట్

పెళ్లినాటి ప్రమాణాలూ... ప్రమాదాలూ!

గతంలో ప్రేయసి వలలో పడి భార్యను చంపే భర్తల గురించే వినేవాళ్లం, పేపర్లలో చదివేవాళ్లం. ఇప్పుడు భార్యలు ఈ పోటీలో భర్తలను అందుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు కనబడుతోంది. ప్రియుడితో కలిసి గూడుపుఠాణీ చేసి, ప్రీమెడిటేటెడ్, కోల్డ్ బ్లడెడ్ మర్డర్లు కూడా చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి. జీవితాంతం కలిసి నడుస్తామంటూ పెళ్లి సమయంలో చేసిన ప్రమాణాలు ఏమై పోతున్నాయో తెలియటం లేదు. ప్రమాణాలు కేవలం నోటిమాటలుగా మిగిలిపోకుండా, ఆచరణలో కూడా చూపాలంటే సరైన ఆటిట్యూడ్ వుండాలి. ‘ఈ నా వివాహాన్ని వర్కబుల్ చేస్తాను’ అని దృఢంగా సంకల్పించుకోవాలి కూడా. దానికి అనుగుణంగా మరో ప్రమాణాన్ని కూడా చేరిస్తే మంచిదనిపిస్తోంది.

భర్తలను భార్యలు చంపిస్తున్న కొన్ని సందర్భాల్లో పెళ్లికి ముందే ఈ ప్రీమెడిటేషన్ ప్రారంభమవుతోందని తెలుస్తోంది. ప్రియుడికి ఉద్యోగం, వేరేవాణ్ణి పెళ్లి చేసుకుని, వాణ్ణి ప్రియుడి ద్వారా చంపించి, ఆస్తికి వారసురాలై, తర్వాత ప్రియుణ్ణి పెళ్లాడి హాయిగా సెటిలైపోదామనే ప్లాన్లు కూడా వేస్తున్నారు. ఇలాంటి కేసుల్లో హనీమూన్‌లో హనీ కంటే పాయిజన్ పాలు ఎక్కువవుతోంది. ఇవి విన్నప్పుడు ‘వీరికి తమ పెళ్లినాటి ప్రమాణాలు గుర్తుకురావా? లేక చిత్తశుద్ధి లేని ప్రమాణాలు చేస్తున్నారా?’ అనే అనుమానం వస్తుంది. ఈ ప్రమాణాలన్నీ ఒకరికొకరు జీవితాంతం బద్ధులమై ఉంటామని, అచంచలమైన పరస్పర విశ్వాసాన్ని కలిగి ఉంటామనీ చెప్పిస్తాయి. క్రైస్తవ వివాహాల సమయంలో ‘ఈ రోజు నుంచి, సుఖంలోనూ, దుఃఖంలోనూ, ఐశ్వర్యంలోనూ పేదరికంలోనూ, ఆరోగ్యంలోనూ అనారోగ్యంలోనూ – మృత్యువు మమ్మల్ని విడదీసేదాకా– కలిసే ఉంటాము’ అని క్రైస్తవ దంపతులు ప్రమాణం చేస్తారు.

హిందూ వివాహాల్లో తాళి కడుతూ ‘నేను నీ మెడలో కడుతున్న ఈ మంగళసూత్రం నా జీవితానికి ఆధారం. నీవు నూరేళ్లు బతికి నన్ను కూడా బతికించు’ అనే అర్థంలో ‘మాంగల్యం తంతునానేనా, మమ జీవన హేతునా’ మంత్రాన్ని పఠిస్తాడు. దీనికి గాను తన వంతుగా ఏం చేస్తాడో మరో మంత్రంతో చెప్తాడు– ‘ధర్మేచ, అర్థేచ, కామేచ, మోక్షేచ... నాతి చరామి’ అని. ధర్మంలో, ధనార్జనలో, కోరికలో, మోక్షంలో.. నిన్ను దాటి వెళ్లను. నీతోనే ఉంటాను’ అని దాని అర్థం. జీవితానికి అతి ముఖ్యమైన ఈ నాలుగు పురుషార్థాలలోనూ కలిసి ఉంటానని చెప్పడం ఆజన్మాంత జీవన సహచర్యానికి నిర్వచనమే!

ఆ తర్వాత ఇద్దరూ ‘సప్తపది’ పేర ఏడడుగులు కలిసి నడుస్తారు. ఒక్కొక్క అడుగుకూ ఒక్కొక్కటి చొప్పున వధువుకు వరుడు సూచనలు చేస్తాడు. ‘నువ్వు నాకు పోషణ కలిగించాలి’, ‘నాకు శక్తి, ఉత్సాహాలను కలిగించాలి’, ‘కుటుంబానికి ఐశ్వర్యాన్ని తేవాలి’, ‘ఆనందాన్ని కలిగించాలి’, ‘సంతానాన్ని సమకూర్చాలి’, ‘అన్ని ఋతువులలోనూ మనం కలిసి జీవించాలి’ (ఇక్కడ అన్ని ఋతువులు అనడంలో వసంతం నుంచి శిశిరం దాకా అనే కాదు, కలిమిలో లేమిలో, కష్టాల్లో సుఖాల్లో.. అనే భావం యిమిడి ఉంది), చివరగా ఏడో అడుగులో చెప్తాడు– ‘మన మధ్య శాశ్వతమైన స్నేహం ఉండాలి’ అని. నిజానికి ఈ స్నేహమే వైవాహిక బంధాన్ని నిలిపి ఉంచుతుంది. స్నేహితులు మధ్యమధ్యలో వాదించుకుంటారు, కొట్లాడుకుంటారు. కానీ ఒకరంటే మరొకరికి గాఢమైన ఇష్టం ఉంటుంది. స్నేహానికి తైలం అనే అర్థం కూడా ఉంది. దాంపత్యజ్యోతి నిరంతరం వెలగాలంటే భార్యాభర్తల మధ్య ఈ స్నేహం చాలా ముఖ్యం.

సంప్రదాయబద్ధంగా జరిగే పెళ్లిళ్లలో ఏదో రకంగా ప్రమాణాలు చేయిస్తూనే ఉన్నారు. కొంతకాలానికి పెళ్లిళ్లలో కలతలు రావడం, విడాకులు తీసుకోవడం... చివరకు పైన చెప్పిన హత్యాకాండల గురించి విన్నప్పుడు ఈ ప్రమాణాల ప్రామాణికత ఏమిటన్న సందేహం వస్తుంది. ఆనాటి బాసలు నీరసించడం, సడలిపోవడం క్రమేపీ జరుగుతోందనే సంగతిని మనం ఆకళింపు చేసుకోవాలి. చాలా సందర్భాల్లో భార్యాభర్తలకు ఒకరిపై మరొకరికి మోజు విరిగిపోవడం, విభేదాలు పొడచూపడం జరుగుతోంది. వీటిని కాలంతో పాటు వచ్చే మార్పులుగా అర్థం చేసుకోవాలి.

తమాషా ఏమిటంటే పరిస్థితులు మారవు, కానీ వాటిని చూసే దృక్కోణంలో మాత్రం మార్పు వస్తుంది. ఒకప్పుడు ప్రేమతో, ఆరాధనతో నిండి తనను మంత్రముగ్ధుణ్ణి చేసిన భార్య అందమైన కళ్లే, కోపంతో పెద్దవై, నిప్పురవ్వలు కురిపించడం భర్తకు కలిగే అనుభవం. స్వీట్ నథింగ్స్‌తో తనను పులకింపచేసిన భర్త కంఠస్వరమే తన మాట చెల్లనప్పుడు చికాకుతో గర్జించడం భార్య నివ్వెరపోయే సందర్భం. భర్త వినే సంగీతం పెళ్లయిన కొత్తల్లో ఆహ్లాదకరంగా భావించిన భార్య, పోనుపోను దాన్ని వట్టి రొదగా కొట్టిపారేయడం కద్దు. భార్య తీసే కూనిరాగాలను ఒకప్పుడు శ్రావ్యంగా భావించిన భర్త తర్వాతి రోజుల్లో వాటినే ఖూనీరాగాలుగా భావించడం కాలమహిమ కాక మరేమిటి?

> **టాల్‌స్టాయ్ నుంచి గాంధీ దాకా గృహ కలహాలను ఎవరూ తప్పించుకోలేకపోయారు. కానీ పోట్లాడుకున్న వాళ్లందరూ విడిపోరు. గీతాకారుడు ఏం చెప్పాడు? మానవ ప్రయత్నం తప్పదు అన్నాడు. స్వర్గంలో పెళ్లి చేయడం వరకు దేవుడి పనే కానీ, భూమి మీద దాన్ని నిలబెట్టుకోవడం మన పని. పెద్దలిచ్చిన ఆస్తి కానీయండి, స్వయంకృషితో తెచ్చుకున్న ఉద్యోగం కానీయండి, నిలబెట్టుకోవడంలోనే ఉంది ప్రజ్ఞ.**

ఈ కారణంగా భార్యాభర్తలిద్దరి ప్రవర్తనల్లోనూ మార్పులు వస్తాయి. చెవిలో గుసగుసలు, ముసిముసి నవ్వుల స్థానంలో పక్కింటి వాళ్లకు కూడా వినబడే స్థాయిలో అరుపులు, రంకెలుగా రూపాంతరం చెందుతాయి. ఇద్దరూ కలిసి ప్రేమగా ఏరికోరి కొన్న గాజు, పింగాణీ వస్తువులు నేల కూలి ముక్కలవుతాయి. గిన్నెలు సొట్టబడతాయి. ఒకప్పుడు అపురూపంగా దాచుకున్న ఉత్తరాలు, ఫొటోలు కోపావేశంలో చిరిగి ముక్కలవుతాయి. ఏదో ఒక స్థాయిలో ప్రతి జంటకూ ఇలాంటి అనుభవాలు ఉంటాయి. టాల్‌స్టాయ్ నుంచి గాంధీ దాకా గృహ కలహాలను ఎవరూ తప్పించుకోలేకపోయారు. కానీ పోట్లాడుకున్న వాళ్లందరూ




విడిపోరు. ‘పిల్లల కోసం కలిసి ఉంటున్నారు పాపం’ అని బయటివాళ్లు అనుకోవచ్చు కానీ వాస్తవమేమిటంటే– వయస్సు, అనుభవం పెరుగుతున్న కొద్దీ, చాలా మంది దంపతులకు ‘కలిసి బతకలేం, అలా అని విడిపోయి బతకలేం’ అనే అవగాహన కలుగుతుంది. విడిపోయి బతకగలం అనుకున్న వాళ్లు విడిపోతారు.

విడాకులు తీసుకోవడం గతంలో కంటే సులభమైన ఈ కాలంలో కూడా భాగస్వామిని చంపడం దేనికి? ఈ ‘క్రైమ్స్ ఆఫ్ పేషన్’లో శరీరాని కంటే మనసు పాత్రే ఎక్కువ. భార్యాభర్తల మధ్య మానసికబంధం సడలిన సమయంలో మూడో వ్యక్తి ప్రవేశిస్తే– ఈ బంధాన్ని ఎలా వదుల్చుకోవాలా అనే ఆలోచన కలగవచ్చు. సామరస్యంగా విడిపోవాలా, హింసాత్మకంగా విడిపోవాలా అనేది వ్యక్తిగత నిర్ణయం. దాన్ని ఆ మూడో వ్యక్తి ప్రభావితం చేయవచ్చు. హింసాత్మక మార్గాన్ని ఎంచుకుని, హత్యలకు పాల్పడితే దాని వలన అనర్థం జరిగే అవకాశాలే ఎక్కువ. పరిస్థితి అక్కడిదాకా వెళ్లకుండా, మానసిక బంధం సడలకుండా చూసుకునే ఉపాయాల గురించి ఆలోచించాలి. గీతాకారుడు ఏం చెప్పాడు? మానవ ప్రయత్నం తప్పదు అన్నాడు. స్వర్గంలో పెళ్లి చేయడం వరకు దేవుడి పనే కానీ, భూమి మీద దాన్ని నిలబెట్టుకోవడం మన పని. పెద్దలిచ్చిన ఆస్తి కానీయండి, స్వయంకృషితో తెచ్చుకున్న ఉద్యోగం కానీయండి, నిలబెట్టుకోవడంలోనే ఉంది ప్రజ్ఞ. కాపురాన్ని నిలబెట్టుకోవడానికి కావలసినది సరైన ఆటిట్యూడ్. ప్రత్యామ్నాయం దీనికంటే మెరుగు కాదనే ఎఱుక! దానికి మించి చుట్టూ పరిస్థితులెలా ఉన్నా, సంతోషంగా ఉండి తీరాలనే పట్టుదల!

బతకడమంటే విసుగుతో, నిరాశానిస్పృహలతో, కోపతాపాలతో తనని తాను తిట్టుకుంటూ, ఇతరులను విసిగిస్తూ బతకడం కాదు. ఈసురోమని మనుషులుంటే దేశమే కాదు, కాపురాలూ బాగుపడవు, వర్ధిల్లవు. హ్యాపీగా ఉండడానికి నిశ్చయించుకోవడంలో ఉంది అసలైన కీలకం. నాకు వివాహమై, ఫస్ట్ పోస్టింగు వచ్చి, కాపురం పెట్టడానికి వెళ్లబోయే ముందు సలహా కోసం అడిగితే మా నాన్నగారు చెప్పిన మాట ఒక్కటే– ‘వృత్తిలో కానీ, సంసారంలో కానీ సంతోషంగా ఉండు’ అని! మనం సంతోషంగా ఉండడానికి పక్కవాళ్లందరూ కూడగట్టుకుని ప్రయత్నం చేయరు. ఆ తంటాలు మనమే పడాలి. ఫ్రెంచి వాళ్లు ‘la joie de vivre’ అంటారు. జీవితం పట్ల జోష్ ఉండాలి. సరదాగా బతకాలి అని మనకు మనమే సంకల్పం చెప్పుకుని, దాన్ని అమలుచేయాలి. జీవిత భాగస్వామి ఆటిట్యూడ్‌లో మార్పు వచ్చిందని ఫిర్యాదు చేసేముందు మనమూ మారామనే గ్రహింపు ఉండాలి. మార్పు సహజమని యాక్సెప్ట్ చేయడంలోనే విజ్ఞత ఉంది.

కొన్ని జంటలను చూస్తూ ఉంటాం. అహం, కోపతాపాలు, పంతాలు పట్టింపులు ఏ స్థాయిలో ఉంటాయంటే పక్కింట్లో ఉన్న మనకు ‘ఇదెక్కడి మార్జాల కాపురంరా బాబూ!’ అనిపిస్తుంది. కానీ మర్నాటికి వాళ్లు పాలూ నీళ్లల్లా, పప్పూ ఉప్పులా కలిసిపోవడం చూసి విస్తుపోతాం. దీనికి కారణం ఇలా సర్దుకుపోయి, సంతోషంగా ఉండాలనే వాళ్ల దృఢసంకల్పమే! నా దృష్టిలో రుచులు– అభిరుచులు, సంగీతం, భోజనం, స్నేహితుల విషయంలో వచ్చిన తేడాలు, కొన్నిసార్లు తీవ్రమైన విభేదాలు... ఇవన్నీ మన దాంపత్య జీవితానికి నిజమైన రుచిని ఇచ్చే మసాలాలు. ఇవి లేకపోతే జీవితం నిస్సారంగా, చప్పగా గడిచిపోతుంది.


మనం మళ్లీ మొదటి టాపిక్కు – అంటే పెళ్లినాటి ప్రమాణాలకు– వస్తే నావి రెండు సూచనలున్నాయి. హిందూ వివాహాల్లో భర్త ఒక్కడే ‘నాతి చరామి’ మంత్రం పఠిస్తున్నాడు. కట్టుబాట్లను దాటి చరించే ప్రవృత్తి ఇటీవల మహిళల్లో కూడా పెరుగుతోంది కాబట్టి ‘నాతి చరామి’ మంత్రం భర్త చేతే కాకుండా, భార్య చేత కూడా చేయించడం మంచిదని నా ఉద్దేశ్యం. దానితో పాటు ‘నేను హ్యాపీగా ఉండదలచుకున్నాను, పక్కవాళ్లనూ హ్యాపీగా ఉంచడానికి సర్వదా ప్రయత్నిస్తాను’ అనే ప్రమాణం కూడా ఇద్దరి చేతా చేయించాలని నా అభిప్రాయం. ‘నేను రాజీ పడుతున్నాను, కానీ అది నా సంతోషం కోసమే’ అనే దృక్పథం ఉంటే వివాహ సంబంధమైన కలహాలూ, మరణాలూ తగ్గుతాయి.



■ **డా. మోహన్ కందా**
విశ్రాంత చీఫ్ సెక్రటరీ, ఉమ్మడి ఆం.ప్ర. ప్రభుత్వం

‘మహాలక్ష్మి’తో మహిళా సాధికారత!

సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం డిసెంబర్ 9న శ్రీమతి సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ‘మహాలక్ష్మీ పథకం’ ప్రారంభమైంది. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అత్యంత చరిత్రాత్మక నిర్ణయాల్లో మహిళలకు ఉచిత బస్ ప్రయాణ సదుపాయం ముందుంది. ఈ పథకం మహిళల ఆర్థిక స్వాతంత్ర్యానికి ఒక ధైర్యమైన అడుగు. ఈ రెండు సంవత్సరాల్లో తెలంగాణ మహిళల జీవన విధానాన్ని ఇది మార్చేసింది. ఉద్యోగాలు, విద్య, ఆరోగ్యం, కుటుంబ బాధ్యతలు వంటివి ఏవైనా కావచ్చు, మహిళలకు ఇది నిజమైన స్వేచ్ఛను అందించింది. వారి కలల దూరం తగ్గి, అవకాశాలు దగ్గరయ్యాయి. గ్రామాల నుంచి కూడా రాజధానికి మహిళలు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఉద్యోగాలు చేస్తున్నారు.



మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు 252 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారు. తెలంగాణ వ్యాప్తంగా సగటున రోజుకు 30 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారు. 2025 జూలై 21 వరకు 199.6 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారు. ఇప్పటికే రూ.8,402 కోట్లు వారు ఆదా చేసుకున్నారు. మరిన్ని గణాంకాలు చూస్తే, 2025 జూలై 22 నాటికి 200 కోట్లు జీరో–ఫేర్ టికెట్లు జారీ అయ్యాయి. ఈ పథకం ప్రారంభమైన తర్వాత, టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల ఆక్యుపెన్సీ రేషియో 69 శాతం నుంచి 94 శాతానికి పెరిగింది. మొదటి 11 రోజుల్లో 62శాతం ప్యాసింజర్లు మహిళలే. రోజుకు 51 లక్షల మంది చొప్పున మొత్తం ప్రయాణికుల్లో 27 లక్షలు జీరో–ఫేర్ టికెట్లు జారీ అయ్యాయి. ఇది మహిళలకు మాత్రమే కాదు, టీజీఎస్ ఆర్టీసీకి కూడా ఆర్థిక బలోపేతం. ఆర్టీసీ రోజువారీ రెవెన్యూ రూ.12–15 కోట్ల నుంచి రూ.18–19 కోట్లకి చేరింది. దేవాలయాల రూట్లలో ప్రయాణం 82 శాతం పెరిగింది. మహాలక్ష్మి పథకం కింద 8,459 కోట్ల రూపాయలు ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించింది.

ఆర్టీసీ బస్సులకు మహిళలను యజమానులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నది. ఇప్పటి వరకు 152 బస్సులకు వారు యజమానులుగా ఉన్నారు. రానున్న కొద్ది రోజుల్లో మరో 448 బస్సులు మహిళా సంఘాల ద్వారా నడవనున్నాయి.

నేను రవాణాశాఖ బాధ్యత తీసుకున్న తర్వాత టీజీఎస్‌ఆర్టీసీలో స్థిరత్వం, ఉద్యోగుల సంక్షేమం, సేవల మెరుగుదలపై దృష్టి పెట్టాను. కొత్త బస్సులు, కొత్త రూట్లు, ఆధునిక సేవలు.. మహాలక్ష్మి స్కీమ్‌తో పాటు రవాణా రంగాన్ని మరింత ప్రజాకేంద్రంగా మలుస్తున్నాం. 9,384 బస్సులతో నడుస్తున్న ఆర్టీసీ, మహాలక్ష్మి ప్రభావంతో 97 బస్ డిపోల్లో పూర్తి ఆక్యుపెన్సీ సాధించింది. ఉద్యోగులకు డియర్‌నెస్ అలవెన్స్, పెన్షన్లు పెంచి, సంక్షేమాన్ని బలపరిచాం. ఇది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు.

ప్రజల ఆశీర్వాదాలతో ఏర్పాటయిన తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుంది. శ్రీమతి సోనియాగాంధీ, రాహుల్‌గాంధీల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆశయాలకు అద్దంపట్టి, రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో పయనింపజేస్తోంది. ఈ కాలంలో మహిళలు, సామాన్య కుటుంబాలకు ఆర్థిక భరోసాను కల్పించింది. దీర్ఘకాలికంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలపరిచే విధానాలు, పథకాలను మా ప్రభుత్వం తీసుకొచ్చింది. రైతు సంక్షేమం, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఆరోగ్యశ్రీ, బీసీల సంక్షేమం, అభివృద్ధి లాంటివి ప్రజల జీవితాల్లో అభివృద్ధికరమైన మార్పును తీసుకువచ్చాయి. మహాలక్ష్మి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తెలంగాణ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. రూ.500కి గ్యాస్ అందిస్తున్నాం. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళలకు అనేక పథకాలు అమలుచేస్తున్నది. వడ్డీలేని రుణాలు మంజూరు చేస్తోంది. మహిళలకు సోలార్ పవర్ ప్లాంట్, పెట్రోల్ బంకులు, ఇందిరా మహిళా క్యాంటీన్‌లు... ఇలా ఎన్నో పథకాలు వారు ఆర్థిక వృద్ధిని సాధించేలా అమలుచేస్తోంది.

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ఆమె చేసిన త్యాగమయ స్ఫూర్తితో ఆమె నాయకత్వంలో, ప్రజల కోసం, దేశం కోసం ఇక ముందూ మరింత నిబద్ధతతో, బాధ్యతతో, ప్రేమతో తెలంగాణ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సేవ చేస్తాం. శ్రీమతి సోనియాగాంధీకి జన్మదిన శుభాకాంక్షలు – ఆమె స్ఫూర్తి ఎప్పటికీ మనకు మార్గదర్శకం!



● **పొన్నం ప్రభాకర్**
రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి

తెలంగాణతో సోనియా బంధం అపురూపం

అధికారమే పరమావధిగా భావిస్తున్న ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో అందివచ్చిన అధికారాన్ని తృణపాయంగా త్యాగం చేసిన సోనియాగాంధీ, దేశ రాజకీయాలకే ఆదర్శంగా నిలిచారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో 22 ఏండ్ల పాటు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా సేవలందించిన సోనియాగాంధీ లౌకికవాదానికి కట్టుబడుతూ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వారసత్వాన్ని కొనసాగించారు. భర్త రాజీవ్‌గాంధీకి తోడుగా అమేథి నియోజకవర్గం బాగోగులను చూసుకుంటూ ప్రజలతో మమేకమై, సమస్యలను పరిష్కరిస్తూ వారి ప్రేమాభిమానాలు పొందారు.



ఇందిరాగాంధీ అమానవీయ హత్యతో సోనియాగాంధీ షాక్ అయ్యారు. అనంతరం రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి పదవి చేపట్టాక ఆమెలో ఒకింత ఆందోళన నెలకొన్నది. 1991 మే 21న రాజీవ్‌గాంధీ తమిళనాడులో ఉగ్రవాదుల ఆత్మాహుతి దాడిలో హత్యకు గురయ్యారు. భర్త మరణం తర్వాత– కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టి, ప్రధానమంత్రి కావాలని యావత్ దేశం, కాంగ్రెస్ పార్టీ కోరినా... సోనియాగాంధీ సున్నితంగా తిరస్కరించి, రాజకీయాలకు దూరంగా ఉన్నారు. కొంతకాలం తర్వాత ధైర్యం తెచ్చుకుని, పిల్లలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలకు తన భర్త, అత్త ధైర్యసాహసాలు, వారు చేసిన త్యాగాలు నూరిపోసి గొప్ప దేశ నాయకులుగా తీర్చిదిద్దారు.

‘రాజీవ్‌గాంధీ ఫౌండేషన్’ చేపట్టి పలు సేవా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బాబ్రీ మసీద్ అల్లర్లు, గుజరాత్ అల్లర్ల సమయంలో దేశంలో లౌకికవాదానికి ముప్పు వాటిల్లిందని ఆమె తల్లడిల్లిపోయారు. వీటితో పాటు సునామీ విపత్తుతో అనాథలైన పిల్లలకు చదువు చెప్పించడంతో సహా అన్ని రకాల సహాయసహకారాలను ఆమె ఫౌండేషన్ తరఫున అందించారు. దివ్యాంగులకు ఫౌండేషన్ తరఫున అనేక కార్యక్రమాలు రూపొందించారు.

దేశంలో కుల, మత రాజకీయాలు పెరిగిపోయి ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం బలహీనపడడంతో దేశ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఒత్తిడి తేవడంతో సోనియాగాంధీ 1997లో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. 1998లో పార్టీ అధ్యక్ష పదవి చేపట్టారు. 1999లో లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ప్రజల గొంతుకయ్యారు. ఎన్డీయే ప్రభుత్వంపై ప్రతిపక్ష నేతగా ఆమె అలుపెరగని పోరాటం చేశారు. సోనియాగాంధీ 2003లో దేశవ్యాప్తంగా దాదాపు 30 వేల మైళ్లు ప్రయాణించి, సుమారు 150 ర్యాలీల్లో పాల్గొన్నారు.

2004 ఎన్నికలలో “కాంగ్రెస్ కీ హాత్.. గరీబోం కీ సాత్” (కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తం) అనే నినాదంతో దేశ ప్రజల మనస్సులను చూరగొని, కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ కూటమి కేంద్రంలో అధికారం చేపట్టడానికి సోనియా ఎంతో కృషి చేశారు. వామపక్ష పార్టీల మద్దతుతో అప్పుడే ఆమెకి ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చింది. కానీ సోనియాపై కక్షగట్టి ‘విదేశీ మహిళ’ అంటూ బీజేపీ కుట్రలు పన్నింది. ఒక భారతీయురాలిగా దేశాభివృద్ధి కోసం కృషి చేస్తాను, నాకు పదవుల కంటే దేశం సుభిక్షంగా ఉండడమే ఇష్టం– అని తలచిన సోనియాగాంధీ ప్రధానమంత్రి పదవిని త్యాగం చేశారు. దేశాభివృద్ధి కోసం అనుభవజ్ఞుడైన, నిజాయతీకి మారుపేరైన ఆర్థికవేత్త డాక్టర్ మన్మోహన్ సింగ్‌ను ప్రధానమంత్రి పదవి చేపట్టేందుకు ఒప్పించి 10 సంవత్సరాల పాటు ఆయనకు సంపూర్ణ మద్దతు ఇచ్చారు.

దేశాభివృద్ధికి సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ వంటి పథకాలు తీసుకురావడానికి కృషి చేసిన సోనియాగాంధీని లక్ష్యంగా చేసుకుని, ఆమె ప్రభుత్వ నిర్ణయాల్లో జోక్యం చేసుకుంటున్నారని బీజేపీ ఆరోపిస్తే, ఆమె ఎన్ఏసీ ఛైర్మన్ పదవికి, ఎంపీ పదవికి రాజీనామా చేసి, పదవులు తనకు తృణపాయమని మరోసారి నిరూపించారు. సోనియాగాంధీ యూపీఏ ఛైర్మన్‌గా ఉన్నప్పుడే చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టారు. ఆమె కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఉన్నప్పుడే దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిగా ప్రతిభా పాటిల్, తొలి దళిత మహిళా లోక్‌సభ స్పీకర్‌గా మీరా కుమార్ ఎంపికే మహిళలకు ఆమె ఇచ్చే ప్రాధాన్యతకు నిదర్శనం.


తెలంగాణ రాష్ట్రానికి, సోనియాగాంధీకి మధ్య ఉన్న బంధం వెలకట్టలేనిది. ప్రత్యేక తెలంగాణ కోసం 1969 నుంచి జరిగిన ఉద్యమాలు, రాష్ట్ర ప్రజల చిరకాల వాంఛను గుర్తించిన సోనియాగాంధీ 2004లో కరీంనగర్ వేదికగా తెలంగాణ ఏర్పాటుపై హామీ ఇచ్చారు. 2009 డిసెంబర్ 9న హోం మంత్రి చిదంబరం ద్వారా తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తామని ప్రకటింపజేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేయకుండా 2014లో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన సోనియాగాంధీ ఈ ప్రాంత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.



◆ **బి.మహేశ్‌కుమార్ గౌడ్**
టీపీసీసీ అధ్యక్షులు
(నేడు సోనియాగాంధీ పుట్టినరోజు)

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
మంగళవారం 9 డిసెంబరు 2025

కార్యదర్శులకు కష్టకాలం



పంచాయతీ ఎన్నికల ఖర్చు భారంతో సతమతం

- ఎన్నికల నిర్వహణకు నిధులివ్వని ప్రభుత్వం
- జేబులో నుంచి ఖర్చు పెట్టుకుంటున్న వైనం
- నామినేషన్ల ఏర్పాట్లకే రూ. 25వేల వరకు...
- పోలింగ్ రోజు మరింత పెరిగే అవకాశం
- ఎవరికీ చెప్పుకోలేని ఇబ్బందికర పరిస్థితి

హనుమకొండ, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి) : 'ఏంకి పెళ్లి సుబ్బి చావుకు' అన్నట్టుగా మారింది పంచాయతీ కార్యదర్శుల పరిస్థితి. పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లకు కార్యదర్శులకు చేతిచమురు వదులుతోంది. ఎన్నికల నిర్వహణకు ముందస్తుగా నిధులేమి ఇవ్వకపోవడంతో ఖర్చు భారం పంచాయతీ కార్యదర్శులపై పడుతోంది. పంచాయతీ ఎన్నికల నిర్వహణలో కార్యదర్శుల పాత్ర కీలకం. అన్ని దశల్లో వారి భాగస్వామ్యం తప్పని సరి. మరీ ముఖ్యంగా నామినేషన్ల స్వీకరణ, పోలింగ్ నిర్వహణ తదితర దశల్లో వారు ముందుండాల్సి ఉంటుంది. కనుక పోలింగ్ సిబ్బందికి అవసరమైనవన్నీ వారే దగ్గరుండి సమకూర్చాలి. ఇందు కోసం కార్యదర్శులు ప్రస్తుతం తమ జేబులోంచి ఖర్చుపెట్టుకోవలసి వస్తోంది.

ఏర్పాట్లపై ఖర్చు

ఉమ్మడి జిల్లాల్లో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ప్రస్తుతం మూడవ విడత నామినేషన్ల స్వీకరణ కొనసాగుతోంది. నామినేషన్ల స్వీకరణకు మూడు నాలుగు పంచాయతీలకు కలిపి ఒక క్లస్టర్ కేంద్రాలను ఏర్పాటు చేశారు., ఒక్కో జిల్లాలో వాటి పరిధిలోని పంచాయతీల సంఖ్యను బట్టి 60 నుంచి 70 క్లస్టర్ల చొప్పున ఏర్పాటు చేశారు. గత నెల 27 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైంది. మొదటి, రెండవ విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. మూడో విడతకు ఉపసంహరణల ఘట్టం మంగళవారం ముగుస్తోంది. నామినేషన్ల స్వీకరణ నుంచి పరిశీలన, ఉపసంహరణలు, గుర్తుల కేటాయింపు, పోలింగ్, ఫలితాల వెల్లడి ఇలా పదిహేను రోజుల ప్రక్రియ. నామినేషన్ల స్వీకరణ కోసం ఒక్కో క్లస్టర్ కేంద్రంలో ఆర్‌వో, ముగ్గురు నుంచి నలుగురు ఏఆర్‌వోలు, నలుగురు పోలీసులు, అయిదాగురు సహాయకులు, ఇతరత్రా సిబ్బందిని నియమించారు. వీరికి నిత్యం కేంద్రాల వద్ద అల్పాహారం, భోజనం, తాగునీరు, నామినేషన్లు వేయడానికి వచ్చే వారికి నీడ కోసం టెంట్లు, కుర్చీలు, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత సంబంధిత పంచాయతీ కార్యదర్శులదే. మౌఖిక ఆదేశాలతో కార్యదర్శులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకయ్యే ఖర్చును ప్రస్తుతం వారే భరిస్తున్నారు. దీనితో ఇప్పటికే రూ 20 నుంచి రూ. 25వేల వరకు చేతి చమురు వదిలింది. మొదటి రోజు కొన్ని చోట్ల హోటళ్ల, పాఠశాలల్లో వండిన భోజనాలు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

సిబ్బంది ఇష్టపడకపోవడంతో మరుసటి రోజు ప్రత్యేకంగా వంటలు చేయించినట్లు తెలిసింది. ఇది ఇంతటితోనే అయిపోలేదు. ఈనెల 11, 14, 17 తేదీల్లో మూడు విడత పోలింగ్ ఉంది. ఆ రోజు కూడా వీరు పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను చేయాల్సిన బాధ్యత కూడా కార్యదర్శులదే. పోలింగ్ కేంద్రాల్లో బెంచీలు, కుర్చీలు, వాటి ముందు టెంట్లు, తాగునీరు తదితర ఏర్పాట్లను కూడా వారే చూడాలి. దీని కోసం కూడా మరో రూ 20వేల దాక ఖర్చుకానున్నది. దీనిని కూడా వారే భరించాల్సి ఉన్నది. ఇప్పటికే రెండేళ్లుగా పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర నిదులు రాక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. మళ్లీ ఎన్నికల ఖర్చు ఒకటి వచ్చి పడింది. డబ్బులు జేబులోంచి పెట్టుకోవలిసి వస్తోందని కార్యదర్శులు వాపోతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కమ్యూనికేషన్ అధికారులుగా కొందరు పంచాయతీ కార్యదర్శులు పని చేశారు. భత్యం చెల్లిస్తామన్న అధికారులు ఇప్పటి వరకు ఇవ్వలేదని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 1708 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

'మొదటి విడత'కు పటిష్ఠ ఏర్పాట్లు

- పోలింగ్ పకడ్బందీగా జరిగేలా చర్యలు
- కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) :ఈ నెల 11న జిల్లాలోని భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో జరిగే సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఎంపీడీవోలను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్‌ఐసీ హాలు నుండి సోమవారం కలెక్టర్ భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ ఎంపీడీవోలతో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో ప్రిసైడింగ్ అధికారులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమం, పోలింగ్ మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు, గ్రామపంచాయతీల వారీగా పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లు, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్, బడ్జెట్, తదితర అంశాలను సంబంధిత మండలాల ఎంపీడీవోలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 10న పోలింగ్ మెటీరియల్ పంపిణీ కోసం ఈ మండలాల్లో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్ద టీవీటీలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించాలన్నారు. చెక్‌లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటీరియల్‌ను సరిచూసుకోవాలన్నారు.

షోకాజ్ నోటీసులు

ఆయా మండలాల్లో ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిర్వహించిన శిక్షణకు హాజరుకాని ప్రిసైడింగ్ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాలకు ప్రిసైడింగ్ అధికారులకుగా కేటాయించినా శిక్షణ కార్యక్రమానికి పలువురు హాజరుకాకపోవడంపై షోకాజ్ నోటీసు జారీ చేయనున్నట్లు తెలపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, డీఆర్‌డీఓ మేన శ్రీను, జడ్పీ సీఈఓ రవి, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల ప్రత్యేక అధికారులు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రచారంపై పక్కా నిఘా

- పరిశీలన కోసం ప్రత్యేక బృందాల కేటాయింపు
- మద్యం, కానుకల పంపిణీపై దృష్టి
- ఎప్పటికప్పుడు వీడియోల చిత్రీకరణ

7

ఓటెయ్యడానికి రారాదె...

- నాన్‌లోకల్ ఓటర్లను బతిమలాడుతున్న అభ్యర్థులు
- పంచాయతీ ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా ఎంతో విలువైనది
- పల్లెల్లో విందుల సందడి జోరు

హనుమకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో ఒక్క ఓటుకు కూడా సర్పంచ్ స్థానాలను తారుమారు చేసే శక్తి ఉంటుంది. దీంతో అభ్యర్థులు నాన్ లోకల్ ఓటర్లకు ఫోన్లు చేసి సంప్రదిస్తున్నారు. హనుమకొండ జిల్లాలో మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడతలో భీమదేవరపల్లి, కమలాపూర్, ఎల్కతుర్తి మండలాలు ఉండగా, రెండో విడతలో పరకాల, ధర్మసాగర్, వేలేరు , ఐనవోలు కాగా మూడో విడతలో దామెర, ఆత్మకూరు, శాయంపేట, నడికూడ మండలాల్లో ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ వేసిన అభ్యర్థులు గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు ఉద్యోగాల కోసం , వ్యాపారాల కోసం వలస వెళ్లిన వారికి ఫోన్ చేసి అన్నా బాగున్నారా, ఎక్కడ ఉన్నారు ఎన్నికల్లో సర్పంచ్‌గా, వార్డు మెంబర్‌గా నామినేషన్ వేసి పోటీలో నిలబడ్డామని పోలింగ్ రోజుకు ఒక రోజు ముందు గ్రామానికి వచ్చి ఓటు వేసి వెళ్లాలని బతిమిలాడుకుంట న్నారు. రాను పోను ఖర్చులు సైతం భరిస్తామని కొన్ని గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు తగిన

(మిగతా 6వ పేజీలో)




నర్సంపేటలో అయ్యప్ప శోభాయాత్రలో నృత్యం చేస్తున్న కళాకారులు

వైభవంగా పల్లివేట

- నర్సంపేటలో మార్మోగిన అయ్యప్ప నామస్మరణ
- కనుల పండువగా శోభాయాత్ర
- ఆకట్టుకున్న డప్పుచప్పుళ్లు, మహిళల కోలాటాలు
- మునిసిపల్ కార్యాలయ ఆవరణలో అభిషేక పూజలు

7

అమ్మవారి చెంతన అస్తవ్యస్త పాలన

- భద్రకాళి ఆలయంలో గాడి తప్పిన పర్యవేక్షణ
- ఏవో స్థాయి అధికారిని నియమించాలంటున్న భక్తులు
- ప్రొటోకాల్ దర్శనాల వేళ ప్రైవేటు వ్యక్తులదే హడావిడి
- ప్రముఖుల రాకపై వివరాలు నమోదు చేయని వైనం
- సిబ్బందికి డ్రెస్ కోడ్, ఐడీ కార్డులు ఏవీ?





వరంగల్ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రసిద్ధ భద్రకాళి ఆలయ పరిధిలో పాలన గాడి తప్పుతోందనే విమర్శలు వస్తున్నాయి. అమ్మవారి దర్శనార్థం దేశం నలుమూలల నుంచి నిత్యం వేలాది మంది భక్తులు వస్తుంటారు. అలాగే ప్రతీ రోజు ప్రొటోకాల్ స్థాయి కలిగిన ప్రముఖులు అమ్మవారి సన్నిధికి వస్తారు. రోజు రోజుకు భక్తుల సంఖ్య కూడా పెరుగుతోంది. అయితే మారుతున్న అవసరాలకు తగినట్టుగా ఆలయ సిబ్బంది సంఖ్య పెరగకపోవడం, పరిపాలన పరంగా నూతన చర్యలు చేపట్టకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.అలాగే పర్యవేక్షణ లోపం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. అందువల్ల నూతన నిబంధనలను అమలు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పనుల నత్తనడక

భద్రకాళి ఆలయ అభివృద్ధి, విస్తరణకు రూ. కోట్లాది నిధులను ప్రభుత్వం కేటాయించగా ఈ పనుల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా మాడ వీధుల అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రతతో పాటు ప్రసాదాల విక్రయాలు, సేవ నిర్వహించే వలంటీర్ల విధుల నిర్వహణ తదితర అంశాల పర్యవేక్షణకు ఓ అధికారి ప్రత్యేకంగా అవసరం. ప్రస్తుత ఆలయ ఈవో ఉమ్మడి వరంగల్ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌గా, మరో నాలుగు దేవాలయాలకు ఈవోగా ఇన్‌చార్జి విధులు నిర్వహిస్తున్నారు. భద్రకాళి ఈవోగా పనిచేస్తూ మేడారం జాతరతో పాటు పలు ప్రాంతాల్లోని సమ్మక్క జాతరల అధికారిగా విధులు నిర్వహిస్తుండడంతో పనిభారం ఎక్కువవుతోందని అంటున్నారు. అందువల్ల అభివృద్ధి పనుల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని భక్తులు అంటున్నారు.

ఏవో స్థాయి అధికారి

ఆలయానికి వచ్చే భక్తులకు సౌకర్యాల ఏర్పాటు, ప్రసాదాల విక్రయాలు, టికెట్ల జారీ, ఆలయ పరిశుభ్రత, సీసీ కెమెరాల నిఘా, భక్తుల ఉచిత అన్నదాన నిర్వహణ, ఆలయంలో కింది స్థాయి ఉద్యోగులకు విధుల కేటాయింపు, వలంటీర్ల సేవలు.. అన్నింటిపై పర్యవేక్షణకు ఒక ఏవో (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్) స్థాయి అధికారిని నియమించాలని అంటున్నారు. ఆలయానికి సంబంధించి వీఐపీల రాకపోకలు, ప్రముఖులు, పీఠాధిపతులు రాక వివరాలు తెలపడం, మీడియాకు సమాచారం అందించడం వంటి విషయాలపై ఈ అధికారికి బాధ్యతలు అప్పగించాలని సూచిస్తున్నారు.

ప్రైవేటు అర్చకులు..

అమ్మవారి దర్శనార్థం ప్రజా ప్రతినిధులు, వీఐపీలు, సినీ ప్రముఖులు, మఠాధిపతులు, పీఠాధిపతులు వచ్చిన సమయంలో

(మిగతా 6వ పేజీలో)

పోలీసుల కళ్లు గప్పి..

- హనుమకొండ పోలీస్ స్టేషన్ నుంచి ముగ్గురు నిందితుల పరార్
- గంజాయి ఆయిల్ కోసం వచ్చి పట్టుబడిన నలుగురు చెన్నై వాసులు
- రాత్రి వేళ విధుల్లో వున్న సిబ్బంది నిర్లక్ష్యమే కారణం

వరంగల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి నుంచి తీసే హాశిష్ ఆయిల్ కోసం తమిళనాడు రాష్ట్రం చెన్నై నుంచి వచ్చిన నలుగురు వ్యక్తులు పోలీసులకు అర్ధరాత్రి పట్టుబడ్డారు. కాగా, తెల్లారేసరికి హనుమకొండ పోలీస్ స్టేషన్ నుంచి నలుగురిలో ముగ్గురు పరారయ్యారు. వివరాల్లోకి వెళితే.. హాశిష్ ఆయిల్ కోసం నలుగురు వ్యక్తులు చెన్నై నుంచి వస్తున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం బృందం ఆదివారం రాత్రి రెక్కీ నిర్వహించింది.

నలుగురుతో పాటు ఆయిల్ విక్రయించే ఒడిసాకు చెందిన వ్యక్తిని హనుమకొండ పీఎస్ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతంలో పట్టుకున్నారు. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో ఒడిసాకు చెందిన వ్యక్తి పరారీ కావడంతో చెన్నైకి చెందిన నలుగురిని ఆదివారం అర్ధరాత్రి హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఇందులో ఒడిసాకు చెందిన వ్యక్తి నుంచి 2కిలోల హాశిష్ ఆయిల్ సైతం స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది.

కాగా, పోలీసుల కస్టడీలో ఉన్న నలుగురిలో ముగ్గురు వ్యక్తులు సోమవారం తెల్లవారుజామున పోలీస్‌స్టేషన్ వెనుకాల ఉన్న డోర్ నుంచి పారిపోయారు. రాత్రి విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నందునే నిందితులు తప్పించుకున్నారని తెలిసింది. కాగా, ఇటీవల మామునూర్ పోలీస్‌స్టేషన్ నుంచి ఇద్దరు గంజాయి నిందితులు పారిపోగా ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న సీపీ ఇద్దరు కానిస్టేబుల్స్‌పై వేటు వేసిన విషయం విదితమే.

మేడారంలో చురుగ్గా అభివృద్ధి పనులు

- జంపన్నవాగు వద్ద అందుబాటులోకి రాని గదులు
- బట్టలు మార్చుకునేందుకు మహిళల ఇబ్బందులు


మేడారం దేవస్థానం వద్ద కొనసాగుతున్న పనులు

తాడ్వాయి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. దేవస్థానం పునరుద్ధరణ పనుల్లో భాగంగా రాతి నిర్మాణాలు జరుగుతున్నాయి. ఈ నెల చివరి వరకు పనులు పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. పగిడిద్దరాజు, గోవిందరాజుల నూతన గద్దెల నిర్మాణం పూర్తయ్యిందని తెలిపారు. సమ్మక్క-సారలమ్మల గద్దెలు, అదే ప్రాంగణంలో గ్రానైట్ పనులు, దేవస్థానం చుట్టూ ప్రాకారం, ఆర్చిగేట్ పనులు కొనసాగుతున్నాయి.

బట్టలు మార్చుకునే గదులు

మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి వస్తున్న మహిళా భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం మహిళలు బట్టలు మార్చుకోవడానికి ఉన్న గదులను అధికారులు అందుబాటులోకి తేవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. జంపన్నవాగు ఒడ్డున ఉన్న మహిళలు బట్టలు మార్చుకునే గదులు ఉన్నప్పటికీ అధికారులు వాటికి మరమ్మతులు చేయించి సిద్ధం చేయలేదు. మహా జాతరకు ముందుగానే వేలాది మంది భక్తులు తల్లులను దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో మహిళా భక్తులకు బట్టలు మార్చుకొనే గదులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు దీనిపై స్పందించాలని పలువురు కోరుతున్నారు.

సీఎం వచ్చే దారి

మేడారం మహా జాతరకు ముఖ్యమంత్రి వచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలోనే జనవరి చివరి వారంలో మహా జాతరకు సీఎం రేవంత్‌రెడ్డి అధికార లాంఛనాలతో రానున్నట్లు గతంలో మంత్రి సీతక్క వెల్లడించారు. అందుకు గతంలో ఉన్న దారిని మార్చారు. ప్రధాన ద్వారం ద్వారా వెళ్లే విధంగా సీఎం దారిని అధికారులు పునర్నిర్మాణ పనులకు ప్రణాళికలు చేపట్టారు.

ఈ క్రమంలో సోమవారం సర్వే పనులు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా గతంలో మాదిరిగా భక్తులు వేచి ఉండకుండా ఈ పనులు చేస్తున్నట్లు పస్రా సీఐ దయాకర్ తెలిపారు. ఇందులో భాగంగా పనులు పరిశీలించి కాంట్రాక్టర్‌కు ఆయన పలు సూచనలు చేశారు.


బహిరంగ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఓసీ జేఏసీ నేతలు

ఓసీ కమిషన్ ఏర్పాటు చేయాలి

- ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి
- జనవరి 11న హనుమకొండలో బహిరంగ సభ

వడ్డెపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఓసీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఓసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గోపు జయపాల్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు ఓసీ జేఏసీ కోశాధికారి నడిపల్లి వెంకటేశ్వర్‌రావు మాట్లాడారు. ఓసీ ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి షరతులు లేని ఐదేళ్ల కాల పరిమితిని కలిగి ఉండేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఓసీ ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు విద్య, ఉద్యోగ పోటీ పరీక్షల వయో పరిమితిని పెంచాలని, బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓసీఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ జారీకి ఆదాయ పరిమితి రూ. 10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. టెట్ రాత పరీక్ష అర్హతను 90 మార్కుల నుంచి 70 మార్కులకు తగ్గించాలని, కేంద్ర,

(మిగతా 6వ పేజీలో)

ఓటెయ్యడానికి రారాదే..

(5వ పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేస్తున్నట్లు చెబుతున్నారు.

నాయకుల విందులు..

గ్రామాలలో ఎన్నికల సందడితో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఓట్ల కోసం విందులు ఏర్పాటు చేసి అభ్యర్థులు తమ వైపు తిప్పుకుంటున్నారు. ఎన్నికలు జరిగే వరకు పూర్తి ఖర్చులు భరిస్తూ తమ వెంట తిప్పుకుంటున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రచారం నిర్వహించి వెంట తిరిగిన వారికి ప్రత్యేకంగా వారికి నగదుతో పాటు విందులు ఏర్పాటు చేసి ఖుషీ చేస్తున్నారు.

హోరాహోరీగా ప్రచారాలు..

జిల్లా వ్యాప్తంగా సర్పంచ్, వార్డు స్థానాలకు జరుగుతున్న ఎన్నికలతో పల్లె పోరు రసవత్తరంగా సాగుతోంది. ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న కొద్దీ గ్రామాల్లో బరిలో నిలిచే నేతలు ఎవరి వారు గెలుపు దిశగా ముందుకు సాగుతున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు ఏ అవకాశాన్ని కూడా వదులుకోకుండా ప్రచారానికి వినియోగించుకుంటున్నారు. ఏ కుటుంబంలో ఎక్కువ ఓట్లు ఉన్నాయో ఎక్కువ సార్లు కలిస్తే తమకే ఓట్లు వేస్తారో వారిని కలుస్తున్నారు. ప్రతీ ఒక్కరిని ఆప్యాయతతో పలుకరిస్తూ ముందుకు సాగుతున్నారు.

అభ్యర్థుల తిప్పలు..

గ్రామాలలో ఓట్లు రాబట్టుకునేందుకు నామినేషన్ వేసిన అభ్యర్థులు నానా తిప్పలు పడుతున్నారు. ఉదయం 4 గంటల నుంచే ఇళ్లల్లోకి వెళ్లి పలకరించి ఓటు అభ్యర్థిస్తున్నారు. గతంలో ఎడమొఖం పెడమొఖంతో ఉన్నవారిని సైతం ఎన్నికల వేళ కలిసి మాట్లాడుతున్నారు. గతంలో జరిగిన విషయాలను మర్చిపోయి ఎన్నికల్లో తమకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

అమ్మవారి చెంతన అస్తవ్యస్త పాలన

(5వ పేజీ తరువాయి)

ఆలయ ఉద్యోగ, అర్చకులు ఉండడం సాధారణ విషయం. కాని వీఐపీల దర్శనాల సమయంలో ప్రైవేటు అర్చకులు, కింది స్థాయి సిబ్బంది హడావిడి చేస్తున్నారని, దీనివల్ల ఆలయ నిబంధనలు అమలుకావడం లేదని అంటున్నారు.

టికెట్ల వివరాల నమోదు..

అమ్మవారి సన్నిధికి వచ్చే వీఐపీలకు ప్రోటోకాల్ దర్శనం ఏర్పాటు తప్పనిసరి. ఇదే కాకుండా సేవాకర్తలు, మీడియా ప్రతినిధులు, ప్రముఖులు, కుటుంబ సభ్యులు అమ్మవారి దర్శనానికి వచ్చినప్పుడు వారి కోసం సిబ్బందిని ఏర్పాటు చేయాలి. యాదగిరి గుట్ట, వేములవాడ ఆలయాల్లో సూపరింటెండెంట్ స్థాయి అధికారి అమ్మవారి దర్శనానికి వచ్చే వారి వివరాలు, ఐడీ ప్రూఫ్‌లు చూసి ఏ రోజు ఎవరు వచ్చారు.. అనే వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. దర్శనానికి ఒక టికెట్ తీసుకోవాలనే విధానాన్ని రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాల్లో అమలు పరుస్తున్నారు. ఈ విధానాన్ని భద్రకాళి అమ్మవారి దేవాలయంలో కూడా అమలు పరచాలని కోరుతున్నారు.

సిబ్బందికి డ్రెస్ కోడ్, ఐడీ కార్డు

అమ్మవారి దేవాలయంలో, ఈవో కార్యాలయంలో, ప్రసాదాల విక్రయశాలలో తయారీ కేంద్రంలో అన్నదాన సత్రంలో విధులు నిర్వహించే సిబ్బందికి డ్రెస్ కోడ్, ఐడీ కార్డు ఉండాలని సూచిస్తున్నారు. అలాగే కార్యాలయంలోని వివిధ విభాగాలలో మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.

ఓసీ కమిషన్ ఏర్పాటు చేయాలి

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని కోరారు. తమ డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందు కోసం జనవరి 11న సాయంత్రం 3 గంటలకు హనుమకొండలోని ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్‌లో లక్ష మందితో నిర్వహించే భారీ బహిరంగ సభకు ఓసీలంతా రాజకీయాలకతీతంగా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. సమావేశంలో ఓసీ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుబ్బ శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోయినపల్లి పాపారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందుపట్ల నర్సింహ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చకిలం రాజేశ్వర్‌రావు, బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐనవోలు మల్లికార్జున శాస్త్రి, ఓసీ రాష్ట్ర, జిల్లా నాయకులు వీరభద్రయ్య, నల్ల రాజిరెడ్డి, గుండా ప్రభాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల పట్టివేత

వరంగల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేయూ ఫస్ట్ గేట్ సమీపంలోని గోల్డెన్ లాడ్జీలో పేకాటడుతున్న 11 మంది పేకాటరాయుళ్లను హనుమకొండ పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. 11 మంది నుంచి రూ. 73,590 నగదుతో పాటు 11 మొబైల్స్ స్వాధీనం చేసుకొని హనుమకొండ పోలీసులకు అప్పగించినట్లు మధుసూదన్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు, ఆర్ఎస్సై భానుప్రకాశ్, ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

96 దరఖాస్తులు స్వీకరించిన కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులే లక్ష్యంగా అధికారులు నిజాయితీగా పని చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరించి పరిష్కారనిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. ఇటీవల ఒకే ప్రాంతం నుంచి ఫిర్యాదులు తరుచుగా వస్తున్నాయని సమస్యలు పునరావృతం కాకుండా అధికారులకు చొరవ చూపాలన్నారు. ప్రధానంగా శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, పన్నుల విభాగాలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఇంజనీరింగ్ - 28, హెల్త్, శానిటేషన్ - 12, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 07, టౌన్‌ప్లానింగ్ - 45, మంచి నీటి సరాఫరా - 03, హార్టికల్చర్ - 01 మొత్తం 96 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో డిప్యూటి కమిషనర్లు సమ్మయ్య, ప్రసన్న రాణి, సీఎంహెచ్‌వో డాక్టర్ బొమ్మల రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఎస్ఈ సత్యనారాయణ, వెటర్నరీ అధికారి గోపాల్‌రావు, పన్నుల అధికారి రామకృష్ణ, హార్టికల్చర్ అధికారి రమేష్, హెచ్‌వో లక్ష్మారెడ్డితో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులు ఇలా..

● గ్రేటర్ వరంగల్ 65వ డివిజన్ ఎర్రగట్టుగుట్ట నారాయణనగర్ ప్రాంతంలో చాలా దీర్ఘకాలికంగా ఉన్న డ్రైయినేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు.

● హనుమకొండ యాదవనగర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వైన్ షాపుతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వైన్ షాపును అక్కడ నుంచి తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

● వరంగల్ ఉర్సు ప్రాంతంలోని రంగలీల మైదానంలో ఓపెన్ జిమ్ పబ్లిక్ టాయిలెట్స్ ఏర్పాటు చేయాలని రంగలీల వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్‌ను కోరారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ బాజ్‌పాయ్

ప్రైవేటు పాఠశాలల అనుమతుల్లో నిబంధనలు గాలికి..

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా విద్యాశాఖలో ప్రైవేటు బడుల అనుమతుల్లో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. జీవో నెం. 1 ప్రకారం నిబంధనలు పాటిస్తేనే ఎంఈవో విచారణ అనంతరం సంబంధిత పాఠశాలకు అనుమతులు జారీ చేసేందుకు డీఈవో సమ్మతిస్తూ రాష్ట్ర విద్యాశాఖకు సిఫారసు చేస్తారు. అయితే జిల్లాలో మాత్రం అలాంటిదేం జరుగడం లేదని తెలుస్తోంది. నిబంధనలను తుంగలో తొక్కుతూ అనుమతులు మంజూరు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమను ప్రసన్నం చేసుకుంటే చాలు నిబంధనలు పాటించకున్నా పర్వాలేదనే స్థితిలో జిల్లా విద్యాశాఖ ఉన్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సొసైటీ లేకుండానే..

జీవోనెం. 1 ప్రకారం రిజిస్టర్డ్ సొసైటీ ఉండి నిబంధనలు పాటిస్తేనే ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు మంజూరు చేస్తారు. అయితే వరంగల్ జిల్లా విద్యాశాఖాధికారి మాత్రం సొసైటీ లేకుండానే ఓ ప్రైవేటు పాఠశాలకు అనుమతులు మంజూరు చేశారు. చెన్నారావుపేట మండలంలో కంపెనీ యాక్టుతో ఉన్న ఓ సర్టిఫికెట్ ఆధారంగా అనుమతులు మంజూరు చేశారు. సొసైటీతో పాటు ఇంకా పలు నిబంధనలు పాటించకుండానే ఆ పాఠశాలకు అనుమతులు మంజూరు చేశారు. అలాగే హంటర్‌రోడ్‌లోని ఓ కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలకు సైతం నిబంధనలు ఉల్లంఘిస్తూ అనుమతులు జారీ చేసినట్లు తెలుస్తోంది. రాయపర్తి మండలంలోనూ ఇలాంటి పద్ధతిలోనే అనుమతులు జారీ చేసినట్లు ఆరోపణలున్నాయి. ఇదిలా వుండగా, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన ప్రతీ పనికి ఓ బ్రోకరే ముందుకు వస్తున్నట్లు తెలుస్తోంది. గంపగుత్తగా ప్రైవేటు స్కూల్ ఫైల్ మాట్లాడుకుని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డబ్బులు పంపిణీ చేసి అనుమతులు మంజూరు చేయిస్తున్నట్లు తెలుస్తోంది.



మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

విద్యార్థుల మానసిక వికాసాన్ని పెంపొందించాలి

● కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు8(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం స్టూడెంట్ వెల్‌నెస్ కార్యక్రమంపై వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విద్యార్థుల్లో మానసిక వికాసం, ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించే అంశాలను చర్చించారు. అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులలో మానసిక స్థైర్యాన్ని, ఆహార శైలి, అలవాట్లు, సురక్షిత వాతావరణం కల్పించాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, డీటీడీఓ ప్రేమకళ, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ నిర్మల, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి గౌస్ హైదర్, గురుకులాల విద్యాలయాల డీసీఓలు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

త్రినగరిలో పోలీసుల నాకాబందీ

● ప్రజలు పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో తనిఖీలు

● ట్రాఫిక్ జామ్..ప్రజల ఇక్కట్లు

వరంగల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రోజు వారి పనులు ముగించుకొని ప్రజలు ఎవరి ఇళ్లకు వారు వెళ్తున్న క్రమంలో వందలకొద్దీ పోలీసులు రోడ్డెక్కి ఆకస్మాత్తుగా రోడ్డుపై వెళ్తున్న వాహనదారులను తనిఖీలు చేయడంతో ప్రజలు ఉలిక్కిపడ్డారు. వరంగల్ సీపీ ఆదేశాలతో సోమవారం సాయంత్రం 6 గంటల తర్వాత వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని పోలీసులు వాహనాలు ఆపి తనిఖీలు చేయడంతో పాటు కాలనీల్లో తనిఖీలు చేసి అనుమానితుల కనిపిస్తే సమాచారం ఇవ్వాలని సూచించారు. సీపీ స్వయంగా హంటర్‌రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్ సర్కిల్‌లో వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు. కాగా, చిన్న చిన్న పత్రాలు లేకుండా పట్టుబడిన వాహనదారులను గంటల కొద్దీ నిలిపివేయడంతో అసహనానికి లోనయినట్లు తెలుస్తోంది. వందల మీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్ కావడంతో పనులు ముగించుకొని ఇంటికి వెళ్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సురక్షితమైన నగరం కోసం పోలీస్‌శాఖ తనిఖీలు చేయడం తప్పు కాదు కానీ ప్రజలు రోజు వారి పనులు ముగించుకొని ఇళ్లకు వెళ్తున్న సమయంలో నగరం పొడవునా ఒకేసారి పోలీసులు రంగంలోకి దిగి వాహనాలను ఆపడం సాధారణ ప్రజలు అడుగడుగునా అసహనానికి గురయ్యారు. ఇళ్లకు వెళ్తున్న క్రమంలో పోలీసులు మూకుమ్మడిగా తనిఖీలు చేయడంపై ప్రజలు విమర్శలు కురిపించారు.



హంటర్‌రోడ్డులోని తనిఖీలు చేస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

సారథి లేకుండానే 'గులాబీ' పోరు

● సందిగ్ధంలో పార్టీ క్యాడర్

● బాధ్యతలన్నీ నియోజకవర్గ ఇన్‌చార్జిలపైనే...

మట్టెవాడ(వరంగల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దశాబ్దకాలం పాటు వరంగల్ జిల్లాలో ఏ ఎన్నిక జరిగినా విజయం సాధించిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం భిన్న పరిస్థితిని ఎదుర్కొంటోంది. రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోవడం, అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లా నుంచి ఒక్క ఎమ్మెల్యేనే గెలవడం, లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్లమెంట్ స్థానాల్లో ఓడిపోవడం.. ఇవన్నీ రెండేళ్లుగా పార్టీ క్యాడర్‌ను నిరాశ పరుస్తున్నాయి. నాయకత్వం లేకపోవడం.. పార్టీ సంస్థాగత నిర్మాణంపై అధిష్ఠానం దృష్టి సారించకపోవడం.. పార్టీ నాయకులు, కార్యకర్తలను సమన్వయపరిచే జిల్లా అధ్యక్షుడి స్థానం 20 నెలలుగా భర్తీ చేయకపోవడం.. పార్టీ శ్రేణులను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయి. ఇప్పుడు గ్రామ పంచాయతీ ఎన్నికలు బీఆర్ఎస్ పార్టీకి సవాల్‌గా నిలిచాయి.

గత పంచాయతీ ఎన్నికల్లో జిల్లాలో 340 గ్రామ పంచాయతీలలో 270కి పైగా గులాబీ పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపొందారు. అయితే గత పంచాయతీ ఎన్నికల మాదిరిగా ఇప్పుడు ఎన్నికల్లో గెలుపు అంత సులభం కాదని బీఆర్ఎస్ నేతల్లో, కార్యకర్తల్లో చర్చ సాగుతోంది. పార్టీకి జిల్లా అధ్యక్షుడు లేకపోవడంతో ఎవరికి నచ్చిన విధంగా వారు నడుచుకుంటున్నారు. దాంతోపాటు సంస్థాగతంగా జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయిలో పూర్తిస్థాయి కమిటీలు ఏర్పాటు చేయకపోవడం.. అనుబంధ కమిటీల ఏర్పాటుపై దృష్టి సారించకపోవడంతో కార్యకర్తలు అయోమయంలో పడుతున్నారు. అంతేగాకుండా బీఆర్ఎస్ కార్యకర్తలను మాజీ ప్రజాప్రతినిధులను, ఉద్యమకారులను సమన్వయం చేయకపోవడం ప్రధాన సమస్యగా మారింది. దీంతోపాటు రెండు సంవత్సరాలుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీని వీడటం కూడా మరింత ఇబ్బంది కలిగిస్తోంది.

నర్సంపేట నియోజకవర్గంలో ఆరు మండలాల పరిధిలో 171 గ్రామాలలో ఎన్నికలు జరుగనున్నాయి. ఇక్కడ పట్టు సాధించేందుకు బీఆర్ఎస్ నాయకుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మెజారిటీ గ్రామ పంచాయతీలలో బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రత్యేక దృష్టి సారించి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి, వర్ధన్నపేట మండలాల్లో 50, రాయపర్తి మండలంలో 38 గ్రామ పంచాయతీలలో బీఆర్ఎస్ బలర్చిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతున్నారు.

పరకాల నియోజకవర్గ పరిధిలోని సంగెం, గీసుగొండ మండలాల్లో 52 గ్రామ పంచాయతీల్లో బీ ఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు.

సాయి ఈశ్వరాచారి ఆత్మహత్య ప్రభుత్వ హత్యే

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి



అమరవీరుల స్థూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు

సుబేదారి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఆత్మ బలిదానానికి పాల్పడిన సాయి ఈశ్వరాచారి ఆత్మహత్య ప్రభుత్వ హత్యేనని, అతడి కుటుంబానికి రూ. ఒక కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు భిక్షపతి డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ఆత్మ బలిదానినికి పాల్పడిన సాయి ఈశ్వరాచారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ సోమవారం రాత్రి హనుమకొండలోని జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి అమరవీరుల స్థూపం వరకు విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం హనుమకొండ, వరంగల్ జిల్లా కమిటీ, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రోజు భిక్షపతి మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు.

సాయి ఈశ్వరాచారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగంతోపాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్యసంఘం రాష్ట్ర సెక్రటరీ కలకోట శ్రీధర్, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షుడు శృంగారపు వెంకటేశ్వర్లు, కురిమిల్ల రమేశ్, టీడీపీ రాష్ట్ర నాయకుడు చెన్నోజు రఘుబాబు, రాష్ట్ర, జిల్లా నాయకులు బాలాజీ భద్రయ్య, మల్యాల లింగమూర్తి, కె.ఏకాంతం, ఎం.వీరాచారి, ఎన్.మురళి, విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు ఎస్.విద్యాసాగర్, ఎస్.రాజ్‌కుమార్, పూర్ణచందర్‌రావు, బాలాజీ కిషన్, పంచకోటి సాంబమూర్తి పాల్గొన్నారు.



సంఘం సమావేశంలో పెరిక కుల వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న అధ్యక్షుడు విజయ్ కుమార్

పెరిక కులస్థుల అభివృద్ధికి కృషి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్‌కుమార్

వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అల్లం రాజేష్ వర్మ

గిర్మాజిపేట(వరంగల్), డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎంకె నాయుడు కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి జరిగిన తెలంగాణ పెరిక కుల సంఘం సర్వసభ్య సమావేశం లో పెరిక కులం వెబ్‌సైట్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిక కులస్థుల అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కోకాపేటలో రెండెకరాల స్థలంలో తెలంగాణ పెరిక కుల ఆత్మగౌరవ భవనం నిర్మిస్తున్నామన్నారు.

బాలికల కోసం ఎల్బీనగర్ ప్రాంతంలో ప్రత్యేక వసతి గృహం నిర్మిస్తున్నామని, అదేవిధంగా పెరిక కుల పరపతి సంఘం ఆధ్వర్యంలో నాలుగు కోట్ల రుపాయల టర్నోవర్‌తో ఆర్థిక సహాయ కార్యక్రమాలు, పెరిక సంక్షేమ సమితిద్వారా కోటి రుపాయల నిధితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విజయ్‌కుమార్ వివరించారు. అదేవిధంగా 35 అనుబంధ సంఘాల ద్వారా ప్రతీ పెరిక బిడ్డ ఆలానా పాలానా చూసే కార్యక్రమం ప్రారంభించామన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మద్దా లింగయ్య, మాజీ అధ్యక్షుడు శ్రీరామ్ దయానంద్, చింతం సదానందం, అల్లం నాగరాజు, బరుపాటి గోపి, బెడిద వీరన్న, నలివెల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం తెలంగాణ పెరిక కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా అల్లం రాజేష్ వర్మ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గటిక విజయ్ కుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా పెరిక కుల నాయకులు రాజేష్ వర్మను అభినందించారు.

స్థానికేతరులకు పోలింగ్ విధులు

● ర్యాండమైజేషన్ పద్ధతిలో అధికారుల ఎంపిక

● పంచాయతీ ఎన్నికల పరిశీలకులు బాల మాయాదేవి, జిల్లా కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు స్థానికేతరులను పోలింగ్ కేంద్రాల్లో అధికారులుగా కేటాయించినట్లు జిల్లా ఎన్నికల పరిశీలకురాలు బాల మాయాదేవి, కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మొదటి, రెండో విడత పోలింగ్ కేంద్రాలకు కంప్యూటరైజ్డ్ ర్యాండమైజేషన్ పద్ధతిలో పీవో, ఓపీవోల నియామకం చేపట్టారు. ఈ ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకులు బాల మాయాదేవి, కలెక్టర్ సత్యశారద, జిల్లా ఎన్నికల ఖర్చుల పరిశీలకులు సునయన చౌహాన్‌లు అత్యంత నిశితంగా పరిశీలించారు. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న మండలం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధులకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బాల మాయాదేవి మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకత ఉండేలా జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లాలో రెండు విడతల్లో జరగనున్న ఎన్నికలకు మండలాల వారీగా పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు.

పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా ముందస్తుగా రెండు విడతల నిర్వహణకు 20 శాతం రిజర్వ్‌స్టాఫ్‌ను ర్యాండమైజేషన్ ప్రక్రియలో ఎంపిక చేశామన్నారు. మొదటి విడతలో 85 గ్రామ పంచాయతీలు, 731 వార్డు స్థానాలకు, రెండో విడతలో 114 గ్రామ పంచాయతీలు, 984 వార్డు స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీపీవో కల్పన, డీఈవో రంగయ్య నాయుడు, ఆర్డబ్ల్యూఎస్ అధికారి నిర్మల తదితర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విడత	మండలాలు	గ్రామ పంచాయతీలు	వార్డు స్థానాలు	మొత్తం సిబ్బంది	పీవోలు	ఓపీవోలు
మొదటి	పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి	84	731	1,975	877	1,098
రెండవ	గీసుగొండ, దుగ్గొండి, నల్లబెల్లి, సంగెం	114	984	2,568	1,181	1,387



ప్రచారంపై పటిష్ఠ నిఘా

- పరిశీలన కోసం ప్రత్యేక బృందాల కేటాయింపు
- మద్యం, కానుకల పంపిణీపై దృష్టి
- ఎప్పటికప్పుడు వీడియోల చిత్రీకరణ

వర్ధన్నపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మొదటి విడత బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించడంతో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. అయితే ఎన్నికల నిర్వహణపై అధికారులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. కలెక్టర్లు, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రచార ఘట్టాలకు సంబంధించి మండలానికో ప్రత్యేక పరిశీలకుడిని నియమించారు.

అతడి పర్యవేక్షణలో బృందం సభ్యులు ప్రచార తీరు తెన్నులతో పాటు అభ్యర్థులు చేసే ఖర్చుపై దృష్టి పెడుతున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా వీడియోలు చిత్రీకరిస్తున్నారు. ఇందుకోసం మండలానికి ఇద్దరు చొప్పున సూక్ష్మ పరిశీలకులను నియమిస్తున్నారు. ఇప్పటికే 5-10 పంచాయతీలకు ఒక జోనల్ అధికారికి బాధ్యతలు అప్పగించారు. ప్రతీ 200ల మంది ఓటర్లకు ఒక ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారిని నియమిస్తున్నారు. 400 ఓట్ల పైబడిన గ్రామాల్లో ఒక ప్రిసైడింగ్ అధికారితో పాటు ముగ్గురు పోలింగ్ అధికారులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ బూత్ తప్పనిసరిగా ఉంటుంది. మరోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుర్తించిన సమస్యాత్మక కేంద్రాలపైన పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ఉద్యోగులు ప్రచారం జోలికెళ్లొద్దు..

గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాల్సిందే. ఉపాధిహామీ, విద్య, వైద్య ఆరోగ్య శాఖ, ఐకేపీ, ఆరోగ్యశ్రీ, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, సీఆర్పీలు, రిసోర్స్‌పర్సన్‌లు, ప్రభుత్వ శాఖలో ఒప్పంద పద్ధతి న పని చేసే వారందరికీ ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుంది. వీరు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలనేది ఎన్నికల కమిషన్ నిబంధన. వీరు ఓటు హక్కును సాధారణ ఓటరు మాదిరిగా వినియోగించుకోవచ్చు.

ప్రధానంగా దృష్టి పెట్టే అంశాలు..

ప్రచారంలో డబ్బులు, మద్యం పంపిణీపై నిత్యం నిఘా ఉంటుంది. చీరల పంపిణీ, సంఘాలకు నజరానాలను ప్రకటించడం, యువతకు కానుకల పంపిణీపై దృష్టి పెడతారు. ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను గమనిస్తారు. అనుమతి లేకుండా స్పీకర్ల వాడకంపై కన్నేస్తారు. నిర్ణీత సమయానికి ప్రచారాన్ని ఆపకపోతే చర్యలుంటాయి. ఎన్నికల కరపత్రాలు, ముద్రణ, ప్రచురణ, అభ్యర్థుల ఖర్చుపైన దృష్టి సారిస్తారు.

ఊరు-పోరు
VOORU - PORU

డిపాజిట్ దక్కాలంటే..

వర్ధన్నపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారం జనరల్ సర్పంచ్ అభ్యర్థులు అయితే రూ.2వేలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వారైతే రూ.1వేయి, వార్డు సభ్యుల విషయానికొస్తే జనరల్ అభ్యర్థులు రూ.500, ఇతరులు రూ.250 జమ చేయాలి. అయితే వారిలో కొందరు డిపాజిట్లు కోల్పోతారు. అదెలాగంటే.. పోలైన ఓట్లలో 16 శాతానికి పైగా ఓట్లు సాధించిన అభ్యర్థికి డిపాజిట్ దక్కుతుంది. అంటే ఉదాహరణకు ఒక వెయ్యి ఓట్లు పోలైతే ఎవరికైతే 160కి పైగా ఓట్లు పడతాయో వారికి ధరావత్ లభిస్తుంది. ఇంతకన్నా తక్కువ ఓట్లు వస్తే వారు డిపాజిట్ కోల్పోయినట్లు లెక్క. దీని అర్థం వీరి ఓటమి గౌరవ ప్రదమైనది కాదని భావించాలి. వీరికి జమ చేసిన ధరావత్ సొమ్ము తిరిగి ఇవ్వరు. ఈ డబ్బులు ఎన్నికల కమిషన్ ఖాతాల్లోకి వెళ్తాయి. అదే డిపాజిట్ సాధించిన వారికి జమ చేసిన డబ్బులను తిరిగి అందజేస్తారు.



ఏటూరునాగారంలో హోరాహోరీ

సర్పంచ్ పదవి కైవసానికి ప్రధాన పార్టీల వ్యూహాలు



ఏటూరునాగారం గ్రామ పంచాయతీ భవనం

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీలో ఎన్నికల పోరు హోరాహోరీగా సాగనుంది. ఇక్కడ సర్పంచ్ స్థానం మహిళ(జనరల్)కు రిజర్వు కావడంతో పోరు ఆసక్తిగా మారింది. ప్రధాన పార్టీల మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఈ పంచాయతీ ప్రతిష్ఠాత్మకం కావడంతో అన్ని అస్త్రాలను ప్రయోగిస్తున్నారు. సర్పంచ్ పదవికి ముగ్గురు అభ్యర్థులు బరిలో నిలిచారు. గుండ్ల శ్రీలత (కాంగ్రెస్), కాకులమర్రి శ్రీలత (బీఆర్ఎస్), వినుగోలు ధనలక్ష్మి (బీజేపీ) మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ముగ్గురు అభ్యర్థుల భర్తలు ఆయా పార్టీల్లో క్రియాశీలంగా ఉండటంతో పోటీ రసకందాయంగా మారింది. ఇక్కడ ఈ నెల 11వ తేదీన మొదటి విడతలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి.

ఏటూరునాగారం పంచాయతీలో మొత్తం 19 వార్డులుండగా, 11,398 మంది ఓటర్లు నమోదై ఉన్నారు. వీరిలో మహిళలు-6004, పురుషులు-5392, ఇతరులు-2 ఉన్నారు. పోటీలో వున్న ఇద్దరు అభ్యర్థుల భర్తలు రాజకీయంగా బలంగా ఉండడంతో ఎవరు పాగా వేస్తారోనని పలువురు చర్చించుకుంటున్నారు. ఇక వీరిద్దరికీ తామేమీ తక్కువ కాదంటూ జాతీయ పార్టీ అయిన బీజేపీ మద్దతు పలికిన అభ్యర్థి ప్రచారం సాగిస్తున్నారు.

అధికార కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా కసరత్తు చేస్తోంది. మంత్రి సీతక్క స్వయంగా రంగంలోకి దిగి అభివృద్ధి మంత్రాన్ని తెరపైకి తెచ్చి గెలిపించాలని కోరుతున్నారు. బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థిని ఓడించి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని మరొక సారి నిరూపించుకోవాలని చూస్తోంది. ఇదే క్రమంలో బీఆర్ఎస్ పార్టీ సైతం మేజర్ పంచాయతీకి అత్యంత ప్రాధాన్యతను ఇస్తోంది. జిల్లా క్యాడరంతా ఏకతాటిపైకి వచ్చి గెలుపుపై ప్రధానంగా దృష్టి పెట్టింది. సర్పంచుగా గెలిచి జిల్లాలో ఉనికిని చాటేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి సైతం నామినేషన్ కార్యక్రమంలో పాల్గొని గెలుపే లక్ష్యమంటూ ప్రకటించారు. ఈ రెండు పార్టీలకు బీజేపీ తక్కువ కాదని, మేజర్‌లో గెలిచి తీరుతామని బీజేపీ నాయకులు నిరంతరం కృషి చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లది కీలకపాత్ర

ఎన్నికల పరిశీలకురాలు బాల మాయాదేవి

మైక్రో అబ్జర్వర్ల శిక్షణలో మాట్లాడుతున్న బాల మాయాదేవి



వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల (మైక్రో అబ్జర్వర్లు) పాత్ర అత్యంత కీలకమని ఎన్నికల పరిశీలకులు బాల మాయాదేవి, కలెక్టర్ సత్యశారద పేర్కొన్నారు. సోమవారం డీఆర్డీఏ కార్యాలయంలో మైక్రో అబ్జర్వర్లకు ఎన్నికల శిక్షణ తరగతులను వారు సందర్శించి మాట్లాడారు. సాధారణ పరిశీలకులు కూడా మైక్రో అబ్జర్వర్లు అందించే నివేదికల ఆధారంగానే ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తారని పేర్కొన్నారు. పోలింగ్ రోజున సూక్ష్మ పరిశీలకులు తప్పనిసరిగా తగిన జాగ్రత్తలు తీసుకొని పోలింగ్ ప్రక్రియలోని ప్రతీ అంశం నిబంధనల ప్రకారం జరిగేలా పర్యవేక్షించాలన్నారు. ఓట్ల లెక్కింపు, ఉపసర్పంచ్ ఎన్నికల కార్యక్రమాలను ఎలక్షన్ కమిషన్ నిబంధనల ప్రకారమే జరిగేలా చూడాలన్నారు. ఇందు కు సంబంధించిన రిపోర్టులను సకాలంలో సాధారణ పరిశీలకులకు అందించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన సమస్మాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. పోలింగ్ కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో నిబంధనలను అతిక్రమి స్తే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. మూడు విడతల్లో జరిగే ఎన్నికల ప్రక్రియలో పారదర్శకంగా విధులను నిర్వహించి, నివేదికలను జిల్లా పరిశీలకులకు అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, జిల్లా పరిశ్రమశాఖ జనరల్ మేనేజర్ నరసింహామూర్తి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజు, మైక్రో అబ్జర్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఏర్పాట్లపై అధికారులతో ఆర్ఎం సమీక్ష


ములుగు జిల్లా కలెక్టర్‌తో చర్చిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం విజయభాను

హనుమకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర కోసం ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు వరంగల్ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. సోమవారం ములుగు జిల్లా కలెక్టర్ సుధీర్ కేకన్, ములుగు జిల్లా ఎస్పీ రాంనాథ్‌తో సమా వేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎం విజయభాను మాట్లాడుతూ.. మేడారం జాతరకు సంబంధించి ఆర్టీసీ బస్సు సర్వీసుల ఏర్పాట్లపై, సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాల గురించి ఇతర శాఖల నుంచి ఆర్టీసీ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు ఆర్ఎం తెలిపారు.

లబ్ధిదారుల వివరాలు నమోదు చేయాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఎం ఆవాస్ యోజన పథకం లబ్ధిదారుల వివరాలను గడువులోపు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం పైడిపల్లి, దేశాయిపేట, తిమ్మాపూర్, దూపకుంట ప్రాంతాల్లో నిర్మాణంలో ఉన్న రెండు పడకగదుల ఇళ్లను బల్దియా కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇంటి నిర్మాణాల్లో నీటి సరఫరా, విద్యుత్తు వంటి మౌలిక వసతులు సమగ్రంగా ఉండేలా చూడాలన్నారు. పీఎంఏవై పోర్టల్‌లో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వివరాలను కచ్చితమైన పారామీటర్ల ప్రకారం సంబంధిత శాఖలు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో బల్దియా సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ రాజేందర్, ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్, ఆర్డీవో సుమ, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఈఈలు సంతోష్ బాబు, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ ఇళ్ల వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్, బల్దియా కమిషనర్ చహత్

కోలాహలంగా బాక్సింగ్ ఎంపికలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 100 మంది బాక్సర్ల హాజరు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ)ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా స్థాయి అండర్-14 బాలుర బాక్సింగ్ ఎంపిక పోటీలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. సోమవారం హనుమకొండ అశోక జంక్షన్‌లోని డీఎస్ఏ బాక్సింగ్‌హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలను తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (టీజీపేట) రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గోబి సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్రీడల్లో రాణించాలంటే కఠోర సాధనతో పాటు క్రమశిక్షణ, పట్టుదల ఎంతో అవసరమన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి ప్రశాంత్ మాట్లాడుతూ... ఒక్క రోజు పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-14 బాలుర విభాగంలో నిర్వహించిన ఈ ఎంపిక పోటీల్లో సుమారు 100 మంది బాక్సర్లు, 20 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాక్సర్లను డిసెంబరు మూడో వారంలో హనుమకొండలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో (జయశంకర్ భూపాలపల్లి) సీహెచ్. రఘు, యూపీఎస్ హెచ్ఎం శోభారాణి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా మాజీ కార్యదర్శి మంచాల స్వామిచరణ్, బాక్సింగ్ అసోసియేషన్ బాధ్యులు పెద్దమ్మల నర్సింహారాములు, పీఈటీలు పార్థసారథి, శ్రీధర్‌రావు, కోచ్ ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.


బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

నర్సంపేటలో వైభవంగా పల్లివేట

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు, బీజేపీ నాయకులు

నర్సంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో అయ్యప్ప పల్లివేట వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయంలో సోమవారం క్షేత్రబలి, పల్లివేట కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయసేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరి కొండ మాధవశంకర్, ఆలయ అధ్యక్షుడు పైసా సురేశ్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన తాంత్రికవేత్త శంకరన్ నంబూద్రి ఘనంగా పూజలు నిర్వహించారు.

పల్లివేట దాత గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి తల్లి చనిపోయి సంవత్సరీకం పూర్తికాక పోవడంతో ఆయన సూచన మేరకు బీజేపీ నాయకుడు అచ్చ దయాకర్ దంపతులచే ఆలయం ఆవరణలో ఉత్సవబలి, క్షేత్రబలి, బలిపీఠాలకు వివిధ రకాల నైవేద్య పూజలను నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాన్ని ఆలయం నుంచి మొదట పల్లకిలో ఆలయ చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, మాదారపు చంద్రశేఖరం, దొడ్డ రవీందర్, ఆలయ చైర్మన్ పైసా సురేశ్ కమిటీ సభ్యులు మోసుకువచ్చారు. అనంతరం అచ్చ దయాకర్ నెత్తిన స్వామి విగ్రహాన్ని తీసుకొచ్చి అలంకరించిన ట్రాక్టర్‌లో ప్రతిష్ఠించారు. డప్పుచప్పుళ్లు, మహిళల కోలాటాల నడుమ స్వామి శోభాయాత్ర ఊరేగింపు ఆలయం నుంచి మునిసిపల్ కార్యాలయం ఆవరణ వరకు నిర్వహించారు.

ఆకట్టుకున్న ఉత్సవం

నర్సంపేట పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పుంగావనం (కుటీరం)లో సోమవారం నిర్వహించిన పల్లివేట వేడుకలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. అచ్చ దయాకర్ దంపతులచే అభిషేక పూజలతో పాటు పుష్పాభిషేక పూజలు చేసిన అనంతరం అష్టోత్తర పూజలు చేసి హారతి ఇవ్వడంతో పల్లివేట ఉత్సవం ముగిసింది. అనంతరం అయ్యప్ప ఆలయంలో మాలధారులకు, భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


అయ్యప్పకు పూజలు చేస్తున్న తాంత్రికవేత్త నంబూద్రి

నేటి నుంచి నోబెల్ ప్రైజ్ డే సంబరాలు

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపునకు దోహదం



కేయూ క్యాంపస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పరిశోధన, సైన్స్ సబ్జెక్టులపై ఆసక్తి పెంచేందుకు కాకతీయ వర్సిటీలోని విద్యార్థులకు కేయూ స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి ఆధ్వర్యంలో వివిధ విభాగాల సహకారంతో రెండు రోజుల పాటు నోబెల్ ప్రైజ్ డే ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. కేయూ స్వర్ణోత్సవాల సందర్భంగా డిసెంబరు 9, 10 తేదీల్లో ఉత్సవాలను ఏర్పాటు చేశారు.

విభాగాల వారీగా..

9న ఉదయం రసాయనశాస్త్రం విద్యార్థులకు శాస్త్రం, సమాజాన్ని మార్చిన నోబెల్ రసాయన ఆవిష్కరణ, అనే అంశంపై, అలాగే భౌతిక శాస్త్రం విద్యార్థులకు నోబెల్ భౌతిక ఆవిష్కరణలు ఆధునిక ప్రపంచాన్ని ఎలా ఆకృతీకరించాయి. అనే అంశంపై అలాగే లైఫ్ సైన్స్, ఫార్మసీ విద్యార్థులకు నోబెల్ ఆవిష్కరణలు మానవ ఆరోగ్యానికి ఎలా ఉపయోపడుతాయి. అనే అంశంపై, ఆర్థిక శాస్త్రం విద్యార్థులకు నోబెల్ ఆర్థిక శాస్త్ర విజేతలు సమాజాలను ఎలా మార్చారు. అనే అంశంపై ఇంగ్లిష్ విభాగం విద్యార్థులకు సాహిత్యంలో 'నోబెల్ విజేతలు- ప్రపంచాన్ని మార్చిన స్వరాలు' అనే అంశంపై పోస్టర్ ప్రజేంటేషన్, వక్తృత్వ పోటీలు జరుగుతాయి.

రేపు సెమినార్లు

డిసెంబరు 10న నోబెల్ బహుమతి సాధించిన పరిశోధన అంశంపై విషయ నిపుణులతో సెమినార్లు ఏర్పాటు చేశారు. శాతవాహన వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఇక్బాల్ అలీ, బిట్స్ పిలానీ నుంచి ప్రొఫెసర్ తనై నాగ్, తెలంగాణ వర్సిటీ ప్రొఫెసర్ చంద్రశేఖర్, నిట్ వరంగల్ ప్రొఫెసర్ రాజా విశ్వనాథ్‌లు హాజరై 2025లో నోబుల్ బహుమతి పొందిన వివిధ అంశాలపై ప్రసంగిస్తారు. 10న కేయూ సెనెట్ హాల్‌లో కేయూ వీసీ, రిజిస్ట్రార్లు నోబెల్ ప్రైజ్ డే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేయనున్నారు.

వివిధ అంశాలపై పోటీలు

రెండు రోజుల పాటు జరిగే నోబెల్ ప్రైజ్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా మొదటిరోజు (మంగళవా రం) ఉదయం 10 గంటల నుంచి వివిధ విభాగాల్లో ఆయా విభాగాల విద్యార్థులకు పోస్టర్ ప్రజేంటేషన్, వక్తృత్వ పోటీలను నిర్వహించనున్నారు. పోస్టర్ ప్రజేంటేషన్, వ్యకృత్వ పోటీల్లో పాల్గొనేందుకు అన్ని విభాగాల నుంచి విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

బాలికల భద్రతపై

కేంద్రం ఏం చేస్తోంది ?

లోక్‌సభలో ఎంపీ కడియం కావ్య


లోక్‌సభలో మాట్లాడుతున్న ఎంపీ కావ్య

హనుమకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బాలికల భద్రత విషయంలో ఏం చేస్తోందంటూ వరంగల్ ఎంపీ కడియం కావ్య లోక్‌సభలో ధ్వజమెత్తారు. తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో బీఈడీ చదువుతున్న ఒడిశాకు చెందిన బీఈడీ దళిత విద్యార్థినిని వేధింపులకు గురిచేయడంతో ఆమె చదువు మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఎంపీ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఈ విషయాన్ని ప్రశ్నోత్తరాల సమయంలో ఎంపీ లేవనెత్తారు. బేటీ పడావో అన్న నినాదం పాఠశాల గోడలకే పరిమితమా ? విద్యాలయాల్లో సమస్యలు ఎదుర్కొంటున్న యువతులకు రక్షణ ఎక్కడా? అని ప్రశ్నించారు. విద్యా సంస్థల్లో మహిళల భద్రతను కాపాడే వ్యవస్థలు ఎంత వరకు పని చేస్తున్నాయో తెలియజేయాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్ వినియోగం విచ్చలవిడిగా పెరుగుతోందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం దాటవేసే ప్రయత్నం చేశారు. దీంతో కావ్యతో పాటు పలువురు జవాబు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సభలో నిరసన వ్యక్తం చేశారు. దళిత మహిళా స్కాలర్‌పై జరిగిన ఘటనకు సంబంధించి ప్రభుత్వం స్పందించాలని, మహిళా విద్యార్థుల భద్ర తకు బలమైన వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ఎంపీ కోరారు.

- లంచగొండులపై యుద్ధం చేస్తున్న సంస్థ
- 20 సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు
- ప్రజలకు వినూత్నంగా అవగాహన
- నేడు అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం

అవినీతిపై పోరాట జ్వాల

పోచమ్మమైదాన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అవినీతిపై 20 సంవత్సరాలుగా అలుపెరగని పోరాటం చేస్తోంది 'జ్వాల' అనే అవినీతి వ్యతిరేక సంస్థ. లంచగొండి అధికారుల భరతం పడుతూ.. ప్రభుత్వ సంస్థల్లో అవినీతిని నిర్మూలించేందుకు తీవ్రంగా కృషి చేస్తోంది. ప్రజలకు అవగాహన కల్పించడమే కాకుండా అవినీతి అధికారులను పట్టించిన వారికి అండగా నిలబడుతోంది.

వరంగల్ జిల్లా ఆరెపల్లి ప్రాంతానికి చెందిన సుంకరి ప్రశాంత్ ఉమ్మడి జిల్లా కేంద్రంగా జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ ఏర్పాటు చేసి వినూత్న కార్యక్రమాలతో పోరాటం సాగిస్తున్నారు. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం సందర్భంగా 2004 డిసెంబరు 9న జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ ఏర్పాటు చేసి అవినీతిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. లంచగొండి అధికారులను పట్టించిన వారికి నగదు బహుమతులు, ప్రోత్సహకాలు అందిస్తూ.... ఉత్తమ అధికారులను సన్మానిస్తూ అవినీతి నిరోధకానికి కృషి చేస్తున్నారు. లంచం డిమాండ్ చేసే వారిది ఎంత తప్పో... ఇవ్వాలని చూసేవారిది కూడా అంతే తప్పని చెబుతూ ఏటా అవినీతి నిరోధక దినోత్సవం రోజున శవయాత్రలు, భిక్షాటనలు చేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. 'అవినీతి పరుడికి సన్మాన యాత్ర' అంటూ అనేక వినూత్న కార్యక్రమాలు చేస్తున్నారు. అంతేకాక లంచం తీసుకోబోమని ప్రతిజ్ఞ చేసిన ఉత్తమ ప్రభుత్వ అధికారులను గుర్రాలపై ఊరేగించి అభినందిస్తున్నారు.


అవినీతి శవయాత్ర నిర్వహిస్తున్న జ్వాల సంస్థ నిర్వాహకులు (ఫైల్)

నేడు బిచ్చగాళ్లతో ర్యాలీ

అవినీతి నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ ఆధ్వర్యంలో బిచ్చగాళ్లతో ర్యాలీ నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ తెలిపారు. 'అవినీతి పరులకన్నా... అడుక్కు తినడం మిన్న' అనే నినాదంతో బిచ్చగాళ్లతో ర్యాలీ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10:30 గంటలకు హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు.

ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి



లంచగొండి ప్రభుత్వ అధికారులపై ఎన్ని దాడులు జరిగినప్పటికీ కొందరి తీరు మారడం లేదు. ప్రతీ పనికో రేటు చొప్పున లంచాలు తీసుకుంటున్నారు. అవినీతి నిరోధక దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి. అప్పుడే ప్రజలలో పూర్తి స్థాయిలో అవగాహన కల్గుతుంది. ప్రభుత్వ కార్యాలయాలలో సైతం అవినీతి తగ్గుముఖం పడుతుంది. లంచం అడిగిన వారి పై ఏసీబీకి ఫిర్యాదు చేయాల్సిందే.

- సుంకరి ప్రశాంత్, జ్వాల వ్యవస్థాపక అధ్యక్షుడు

నజరానా పొందండి..

లంచగొండి అధికారుల భరతం పట్టేందుకు జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ నిర్వాహకులు 2017 నుంచి 'ఏసీబీకి పట్టించండి... నజరానా పొందండి' అనే నినాదంతో ముందుకు సాగుతున్నారు. లంచం తీసుకునే గ్రామస్థాయి అధికారిని పట్టించినందుకు రూ.5 వేలు, మండల స్థాయిలో రూ.10 వేలు, జిల్లాస్థాయిలో రూ.15 వేల నగదు బహుమతులు అందజేసి ప్రోత్సహిస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ స్థాయిల అధికారులను పట్టించిన సుమారు 30 మందికి పైగా నగదు బహుమతులు అందజేశారు.

మడికొండలో ట్రాఫిక్ జామ్

రోడ్డుపై నిలిచిపోయిన లారీ - ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు

మడికొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని ధర్మసాగర్ రోడ్డు మలుపు వద్ద సోమవారం పెద్ద లారీ మరమ్మతుకు గురై రోడ్డు మధ్యలో ఆగిపోయింది. దీంతో అసలే ఇరుకు రోడ్డు అందులో లారీ ఆగిపోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గంట పాటు ట్రాఫిక్ జామయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించి వాహనాలు సాఫీగా వెళ్లే విధంగా చూశారు. ఆర్ అండ్ బీ శాఖ అధికారులు వెంటనే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



లారీ రోడ్డుపై నిలిచి పోవడంతో ఇబ్బంది పడుతున్న వాహనదారులు

2 సర్పంచ్, 28 వార్డు సభ్యులు ఏకగ్రీవం

- హసన్‌పర్తి మండల పరిధిలో కొత్తపల్లి మినహా అన్ని జీపీల్లో తప్పని ఎన్నికలు
- 13 సర్పంచ్, 110 వార్డు మెంబర్ స్థానాలకు పోటీ

హసన్‌పర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని 15 పంచాయతీ గ్రామాల్లో 15 సర్పంచ్‌లకు గాను 2 సర్పంచ్, 138 వార్డు మెంబర్లకు గాను 28 మంది వార్డు మెంబర్లు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి, ఎంపీడీవో సుమనవాణి తెలిపారు. ఇంకా 13 సర్పంచ్, 110 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం వరకు మొత్తం 15 సర్పంచ్ స్థానాలకు గాను 52 మంది, 110 వార్డు మెంబర్ స్థానాలకు గాను 310 మంది బరిలో ఉన్నట్లు తెలిపారు. వీటిలో ఒకే ఒక్క కొత్తపల్లి పంచాయతీ గ్రామంలో సర్పంచ్ అంబాల ప్రభాకర్‌తో పాటు మొత్తం 6 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా అర్వపల్లి సర్పంచ్ దండ్రి సాంబయ్య ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో పంచాయతీ గ్రామాల వారిగా బరిలో



ఉన్న సభ్యుల వివరాలను వెల్లడించారు. అనంతసాగర్‌లో సర్పంచ్-6, 9 వార్డులకు (10వ వార్డు మినహా) 22 మంది, జయగిరిలో సర్పంచ్-2, 10 వార్డులకు 28 మంది, మడిపల్లిలో సర్పంచ్-4, 10 వార్డులకు 24 మంది, సీతంపేటలో సర్పంచ్-6, 8 వార్డులకు (3, 4వ వార్డు మినహా) 30 మంది, పెంబర్తిలో సర్పంచ్-3, 10 వార్డులకు 22 మంది, గంటూర్‌పల్లిలో సర్పంచ్-4, 2 వార్డులకు (1, 2, 4, 5, 6, 7, 8వ వార్డులు మినహా) 10 మంది నాగారంలో సర్పంచ్-3, 11 వార్డులకు (3వ వార్డు మినహా) 36 మంది, సీతనాగారంలో సర్పంచ్-2, 5 వార్డులకు (3, 5, 7వ వార్డులు మినహా) 13 మంది, సూదన్‌పల్లిలో సర్పంచ్-6, 7 వార్డులకు (2వ వార్డు మినహా) 18 మంది, సిద్దాపూర్‌లో సర్పంచ్-2, 7 వార్డులకు (2, 4, 8వ వార్డులు మినహా) 17 మంది, హెచ్‌సీఎస్ తండాలో సర్పంచ్-2, 3 వార్డులకు (2, 3, 4, 5, 7వ వార్డులు మినహా) 11 మంది, భైరాన్‌పల్లిలో సర్పంచ్-4, 10 వార్డులకు 25 మంది, మల్లారెడ్డిపల్లిలో సర్పంచ్-6, 10 వార్డులకు 32 మంది, అర్వపల్లిలో సర్పంచ్ ఏకగ్రీవం కాగా 8 వార్డులకు 16 మంది బరిలో ఉన్నట్లు తెలిపారు. అలాగే కొత్తపల్లిలో సర్పంచ్‌తో సహా 6 వార్డులకు ఆరుగురు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. మొత్తం మీద 15 పంచాయతీ గ్రామాల్లో 13 సర్పంచ్ స్థానాలకు 14 పంచాయతీ గ్రామాల్లో 110 వార్డు స్థానాలకు పోటీ అనివార్యమైనట్లు తెలిపారు. ఎన్నికల తరువాత ఉపసర్పంచ్ అభ్యర్థుల ఎంపిక కీలకంగా మారనుందని ఎన్నికల అధికారులు భావిస్తున్నారు.



ఆస్పత్రిలో ఓపీ పేషెంట్లతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

హనుమకొండ డీఎంహెచ్‌వో ఎ.అప్పయ్య

వరంగల్ మెడికల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సాధారణ ప్రసవాల వల్ల లాభాలు, అలాగే సిజేరియన్ ఆపరేషన్‌తో తల్లికి, బిడ్డకు కలిగే నష్టాల గురించి గర్భిణులకు అవగాహన కల్పించాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య సూచించారు. సోమవారం హనుమకొండలోని దేవిక మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని డీఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీ సెక్షన్ ఆడిట్ నిర్వహించి, పలు రికార్డులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే సూచించిన కారణాలతో సిజేరియన్ నిర్వహించాలన్నారు. ముహూర్తపు ప్రసవాలను ప్రోత్సహించరాదన్నారు. ఎట్టి పరిస్థితుల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదని, అబార్షన్లు ఎంపీటీ చట్టం నిబంధనలకు లోబడి మాత్రమే చేయాలని, లేకుంటే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాతా శిశు సంక్షేమం ప్రోగ్రాం అధికారి డాక్టర్ రుబీనా, స్టాటిస్టికల్ అధికారి జి.ప్రసన్న కుమార్, హెచ్ఈవో రాజేశ్వర్‌రెడ్డి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజమే లక్ష్యం : సీపీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అవినీతి రహిత సమాజాన్ని ఏర్పాటు చేయడమే అందరి లక్ష్యంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. అవినీతి వారోత్సవాలను పురస్కరించుకొని ఏసీబీ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండ అశోక జంక్షన్‌లో నిర్వహించిన అవగాహన ర్యాలీని వరంగల్ పోలీస్ కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అవినీతిని నిర్మూలించడం ద్వారా దేశాభివృద్ధి జరుగుతుందన్నారు. భవిష్యత్‌లో అవినీతి నిర్మూలనలో విద్యార్థుల పాత్ర చాల కీలకమైందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య, ఇన్‌స్పెక్టర్ సట్ల రాజు, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేయాలి

సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత



సుబేదారిలో పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న డీసీపీ కవిత

హనుమకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నేరాల నియంత్రణకు పోలీసులు కృషి చేయాలని వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత సూచించారు. సోమవారం హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్‌ను ఏసీపీ నర్సింహారావుతో కలిసి డీసీపీ సందర్శించారు. డీసీపీ కవితకు పోలీస్ సిబ్బంది గౌరవ వందనం తెలిపారు. ఈ సందర్భంగా సుబేదారి సీఐ మేకల రంజిత్‌కుమార్‌ను పోలీస్ సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో సిబ్బంది వ్యవహరించే తీరు, వేగంగా స్పందించే విధానం గురించి సిబ్బందికి వివరించారు. ప్రత్యేకంగా మహిళలకు సంబంధించి పిల్లల ఫిర్యాదులపై సిబ్బందితో మాట్లాడారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, సైబర్ మోసాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు విస్తరించాలని సీఐకి ఆదేశించారు.

రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో మేయర్



కార్యక్రమంలో మంత్రి సీతక్క, మేయర్ సుధారాణి తదితరులు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఫ్యూచర్ సిటీలో భాగంగా రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా కుందూరులో రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల పాటు 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025' కార్యక్రమం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో పాటు వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి పాల్గొన్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ గ్రామీణాభివృద్ధి, ఇన్నోవేషన్, పరిశ్రమలు, స్టార్టప్స్ వంటి అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

కేసీఆర్‌పై పగతో కాంగ్రెస్ కంటి వెలుగు ఆపింది

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై పగతో కంటి వెలుగు పథకాన్ని ఆపిందని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఉచితంగా కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు మోసం జరిగిందన్నారు. కూల్చివేతలు, ఎగవేతలు, మాటతప్పడాలు తప్ప తెలంగాణ ప్రజలకు చేసిందేమిలేదన్నారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్ సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, జోరిక రమేష్, వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజనికాంత్, నరెడ్ల శ్రీధర్, నార్లగిరి రమేష్, నయీమోద్దీన్, బుద్దె వెంకన్న, తక్కళ్లపల్లి వినీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వినయ్‌భాస్కర్ తదితరులు

'దివ్యాంగుల హక్కులను కాపాడాలి'

కాజీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మానసిక దివ్యాంగుల సేవ దైవ సేవతో సమానమని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కరుకాల అనితారెడ్డి అన్నారు. సోమవారం మానసిక దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కాజీ పేటలోని బన్ను మనోవికాస కేంద్రంలో నిర్వహించిన వేడుకలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సంస్థ నిర్వాహకులు కిరణ్‌కుమారి అధ్యక్షత వహించారు. మనోవికాస కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల హక్కుల కోసం అవగాహన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లల పాటలు, డ్యాన్స్‌లు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా డాక్టర్ కె. అనితారెడ్డి మాట్లాడుతూ మానసిక దివ్యాంగుల హక్కులను కాపాడడం మన అందరి బాధ్యత అని అన్నారు. పిల్లలకు ఎంతో ప్రేమ , ఓర్పుతో విద్య నేర్పుతూ మానసిక పరిపక్వత వచ్చేలా కృషి చేస్తున్న బన్ను సంస్థను అనితారెడ్డి అభినందించారు.పిల్లలకు మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు కిరణ్‌కుమారి, రాము, టీచర్లు, దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు పతకాలు

మడికొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీలలో మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాలకు చెందిన విద్యార్థినులు పాల్గొని బంగారు పతకాలు సాధించారని సోమవారం ప్రిన్సిపల్ దాసరి ఉమామహేశ్వరి తెలిపారు. 78 కిలోల విభాగంలో విద్యార్థినులు కె. కృప, కె. రేవతి బంగారు పతకాలు కైవసం చేసుకుని డిసెంబరు 11నుంచి 14వ తేదీ వరకు మణిపూర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి జూడో పోటీలకు ఎంపియ్యారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు పేరు తీసుకువస్తున్న క్రీడాకారులను, కోచ్ నాగరాజు, పీడీ పద్మ, పీఈటి జె. సరితను ప్రిన్సిపల్ ఉమామహేశ్వరి అభినందించారు.

వాహనాల తనిఖీ

కాజీపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట డీజిల్‌కాలనీలో సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేశారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాలు ఆపి తనిఖీలు చేశారు. వాహణాలకు సంబంధించి పత్రాలను పరిశీలించారు. అనుమానాస్పదంగా ఉన్న వారిని అదుపులోకి తీసుకుని వారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీపీ ఆదేశాలతో ఈ తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో మద్యం, డబ్బు సరఫరాను అరికడట్టమే కాకుండా, చోరీలను అరికట్టేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకన్న, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉన్నారు.

టేబుల్ టెన్నిస్ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 9 నుంచి నవంబరు 10 వరకు విశాఖపట్నంలోని గీతం యూనివర్సిటీలో నిర్వహించే 2025-26 సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ కాకతీయ యూనివర్సిటీ మహిళల టేబుల్ టేన్నిస్ పోటీలకు జట్టు ఎంపికైంది. ఈ మేరకు సోమవారం కేయూ స్పోర్ట్స్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య క్రీడాకారుల వివరాలను వెల్లడించారు. ఎంపికైన వారిలో ఎం. శ్వేత, (కేయూ వ్యాయమ విద్యా కళాశాల, కేయూ క్యాంపస్ వరంగల్), పి. వర్షిత, (వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల, కొత్తగూడెం), ఎం.వర్షిత, పి.శర్వాని (కిట్స్ వరంగల్), ఎం.నందిని (టీజీటీబ్ల్యూఆర్‌డీసీ, వుమెన్స్ వరంగల్ వెస్ట్)లు ఎంపికైనట్లు వెంకయ్య వెల్లడించారు. జట్టుకు కోచ్, మేనేజర్‌గా జనగామ ఏబీవీ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ టి. కల్యాణి వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్యలు అభినందించారు.

డ్రెయినేజీల తర్వాతే రోడ్ల నిర్మాణం చేపట్టాలి

జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరంలో డ్రైన్‌ల నిర్మాణం తర్వాతనే రోడ్ల నిర్మాణం చేపట్టాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులకు సూచించారు. సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో ఇంజ నీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. ఇటీవల నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో 100 నుంచి 120 కోట్ల పనులకు టెండర్ పిలవాలని నిర్ణయించడం జరిగిందని పనులు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సీపీ రవీందర్, ఈఈ సంతోష్‌బాబు, మహేందర్, మాధవీలత, ఏసీపీలు ఖలీల్, ప్రశాంత, రజిత, ఇర్షాద్ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్‌రావు

వరంగల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి వాహనాలు నడపటం ప్రమాదకరమని, తద్వారా జరిగే రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలు పోయి కుటుంబాలు రోడ్డున పడుతాయని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాయల ప్రభాకర్ రావు అన్నారు. ట్రైసిటీ పరిధిలో నిర్వ హించిన డ్రెంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ వాహనదారులకు సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆవరణంలోని ట్రాఫిక్ శిక్షణ కేం ద్రంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ ఆర్. ప్రభాకర్‌రావు మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇచ్చే యజ మానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతీ ద్విచక్రవాహనాదారుడు హెల్మెట్ ధరించి, లైసెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలను దగ్గరి ఉంచుకోవాలన్నారు. డ్రైవింగ్ చేసే సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ బొలగాని శ్రీనువాస్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జాతీయ మానవ హక్కుల సదస్సు

కేయూ క్యాంపస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు జాతీయ మానవ హక్కుల సమైఖ్య ఆర్గనైజింగ్ కమిటీ బాధ్యులు పి. మహిపాల్ సోమవారం తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ ప్రిన్సిపాల్ జడ్జి కె.పట్టాభిరామారావు, సీపీ సన్‌ప్రీత్‌సింగ్, రిటైర్డు జడ్జి చంద్రకుమార్, ఆర్టీఐ మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, పాశం యాదగిరి, వి. ప్రకాశ్, వీరేంద్ర యాదవ్, అలిసేని శ్రీనివాస్‌రావు, టి.సుబ్బారావు, నక్క గంగారం, మంగినపల్లి సదాశివుడు, టి. సన త్‌కుమార్, చందా మల్లయ్య, డాక్టర్ పి.రోహిణిలు హాజరై మాట్లాడుతారని తెలిపారు.

కేయూ హాస్టల్‌లో వసతి కల్పించాలి



రిజిస్ట్రార్ రామచంద్రానికి వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేయూలో ఎస్ఎఫ్‌సీ విద్యార్థుల నుంచి హాస్టల్ డిపాజిట్ డబ్బులు తీసుకుని హాస్టల్ వసతి కల్పించడం లేదని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం రిజిస్ట్రార్ రామచంద్రంను కలిసి విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడారు. కేయూ ఎస్ఎఫ్‌సీ విద్యార్థులు వర్సిటీకి మెస్ డిపాజిట్ డబ్బులు చెల్లించి నెల రోజుల నుంచి వర్సిటీ బయట ఉంటున్నారని వాపోయారు. ఒక్కొక్కరూ రూ.12 వేలు చెల్లించారని అన్నారు. దీనిపై గతం లోనూ వీసీకి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించాలని లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నేతలు మల్లే శ్, రాహుల్, సూరజ్, సాయి, నాగరాజ్, సందీప్, రాజ్‌కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ సాధించిన చంద్రమౌళికి సన్మానం

హసన్‌పర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో ట్రిపుల్‌ఈ విభాగానికి చెందిన డాక్టర్ అడుప చంద్రమౌళిని సోమవారం తోటి ఉద్యోగులు సన్మానించారు. చంద్రమౌళి చెన్నైలోని సత్యభామ వర్సిటీలో ప్రొఫెసర్ శివచిదంబరనాథన్ పర్యవేక్షణలో 'ఎనౌన్స్‌డ్ ట్రాకింగ్ ఆఫ్ ది మాగ్జిమమ్ పవర్ ఫ్రం రెనెవెబుల్ ఎనర్జి ఫ్రేమ్‌వర్క్స్' అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. డాక్టరేట్ పొందిన చంద్రమౌళిని పలువురు తోటి ఉద్యోగులు, టెక్నికల్ నాన్‌టీచింగ్ ఉద్యోగులు సన్మానించి అభినందించారు.

జాతీయ స్థాయి పోటీలకు షైన్ విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

రాంనగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి నృత్యపోటీలకు రాంనగర్‌లోని షైన్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు కార్యక్రమ నిర్వాహకులు కైలాష్ యాదవ్, కంచు శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 7న ఎల్‌బీ కళాశాలలో ఎన్ఎస్‌పీవో ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ ఎఫైర్స్ అండ్ స్పోర్ట్స్ నుంచి జిల్లా కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. ఇందులో జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో హస్విత్‌రాజ్, సౌనాక్షి, అక్షిత, హిత శ్రీ, సహస్ర, నిత్యశ్రీలు, సబ్ జూనియర్ మహిళ విభాగంలో శాన్విక, సుహీర, అనన్య, సాన్విక విజేతలు నిలవగా పాశ్చాత్య నృత్య విభాగంలో ఎ. ఆకాశ్ ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ మూగల కుమార్, ప్రిన్సిపాల్ ప్రగతిరెడ్డి అభినందించారు.

కాకతీయ వర్సిటీలో న్యాయ విద్యార్థుల ధర్నా

- హాస్టల్ వసతి కల్పించాలని బైఠాయింపు



కేయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయించిన విద్యార్థులు

కేయూ క్యాంపస్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేయూలో న్యాయశాస్త్ర విభాగం 5 ఏళ్ల కోర్సుల విద్యార్థులు తమకు హాస్టల్ వసతి కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిరసనకు దిగారు. కేయూ మొదటి గేటు నుంచి వర్సిటీ పరిపాలన భవనం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా తమకు హాస్టల్ వసతి కల్పించాలని కోరుతున్నప్పటికీ వర్సిటీ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తమకు హాస్టల్ వసతి కల్పించకుంటే వర్సిటీ పరిపాలన భవనంలోని వీసీ చాంబర్‌లోనే బస చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల నిరసన విషయం తెలుసుకున్న హాస్టల్ డైరెక్టర్ విద్యార్థుల వద్దకు వచ్చి నచ్చజెప్పారు. డైరెక్టర్ హామీలను విద్యార్థులు పట్టించుకోకుండా అక్కడే బైఠాయించారు. తమకు హాస్టల్ ఇచ్చే వరకు కదిలేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ లా కాలేజ్ స్టూడెంట్ స్టాలిన్, రంజిత్‌కుమార్, సందీప్, అరుణ్, రాకేశ్‌రెడ్డి, శ్రీను, ఆదిత్య, సంధ్య, రోహిత్, ప్రదీప్, శివాజీ, యాకూబ్, ప్రవళిక, సింధూ, దిశ, రణధీర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేయిస్తంభాల గుడిలో సోమవారం సంకష్టహర చతుర్థిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్తిష్ట గణపతికి పంచామృతాభిషేకం, సుంగధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. సహస్ర నామార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉపేంద్రశర్మ క్షీరాన్న నైవేద్యం గణపతికి సమర్పించి పూజలు నిర్వహించారు. శివుడు, త్రిపురసూర సంహారానికి ముందు ఈ ంకష్టహర చతుర్థి వ్రతాన్ని ఆచరించి విజయం సాధించారని, పాండవులు రాజసూయ యాగం చేసి గొప్ప వైభవాన్ని పొందే జూదం ఆడటానికి వెళ్లే ముందు గణపతి వ్రతాన్ని చేయకపోవడం వల్ల సర్వం కోల్పోయారని గంగు ఉపేంద్రశర్మ వ్యాఖ్యానించారు. ఈ వ్రతం ఆచరించడం వల్ల భక్తులు తమ కోరికలు నెరవేరుతాయన్న విశ్వాసంతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఈవో అనిల్ కుమార్, గంగు మణికంఠశర్మ, ప్రణవ్, శ్రవణ్ కుమార్‌లు వైదిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ సమీప బంధువులు వేడుకల్లో పాల్గొన్నారు.

మెస్సీ మేనియా..

4 రోజుల్లో.. హైదరాబాద్‌కు



సుదీర్ఘ కాలం తర్వాత సాకర్ స్టార్ మెస్సీ భారత్ రానుండడంతో.. దేశాన్ని ఫుట్‌బాల్ ఫీవర్ ఆవహించింది. మూడు రోజుల పర్యటనలో భాగంగా నాలుగు ప్రముఖ నగరాల్లో అర్జెంటీనా దిగ్గజం ఫ్యాన్స్‌కు కనువిందు చేయనున్నాడు. ముఖ్యంగా గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్ ఆటగాడి టూర్‌లో ఈసారి హైదరాబాద్ భాగం కావడంతో భాగ్యనగరంలో ముందుగానే సందడి వాతావరణం నెలకొంది.

అర్జెంటీనా సాకర్ స్టార్ లియోనెల్ మెస్సీ భారత పర్యటనకు రానుండడంతో సాకర్ ఫ్యాన్స్ జోష్ పెరిగింది. ఎప్పుడెప్పుడు తమ ఆరాధ్య ఆటగాడిని చూస్తామా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. మూడు రోజుల టూర్‌లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి కోల్‌కతాకు చేరుకోనున్నాడు. శనివారం ఉదయం కోల్‌కతాలో జరిగే కార్యక్రమం తర్వాత.. సాయంత్రం ఉప్పల్‌లో జరిగే ఫ్రెండ్లీ మ్యాచ్‌కు లియోనెల్ హాజరుకానున్నాడు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా మెస్సీతో కలసి ఫుట్‌బాల్ ఆడనుండడంతో ఒక్కసారిగా హైప్ పెరిగింది. హైదరాబాద్ తర్వాత ముంబై, ఢిల్లీలకు మెస్సీ వెళ్లనున్నాడు.

అప్పుడలా..



2011లో..

మెస్సీ భారత్‌లో పర్యటించడం ఇది రెండో సారి. 2011లో కోల్‌కతాలో వెనిజులాతో జరిగిన అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్‌లో మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా జట్టు పాల్గొంది. ఈ పోరులో అర్జెంటీనా 1-0తో వెనిజులాపై గెలిచింది. సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు 70వేల మంది తరలివచ్చారు.

షారుక్, గంగూలీలతో..

మెస్సీ పర్యటన కోల్‌కతా నుంచి ఆరంభం కానుంది. ఉదయం 10.30 నుంచి సుమారు మూడు గంటలు మెస్సీ ఇక్కడ ఉండనున్నాడు. మాజీ క్రికెటర్ సౌరవ్ గంగూలీ, బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ సాల్ట్‌లేక్ స్టేడియంలో మెస్సీతో కలసి వేదికను పంచుకోనున్నారు. ఇక్కడ చిన్నారులతో మెస్సీ ఫుట్‌బాల్ ప్రాక్టీస్‌లోనూ పాల్గొననున్నాడు.

విశ్వకప్‌నకు ముందు వైదొలగనున్న జియోస్టార్!

కొత్త స్పాన్సర్ వేటలో ఐసీసీ

దుబాయ్: మరో రెండు నెలల్లో ప్రతిష్ఠాత్మక పురుషుల టీ20 వరల్డ్ కప్ జరగనుండగా..ఐసీసీకి పెద్ద చిక్కొచ్చి పడింది. రిలయన్స్ నియంత్రణలోని జియో హాట్‌స్టార్ ఐసీసీ అధికారిక ప్రసార హక్కుల ఒప్పందం నుంచి వైదొలగాలని నిర్ణయించుకుందట! ఈ విషయాన్ని ఐసీసీకి జియో తెలిపినట్టు సమాచారం. నాలుగు సంవత్సరాల ఒప్పందంలో ఇంకా రెండేళ్లు మిగిలి ఉన్నా జియోస్టార్ తప్పుకోనుంది. భారీగా నష్టాలు వస్తుండడమే జియో నిర్ణయానికి కారణంగా తెలుస్తోంది. 2024-27 సంవత్సరాల ప్రసార హక్కుల కోసం 3 బిలియన్ డాలర్ల (నాటి ధర రూ. 23,987 వేల కోట్లు)తో ఐసీసీ.. జియో హాట్‌స్టార్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. జియోస్టార్ నోటీసు నేపథ్యంలో 2026-29 సంవత్సరాలకుగాను భారత ప్రసార హక్కుల తాజా అమ్మకానికి ఐసీసీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ ప్రసార హక్కుల విలువ రూ.21,611 కోట్లుగా పేర్కొంది. కొత్త హక్కులకు సంబంధించి సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ సంస్థలను ఐసీసీ సంప్రదించినట్టు సమాచారం. అయితే హక్కుల విలువ ఎక్కువగా ఉండడంతో ఆ సంస్థలేవీ ఆసక్తి చూపనట్టు తెలిసింది. భారత్-శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచ కప్ వచ్చే ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరగనుంది. మెగా టోర్నీ షెడ్యూల్‌ను ఐసీసీ ఇప్పటికే ప్రకటించింది.

దటీజ్ మంధాన!



స్టార్ బ్యాటర్ నెట్ ప్రాక్టీస్

శ్రీలంకతో సిరీస్‌కు సన్నాహకం

ముంబై: ప్రతి మనిషి జీవితంలో వివాహం ఓ అపురూప ఘట్టం. అలాంటి పెళ్లి వేడుక రద్దయితే తట్టుకోవడం ఎంతో కష్టం. కానీ టీమిండియా స్టార్ బ్యాటర్ స్మృతి మంధాన..పలాష్ ముచ్చల్‌తో తన వివాహాన్ని రద్దు చేసుకున్నట్టు ప్రకటించిన 24 గంటల్లోపే క్రికెట్ మైదానంలో అడుగు పెట్టింది. ఈనెల 21నుంచి శ్రీలంకతో జరిగే ఐదు టీ20ల సిరీస్‌కు సన్నాహకాలు ఆరంభించింది. ఇందులో భాగంగా సోమవారం స్వస్థలంలో నెట్ ప్రాక్టీస్ చేసింది. ఈమేరకు ఆమె సాధన చేస్తున్న ఫొటోను స్మృతి సోదరుడు శ్రవణ్ మంధాన ఇన్‌స్టాలో పోస్ట్ చేశాడు. దానికి హార్ట్ ఎమోజీని జత చేశాడు. పోస్ట్ చేసిన కొద్దిసేపటికే ఈ ఫొటోకు పెద్ద ఎత్తున ప్రతిస్పందనలు వచ్చాయి. స్మృతి గుండె నిబ్బరాన్ని కొనియాడడంతో పాటు ఆమె అంకితభావానికి సహచర క్రికెటర్లు, ఫ్యాన్స్ జేజేలు పలికారు.

'క్యాండిడేట్స్'కు ప్రజ్ఞానంద అర్హత



న్యూఢిల్లీ: భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద 2026 క్యాండిడేట్స్ చెస్ టోర్నీకి అర్హత సాధించాడు. 2025 ఫిడే సర్క్యూట్‌లో గెలుపొందిన నేపథ్యంలో క్యాండిడేట్స్ చెస్ టోర్నమెంట్‌కు అతడి ఎంట్రీని సోమవారం అధికారికంగా ప్రకటించారు. చెన్నైకి చెందిన ప్రజ్ఞానంద ఈ సంవత్సరం జరిగిన పలు ఫిడే టోర్నీలలో అద్భుత ప్రదర్శన కనబరిచాడు. దరిమిలా అతడు సర్క్యూట్ విజేతగా నిలిచాడు.

మెగా టోర్నీ ముంగిట..

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



గిల్, అభిషేక్ శర్మ

నేటి నుంచి ఐదు టీ20ల సిరీస్ ● గిల్, హార్దిక్‌ల రాకతో బలంగా భారత్

- కెప్టెన్ సూర్య ఫామ్‌పై ఆందోళన
- ఒత్తిడిలో దక్షిణాఫ్రికా

కటక్: వచ్చే ఏడాది ఫిబ్రవరిలో టీ20 వరల్డ్‌కప్‌నకు భారత్ ఆతిథ్యం ఇవ్వనుంది. అంతకంటే ముందు మనోళ్లు ఆడే మ్యాచ్‌లు పది మాత్రమే. ఇందులో భాగంగా నేటి నుంచి దక్షిణాఫ్రికాతో ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుండగా, మిగతా ఐదు మ్యాచ్‌లను న్యూజిలాండ్‌తో ఆడనుంది. దీంతో టీమిండియా తాజా సిరీస్‌ను మెగా టోర్నీకి సన్నాహకంగా ఉపయోగించుకోవాలనుకుంటోంది. అంతేకాకుండా విశ్వకప్ కోసం చక్కటి కోర్ గ్రూప్‌ను తయారు చేసుకునే ఆలోచనలో కోచ్ గంభీర్ ఉన్నాడు. ఏ స్థానంలో ఎవరు ఆడాలి? కాంబినేషన్ ఎలా ఉండాలనేది ఈ సిరీస్ ద్వారా తెలుసుకోవాలనుకుంటున్నాడు. పొట్టి ఫార్మాట్‌లో భారత ప్రదర్శన అద్భుతంగా ఉంది. గతేడాది టీ20 వరల్డ్‌కప్‌లో వరుసగా ఎనిమిది మ్యాచ్‌లను నెగ్గి విజేతగా నిలిచిన టీమిండియా.. ఆ తర్వాత కూడా 20 మ్యాచ్‌ల్లో గెలిచి కేవలం నాలుగింట్లోనే ఓడింది. ఈ మధ్యకాలంలో ఒక్క టీ20 సిరీస్‌ను కూడా కోల్పోలేదు. ఇప్పుడు ఆ మెగా టోర్నీ ఫైనల్ ప్రత్యర్థితోనే జరుగుతున్న తాజా పోరులో బలాబలాలను సరిచూసుకోవాలనుకుంటోంది. అటు సఫారీలు పొట్టి ఫార్మాట్‌లో తడబడుతున్నారు. విశ్వకప్‌లో రన్నరప్‌గా నిలిచాక ఆ జట్టు ఆడిన 25 మ్యాచ్‌ల్లో తొమ్మిదే గెలవడం గమనార్హం. ఆసీస్, పాక్‌లపై సిరీస్‌లు కోల్పోగా.. నమీబియా పైనా ఓడారు. దీంతో ఈ సిరీస్ సఫారీలకు సవాల్‌గా మారనుంది.

పటిష్ఠంగా భారత్: గాయాల నుంచి కోలుకున్న వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా జట్టులో చేరడంతో టీమిండియా అత్యంత పటిష్ఠంగా కనిపిస్తోంది. ఐపీఎల్ నుంచి నిరంతరాయంగా క్రికెట్ ఆడుతున్న గిల్‌కు దాదాపు నెల రోజుల విశ్రాంతి లభించినట్టయింది. అద్భుత ఫామ్‌లో ఉన్న అభిషేక్‌తో కలిసి అతను ఓపెనింగ్ చేయనున్నాడు. ఇక ఆసియాకప్‌లో గాయపడిన పాండ్యా రెండు నెలలకు పైగా జట్టుకు దూరమయ్యాడు. ఇటీవలే సయ్యద్ ముస్తాక్ అలీ టోర్నీలో ఆడి ఫామ్ చాటుకున్నాడు. అతడి రాకతో బ్యాటింగ్ ఆర్డర్‌తో పాటు బౌలింగ్ విభాగం కూడా బలంగా కనిపిస్తోంది. అయితే ఆదివారం సాయంత్రం నెట్స్‌లో బౌలింగ్ చేసేటప్పుడు హార్దిక్ కాస్త అసౌకర్యానికి లోనైనట్టు సమాచారం. కెప్టెన్ సూర్యకుమార్ ఫామ్‌లేమి మాత్రం జట్టును తీవ్రంగా ఆందోళన పరుస్తోంది. ఐపీఎల్‌లో 717 పరుగులతో అదరగొట్టిన తను భారత్ తరఫున మాత్రం రాణించడం లేదు. గతేడాది జూలైలో కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి 15 ఇన్నింగ్స్‌లో 184 పరుగులే చేయగా, చివరి 20 మ్యాచ్‌ల్లో అర్ధసెంచరీ చేయలేకపోయాడు. ఈ సిరీస్‌లోనూ విఫలమైతే కెప్టెన్సీకే ఎసరు రావచ్చు. వికెట్ కీపర్ స్థానం కోసం శాంసన్, జితేశ్ మధ్య పోటీ నెలకొంది. ఆసీస్ టూర్‌లో వన్‌డౌన్‌లో శాంసన్‌ను ఒకే మ్యాచ్ ఆడించగా, చివరి మూడు మ్యాచ్‌ల్లో జితేశ్‌కు చోటు కల్పించారు. వాస్తవానికి గతేడాది ప్రపంచకప్ తర్వాత శాంసన్ ఓపెనర్‌గా మూడు శతకాలు బాదాడు. ఇందులో రెండు దక్షిణాఫ్రికాపైనే ఉన్నాయి. కానీ గిల్‌కు వైస్‌కెప్టెన్సీ అప్పగించి ఓపెనర్‌గా ఆడించడంతో సంజూ స్థానం మారింది. పేస్‌లో బుమ్రాకు హార్దిక్, దూబే తోడుగా ఉండనున్నారు. వరుణ్, అక్షర్, కుల్దీప్ స్పిన్ బాధ్యతలు తీసుకోనున్నారు.



ప్రాక్టీస్‌లో మిల్లర్, మార్‌క్రమ్

జట్టులోకి నోకియా: మార్‌క్రమ్ కెప్టెన్సీలో బరిలోకి దిగుతున్న సౌతాఫ్రికా జట్టు హిట్టర్ డి జోర్జి, పేసర్ మఫాక సేవలను కోల్పోయింది. గాయాలతో వీరు సిరీస్‌కు దూరమయ్యారు. అయితే స్టార్ పేసర్ నోకియా సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి రావడం సానుకూలాంశం కానుంది. గిల్ ఎక్కువగా అతని బౌలింగ్‌లోనే దొరికిపోతుంటాడు. డికాక్‌తో కలిసి మార్‌క్రమ్ ఇన్నింగ్స్‌ను ఆరంభించనున్నాడు. మిడిలార్డర్‌లో స్టబ్స్, బ్రెవిస్, మిల్లర్ భారత బౌలర్లను ఇబ్బంది పెట్టగలరు. ముఖ్యంగా బ్రెవిస్ స్పిన్నర్లను ఓ ఆటాడుకుంటాడు. ఈ త్రయంలో ఒక్కరు కుదురుకున్నా భారీ స్కోరు ఖాయమే. పేసర్ యాన్సెన్ నిఖార్సయిన ఆల్‌రౌండర్‌గా అదరగొడుతున్నాడు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, గిల్, సూర్యకుమార్ (కెప్టెన్), తిలక్, జితేశ్/శాంసన్, హార్దిక్, శివమ్ దూబే, అక్షర్, బుమ్రా, వరుణ్, కుల్దీప్.
దక్షిణాఫ్రికా: డికాక్, మార్‌క్రమ్ (కెప్టెన్), హెన్‌డ్రిక్స్, బ్రెవిస్, మిల్లర్, స్టబ్స్, బాష్, యాన్సెన్, కేశవ్, ఎన్‌గిడి, నోకియా.

పిచ్

దక్షిణాఫ్రికాతో ఇక్కడ ఆడిన రెండు టీ20 మ్యాచ్‌ల్లోనూ భారత్‌కు ఓటములే ఎదురయ్యాయి. తొలిసారిగా ఈ వికెట్‌ను ఎర్రమట్టితో తయారు చేయడంతో ఆరంభంలో పేస్, బౌన్స్ ఎక్కువగా ఉంటుంది. దీంతో బంతి బ్యాట్‌పైకి వచ్చే అవకాశం ఉండడంతో స్ట్రోక్‌ప్లేకు అనువుగా ఉంటుంది. స్పిన్నర్లు కూడా ప్రభావం చూపగలరు. మంచు కారణంగా టాస్ గెలిచిన జట్టు చేజింగ్‌కు మొగ్గు చూపే అవకాశముంది.

సూపర్ లీగ్‌కు హైదరాబాద్

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ గ్రూప్-బి టాపర్‌గా హైదరాబాద్ సూపర్ లీగ్‌కు అర్హత సాధించింది. సోమవారం చివరి ఓవర్ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో హైదరాబాద్ 4 వికెట్ల తేడాతో చండీగఢ్ చేతిలో ఓటమిపాలైంది. అయినా, మొత్తం 20 పాయింట్లతో హైదరాబాద్ బెర్త్‌ను ఖాయం చేసుకొంది. అయితే, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గోవాతలో 16 పాయింట్లతో సమంగా నిలిచినా.. మెరుగైన రన్‌రేట్‌తో మధ్యప్రదేశ్ రెండో బెర్త్‌ను దక్కించుకొంది. తొలుత హైదరాబాద్ 20 ఓవర్లలో 146/8 స్కోరు చేసింది. ప్రగ్నయ్ (43), అమన్ (33), తనయ్ (27) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. జగ్‌జీత్ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో చండీగఢ్ 19.1 ఓవర్లలో 6 వికెట్లకు 147 పరుగులు చేసి గెలిచింది. అర్జున్ ఆజాద్ (63), శివం (42) రాణించారు. మిలింద్, రక్షణ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.

వేల్స్‌పై భారత అమ్మాయిల గెలుపు

శాంటియాగో (చిలీ): జూనియర్ మహిళల హాకీ వరల్డ్‌కప్‌లో భారత్ 9వ స్థానం కోసం పోరాడనుంది. ఇప్పటికే క్వార్టర్స్ రేసు నుంచి అవుటైన భారత్.. సోమవారం జరిగిన వర్గీకరణ మ్యాచ్‌లో 3-1తో వేల్స్‌పై గెలిచింది. హీనా (14వ), సునెలిటా (24వ), ఇషిక (31వ) తలో గోల్ సాధించారు. 9వ స్థానం కోసం మంగళవారం జరిగే పోరులో ఉరుగ్వేతో భారత్ తలపడనుంది.

టీమిండియాకు జరిమానా

న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డేలో భారత జట్టు స్లో ఓవర్ రేట్‌కు పాల్పడినందుకు ఐసీసీ జరిమానా విధించింది. నిర్ణీత సమయానికి రెండు ఓవర్లు ఆలస్యంగా వేయడంతో రెఫరీ రిచీ రిచర్డ్‌సన్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజుల్లో పది శాతం జరిమానా విధించారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైన విషయం తెలిసిందే.

బిజినెస్

లాభాల స్వీకారంతో 'బేర్'

రూ.7.12 లక్షల కోట్లు హాంఫట్

ముంబై: లాభాల స్వీకారం, ఎఫ్‌పీఐల అమ్మకాలు సోమవారం స్టాక్ మార్కెట్‌ను కుంగదీశాయి. సెన్సెక్స్ 609.68 పాయింట్ల నష్టంతో 85,102.69 వద్ద ముగియగా నిఫ్టీ 225.90 పాయింట్ల నష్టంతో 25,960.55 వద్ద ముగిసింది. దీంతో బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల షేర్ల మార్కెట్ విలువ రూ.7.12 లక్షల కోట్లు నష్టపోయి రూ.464.19 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్‌లోని 30 షేర్లలో 29 షేర్లు నష్టాలతో ముగిశాయి. ఈ పతనానికి కారణాలేమిటో పరిశీలిద్దాం.

వడ్డీరేట్లపై సందిగ్ధత: అమెరికన్ ఫెడరల్ రిజర్వ్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, స్విట్జర్లాండ్ దేశాల కేంద్ర బ్యాంకుల ద్రవ్య, పరపతి విధానాలు ఈ వారం వెలువడనున్నాయి. అన్నిటికంటే బుధవారం వెలువడే 'ఫెడ్ రిజర్వ్' పరపతి విధానం కోసం భారత మార్కెట్ ఆసక్తితో ఎదురు చూస్తోంది. ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి ఫెడ్ చైర్మన్ జెరోం పోవెల్ కీలక వడ్డీ రేట్లను పావు శాతమైనా తగ్గిస్తారా, లేదా అన్నదే ప్రధానాంశం. సోమవారం భారత మార్కెట్ నష్టాలకు ఇది కూడా ఒక కారణంగా కనిపిస్తోంది.

ఎఫ్‌పీఐల అమ్మకాలు: గత ఏడాది వరకు మన స్టాక్ మార్కెట్‌లో ఎగబడి కొన్న ఎఫ్‌పీఐలు, ఈ ఏడాది ప్రారంభం నుంచే చిన్న చూపు చూస్తున్నాయి. ఇక్కడ అమ్మి చైనా, దక్షిణ కొరియా, తైవాన్ దేశాల్లో పెట్టుబడిగా పెడుతున్నాయి. ఈ నెల ఇప్పటి వరకు ఈ సంస్థలు రూ.1.55 లక్షల కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నాయి. సోమవారంనాడు కూడా ఈ సంస్థలు పెద్ద ఎత్తున అమ్మకాలకు దిగడం సూచీలను దెబ్బతీసింది.


రూపాయి పతనం: డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనం ఎఫ్‌పీఐలను మరింత బెంబేలెత్తిస్తోంది. ఈ సంవత్సరం ఇప్పటికే డాలర్‌తో ఐదు శాతం వరకు నష్టపోయిన రూపాయి, సోమవారం మరో 10 పైసలు నష్టపోయి రూ.90.05 వద్ద ముగిసింది. పెరుగుతున్న వాణిజ్య లోటు డాలర్‌తో రూపాయి మారకం రేటు త్వరలోనే రూ.92-93కు చేరే అవకాశం ఉందన్న అంచనాలు మార్కెట్‌ను మరింత భయపెడుతున్నాయి.

చమురు మంట: అంతర్జాయ ఉద్రిక్తతలతో చమురు ధర మళ్లీ మండుతోంది. సోమవారం బ్రెంట్ రకం చమురు బ్యారెల్ ధర గత రెండు వారాల్లో ఎన్నడూ లేని విధంగా 63.83 డాలర్లకు చేరింది. దీంతో మన వాణిజ్య లోటు పెరిగి చెల్లింపులు సమతౌల్యం దెబ్బతినే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.

ఔట్‌లుక్: నిఫ్టీ కీలక మద్దతు స్థాయి అయిన 26,000 పాయింట్ల దిగువన క్లోజైంది. తదుపరి మద్దతు 25,900-25,850 మధ్య ఉంటుందని టెక్నికల్ విశ్లేషకుల అంచనా. ఈ మద్దతు స్థాయిలు కూడా బ్రేకైతే నిఫ్టీ 50 సూచీ 25,500 స్థాయికి కూడా పతనమయ్యే ప్రమాదం ఉందనే హెచ్చరికలు వినిపిస్తున్నాయి.

భారతీయుల వద్ద 35,000 టన్నుల పసిడి

ప్రస్తుత మార్కెట్ విలువ రూ.342 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ధరలు చుక్కలంటుతున్నా సరే.. దేశ ప్రజలు బంగారాన్ని విపరీతంగా కొనేస్తున్నారు. దీంతో ఈ ఏడాది జూన్ నాటికి భారతీయ కుటుంబాల వద్ద నగలు, కడ్డీలు, బిస్కెట్లు, నాణేల రూపంలో ఉన్న పసిడి నిల్వలు 34,600 టన్నులకు చేరాయి. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం ఈ బంగారం విలువ 3.8 లక్షల కోట్ల డాలర్లని (సుమారు రూ.342 లక్షల కోట్లు) మోర్గాన్ స్టాన్లీ ఒక నివేదికలో తెలిపింది. ప్రస్తుత దేశ జీడీపీలో ఇది 88.8 శాతానికి సమానం.

మారుతున్న ట్రెండ్: గతంలో దేశీయ కుటుంబాలు నగ నట్రా రూపంలోనే బంగారం కొనేవారు. ఇప్పటికీ దేశంలో అమ్ముడయ్యే బంగారంలో నాలుగింట మూడు వంతులు నాణేలు, కడ్డీల రూపంలోనే అమ్ముడవుతోంది. మిగతా మూడో వంతు మాత్రమే పెట్టుబడి లాభాల కోసం కొనే వారు కొంటున్నారు. గత ఏడాది కాలంలో బులియన్ మార్కెట్ ముఖ్యంగా పసిడి గతంలో ఎన్నడూ లేని విధంగా అరవై శాతానికిపైగా లాభాలు పంచింది. దీంతో ఇటీవల ఈ తరహా అమ్మకాలు మరింత పెరిగాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని మ్యూచువల్ ఫండ్స్ గోల్డ్ ఈటీఎఫ్‌లు, మల్టీ అసెట్స్ ఫండ్స్ పేరుతో ప్రత్యేక పథకాల ప్రారంభించి పెద్ద ఎత్తున నిధులు సమీకరిస్తున్నాయి.

ఆభరణాలు వేస్ట్: పెట్టుబడి లాభాల కోసమైతే ఆభరణాల రూపంలో బంగారం కొనడం వృథా అని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్ ఒక నివేదిలో తెలిపింది. ఈ నగల్లో 30 నుంచి 35 శాతం విలువకు రాళ్లు, రత్నాలే ఉంటాయి. తరుగు, తయారీ చార్జీలు అదనం. పసిడి ధర ఏటా కనీసం 30% చొప్పున పెరిగితేగానీ ఆభరణాల పెట్టుబడులపై లాభాలు రావు. దీన్ని దృష్టిలో ఉంచుకుని పెట్టుబడి లాభాల కోసం చూసే వారు ఫిజికల్ గోల్డ్ లేదా గోల్డ్ ఈటీఎఫ్‌ల్లో మదుపు చేయడం మంచిదని ఇన్వెస్ట్‌మెంట్ నిపుణులు సూచిస్తున్నారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,420 ▲	1,19,550 ▲	1,98,000 ▲
విజయవాడ	1,32,000 ▲	1,23,000 ▲	1,83,000 ▼
విశాఖపట్నం	1,32,570 ▲	1,19,550 ▲	1,98,000 ▲
రాజమండ్రి	1,30,420 ▲	1,19,550 ▲	1,81,000 ▼
ప్రొద్దుటూరు	1,27,750 ▲	1,17,530 ▲	1,78,000 ▲
ముంబై	1,28,260 ▼	1,17,480 ▼	1,79,090 ▲

సైయెంట్ సెమీ కండక్టర్స్‌తో నవిటాస్ భాగస్వామ్యం

హైదరాబాద్: కొత్త తరం జీఏఎన్ టెక్నాలజీని భారత దేశంలో ప్రవేశపెట్టి సంపూర్ణ జీఏఎన్ వ్యవస్థను నెలకొల్పడం లక్ష్యంగా నవిటాస్ సెమీ కండక్టర్ కార్పొరేషన్‌తో సైయెంట్ సెమీకండక్టర్స్ దీర్ఘకాలిక వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం కింద రెండు కంపెనీలు డేటా సెంటర్లు, విద్యుత్ వాహనాలు, పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్, ఎనర్జీ గ్రిడ్ మౌలిక వసతులు, పారిశ్రామిక విద్యుదీకరణ రంగాలకు అవసరం అయిన జీఏఎన్ ఉత్పత్తులను ఉమ్మడిగా అభివృద్ధి చేస్తాయి.

డాక్టర్ రెడ్డీస్ నుంచి కేన్సర్ ఔషధం

న్యూఢిల్లీ: హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ మరో సరికొత్త కేన్సర్ ఔషధాన్ని మార్కెట్‌లో విడుదల చేయనుంది. ఇందుకోసం ఇమ్యూటెప్ లిమిటెడ్ కంపెనీతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ లైసెన్సింగ్ ఒప్పందంపై డాక్టర్ రెడ్డీస్ అనుబంధ సంస్థ డాక్టర్ రెడ్డీస్ ఎస్ఏ, ఇమ్యూటెప్ లిమిటెడ్ అనుబంధ సంస్థ ఇమ్యూటెఎప్ ఎస్ఏఎస్ సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ద్వారా ఇమ్యూటెప్‌కు చెందిన ఎఫ్టిలాగిమోడ్ అల్ఫా అనే కేన్సర్ ఔషధాన్ని డాక్టర్ రెడ్డీస్ ఉత్తర అమెరికా, యూరప్, జపాన్, గ్రేటర్ చైనా దేశాల వెలుపల మార్కెట్ చేస్తుంది. ఈ ఔషధం కేన్సర్‌తో పాటు ఇతర ఆటో ఇమ్యూన్ వ్యాధుల పైనా పోరాడుతుందని రెండు కంపెనీలు ప్రకటించాయి.

తుప్పు నష్టం రూ.8.8 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: వాతావరణపరమైన కారణాలతో వాహనాలు, పరిశ్రమలు, మౌలిక వసతులకు తుప్పు పట్టడం ద్వారా ఏటా జీడీపీలో 5 శాతం లేదా 10 వేల కోట్ల డాలర్ల (రూ.8.8 లక్షల కోట్లు) నష్టం వాటిల్లుతోందని వివిధ అధ్యయనాల్లో తేలింది. వాహనాలు, మౌలిక వసతులు, పారిశ్రామిక వ్యవస్థలను తుప్పు తీవ్రంగా ప్రభావితం చేస్తున్నట్టు నిపుణులు చెబుతున్నారు. తుప్పు కారణంగా సాధారణ కార్ల యజమానులకు వాహనం కొన్న తర్వాత కొద్ది సంవత్సరాలకే మరమ్మత్తు బిల్లులు పెరిగిపోతున్నాయి. వాహనాల నాణ్యత వేగంగా దిగజారి రీసేల్ విలువ గణనీయంగా పడిపోతోంది. ఆ రకంగా వారిపై విపరీతమైన భారం పడుతోందని నిపుణులు తెలిపారు. వాహనాలకు గాల్వనైజ్డ్ స్టీల్ (తుప్పు నుంచి రక్షణ కల్పించే నాణ్యత గల ఉక్కు) ఉపయోగించే విషయంలో దేశీయ, ఎగుమతి మార్కెట్లకు ఒకే తరహా నిబంధనలుండాలని వారు సూచిస్తున్నారు. యూరప్, జపాన్, ఉత్తర అమెరికా, ఆఫ్రికా మార్కెట్లకు ఎగుమతి చేయడానికి ఉత్పత్తి చేసే వాహనాల్లో 70%, ఆ పై బడిన స్థాయిలో గాల్వనైజ్డ్ స్టీల్ ఉపయోగిస్తున్నారని, దానికి అదనంగా ఆరున్నర సంవత్సరాల యాంటీ కరోజన్ వారెంటీలు ఇస్తున్నారని వారన్నారు. అదే భారత మార్కెట్ కోసం తయారుచేసే కార్లలో గాల్వనైజ్డ్ స్టీల్ వినియోగం చాలా తక్కువగా ఉంటోందని, ఇక వారెంటీ అయితే నామమాత్రంగా కూడా కల్పించడంలేదని వారు చెప్పారు. గాల్వనైజ్డ్ స్టీల్‌తో తయారుచేసే వాహనాలకు అదనంగా అయ్యే వ్యయం 0.1% కన్నా తక్కువేనని, కాని మరమ్మత్తుల కోసం చేసే వేలాది రూపాయల వ్యయాన్ని నివారించగలుగుతారని అంటున్నారు. వాహనాలకు తుప్పు పట్టడం వల్ల చాసిస్, సస్పెన్షన్ మౌంట్లు, జాయింట్లు బలహీనమై ప్రయాణికుల భద్రతకు కూడా ముప్పు ఏర్పడుతుందని వారు హెచ్చరించారు. అయితే సెంట్రల్ మోటార్ వాహనాల నిబంధనలు (సీఎంవీఆర్) గాని, భారత ప్రమాణాల సంస్థ నిబంధనలు గాని వాహనాలకు తుప్పు నిరోధక స్థాయిలు లేదా గాల్వనైజేషన్ ఉక్కు వినియోగ శాతాన్ని నిర్ధారించకపోవడం విచారకరమని వారంటున్నారు. జింక్ కోటింగ్ వేసిన ఉక్కు షీట్లు కార్ల బాడీని తుప్పు నుంచి రక్షిస్తాయని ఇండియా లెడ్ జింక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.పుహళేంది అన్నారు.

ఐబీఎం గూటికి కాన్‌ఫ్లుయెంట్

ఒప్పందం విలువ రూ.1 లక్ష కోట్లు

న్యూయార్క్: అమెరికన్ టెక్నాలజీ కంపెనీ ఐబీఎం మరో భారీ కొనుగోలు జరిపింది. డేటా స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ కాన్‌ఫ్లుయెంట్‌ను 1,100 కోట్ల డాలర్లకు (సుమారు రూ.లక్ష కోట్లు) దక్కించుకుంది. పూర్తిగా నగదు రూపంలో జరగనున్న ఈ డీల్‌లో భాగంగా కాన్‌ఫ్లుయెంట్‌కు చెందిన ఒక్కో షేరుకు ఐబీఎం 31 డాలర్లు చెల్లించనుంది. 2026 ప్రథమార్ధం చివరినాటికి ఈ కొనుగోలు ప్రక్రియ పూర్తి కావచ్చని అంచనా. కాన్‌ఫ్లుయెంట్ కొనుగోలు తమ కృత్రిమ మేధ (ఏఐ) సేవల సామర్థ్యాన్ని మరింత పెంచనుందని ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ అన్నారు. ఈ డీల్ నేపథ్యంలో అమెరికా స్టాక్ మార్కెట్లో కాన్‌ఫ్లుయెంట్ షేరు సోమవారం ఒకదశలో 26 శాతం ఎగబాకగా.. ఐబీఎం స్టాక్ 1 శాతం తగ్గింది. గడిచిన రెండేళ్లలో ఐబీఎం జరిపిన మూడో అతిపెద్ద కొనుగోలు లావాదేవీ ఇది.

లగ్జంబర్గ్ ఇండస్ట్రీస్‌తో ఏటీజీసీ బయోటెక్ జాయింట్ వెంచర్

హైదరాబాద్: జెనోమ్ వేలీలో కార్యకలాపాలు సాగిస్తున్న.. ఫెరోమోన్, సెమియో కెమికల్ ఆధారిత పంట రక్షణ ఉత్పత్తుల విభాగంలోని ఏటీజీసీ బయోటెక్ కంపెనీ ఇజ్రాయెల్‌కు చెందిన లగ్జంబర్గ్ ఇండస్ట్రీస్‌తో జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసుకున్నట్టు ప్రకటించింది. న్యూఢిల్లీలో జరిగిన తొలి అంతర్జాతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ క్లస్టర్ల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఈ లైసెన్సింగ్ ఒప్పందాల మార్పిడి జరిగింది. ఈ సెమియోఫోర్ జేవీకి అవసరమయ్యే కోటి డాలర్ల (రూ.89 కోట్లు) పెట్టుబడిని సెమియోఫోర్, లగ్జంబర్గ్ ఇండస్ట్రీస్, ఏటీజీసీ బయోటెక్ సమంగా సమకూరుస్తాయని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఒప్పందం కింద ఏటీజీసి ఐపీ, టెక్నాలజీ, సాంకేతిక పరిజ్ఞానం, రెగ్యులేటరీ, ఆర్ అండ్ డీలపై దృష్టి పెడుతుంది. లగ్జంబర్గ్ ఇండస్ట్రీస్ రెగ్యులేటరీ, మార్కెటింగ్, తయారీ వ్యయాలను భరిస్తుంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ.	90

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	129	విజయవాడ	130
వరంగల్	129	గుంటూరు	135
కరీంనగర్	129	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	129	చిత్తూరు	127
కర్నూలు	129	నెల్లూరు	132
విశాఖపట్నం	126	అనంతపురం	132
గోదావరి	130		



ఉద్యాన, చేనేత-జౌళి శాఖ స్టాల్ ప్రారంభ కార్యక్రమంలో తుమ్మల

వ్యవసాయ రంగానికి సమ్మిట్ దిక్సూచి: తుమ్మల

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యవసాయరంగానికి దిక్సూచిలా గ్లోబల్ సమ్మిట్ దోహదపడుతుందని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. డిజిటల్ స్మార్ట్ దిశగా వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నట్లు తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌లోరూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ(రేర్)లో భాగంగా రైతుల ఆదాయం పెంపుదల అనే అంశంపై తుమ్మల మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతు సంక్షేమం, పురోగతికి అత్యధిక ప్రాధాన్యత నిస్తోందన్నారు. గత రెండేళ్లలో రైతు సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాల కోసం రూ.లక్ష కోట్ల పెట్టుబడి పెట్టిందని తెలిపారు. రాష్ట్ర వ్యవసాయం, అనుబంధ ఆర్థిక వ్యవస్థ పరిమాణం దాదాపు 34.6 బిలియన్ డాలర్లు ఉందన్నారు. 2047నాటికి దీనిని 400 బిలియన్ డాలర్లకు పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు తుమ్మల తెలిపారు. రైతులు ఆధునిక, వ్యవసాయం నుంచి ప్రయోజనం పొందాలని కోరుకుంటున్నట్లుతెలిపారు. కాగా, వ్యవసాయ, ఉద్యాన, చేనేత-జౌళి శాఖల ఆధ్వర్యంలో సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తుమ్మల ప్రారంభించారు. ఇక నోబెల్ గ్రహీత కైలాష్ సత్యార్థితో తుమ్మల భేటీ అయి.. రాష్ట్రంలో విద్యారంగ పురోగతి, విద్యార్థుల హక్కుల పరిరక్షణ తదితరాలపై చర్చించారు.

కాలుష్య రహితం.. మన లక్ష్యం : మంత్రి పొన్నం



పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాకుండా ప్రజారోగ్యం, ఆర్థిక వృద్ధి, ఇంధన భద్రత, పట్టణ నివాస యోగ్యతను తమ ప్రభుత్వం కీలకంగా చూస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. "కాలుష్యాన్ని తగ్గించేందుకు విద్యుత్ వాహనాల వినియోగం"పై మంత్రి మాట్లాడారు. తమ ప్రభుత్వం కాలుష్య రహిత రవాణా(క్లీన్ మొబిలిటీ)ని కేవలం పర్యావరణ లక్ష్యంగా కాకుండా ప్రజారోగ్యం, ఆర్థిక వృద్ధి, ఇంధన భద్రత, పట్టణ నివాస యోగ్యతకు కీలకంగా చూస్తుందని చెప్పారు. 2047 నాటికి '0' ఉద్గార రవాణా(జీరో-ఎమిషన్ మొబిలిటీ)లో తెలంగాణ దిక్సూచిగా ఎదగాలని చెప్పారు. విద్యుత్ వాహనాలకు(ఈవీలు) భారీగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. 2026 డిసెంబరు 31 వరకు అన్ని ఈవీలకు రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ రుసుములో 100 శాతం మినహాయింపు ఇచ్చామని మంత్రి వివరించారు. . ప్రభుత్వం 37 ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్లను(ఏటీఎస్) ఏర్పాటు చేస్తుందన్నారు. అధునాతన డ్రైవింగ్ శిక్షణ సంస్థలు, ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు, ఉద్గార రహిత రవాణా(జీరో-ఎమిషన్ మొబిలిటీ), ప్రమాద రహిత(జీరో-ఫ్యాటాలిటీ) రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

రాష్ట్రమంతటా 4 లేన్ల రోడ్లు!: కోమటిరెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ ప్రకారం, త్వరలో తెలంగాణ వ్యాప్తంగా పూర్తిగా 4 లేన్ల రహదారులు నిర్మించబోతున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. మెరుగైన రోడ్ల నిర్మాణం ద్వారా గ్రామీణ తెలంగాణ అభివృద్ధి చెందుతుందని, పరిశ్రమలు తరలివస్తాయని, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆయన చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో ఫ్యూచర్ సిటీ గేమ్‌చేంజర్‌గా నిలవబోతుందని పేర్కొన్నారు.

గ్లోబల్ సమ్మిట్‌కు చంద్రబాబు శుభాకాంక్షలు

అమరావతి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025'కు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుశుభాకాంక్షలు తెలిపారు. రెండు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ సదస్సు తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, పురోగతికి, ఆవిష్కరణలకు వేదిక కావాలని ఆకాంక్షించారు. ఈమేరకు సోమవారం ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు.

గ్లోబల్ అతిథులకు లోకల్ రుచులు

తెలంగాణ రుచులతో అతిథులకు బాస్కెట్లు పంపిణీ.. అలరించిన కీరవాణి సంగీతం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్‌కు విచ్చేసిన దేశ, విదేశీ అతిథులకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సంప్రదాయ వంటకాల రుచి చూపించింది. ప్రతి అతిథికి ప్రత్యేకంగా రూపొందించిన ఫుడ్ బాస్కెట్‌ను అందించింది. దీనిలో ఆదిలాబాద్‌లోని ఆదివాసీలు చేతితో తయారుచేసిన ఇప్పపువ్వు లడ్డూలు, హైదరాబాద్‌లోని హుస్సేనీ కుటుంబం దాదాపు 200 ఏళ్లుగా చేస్తూ వస్తున్న బాదం కీ జలీ, గ్రామీణ స్వయం సహాయక మహిళా బృందాలు స్వయంగా వండిన సకినాలు, చెక్కలు, నువ్వుల ఉండలు, మక్కపేలాల వంటివి ఉన్నాయి. ఈ వంటకాలను ప్రత్యేక సీసాలలో పెట్టి, అందమైన బాస్కెట్‌లో అందించారు. అంతేకాకుండా ఆ వంటకాల విశిష్టతను అతిథులకు తెలిపేలా వివరాలను కూడా ముద్రించారు. తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి తెలిపేందుకు ఇది ఓ మార్గమని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ ఫుడ్ బాస్కెట్‌లోని రుచులు అతిథులకు నచ్చితే, వారు తెలంగాణలోని 10 వేలకు పైగా స్వయం సహాయక మహిళా బృందాలకు బ్రాండ్ అంబాసిడర్లుగా నిలవడమే కాకుండా, సరికొత్త వ్యాపార భాగస్వామ్యాల ప్రారంభానికి నాంది అవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు.

బాస్కెట్‌లోని ప్రత్యేక రుచులు ఇవే..

బాదం కీ జలీ: ఇది హైదరాబాదీ ప్రత్యేక తియ్యదనం. అజీజ్‌బాగ్‌లో ఉండే హుస్సేనీ కుటుంబం కోడళ్లు 200ఏళ్లుగా ఈ వంటకం తయారుచేస్తున్నారు. బాదం, జీడిపప్పు, పంచదార, యాలకులతో చేసే బాదంకీ జలీ నోట్లో వేసుకోగానే కరిగిపోతుంది.

చెక్కలు: కరకరలాడే ఈ చెక్కలను 30 మంది స్థానిక మహిళలు స్వయంగా తయారుచేశారు.



బియ్యంపిండి, కరివేపాకు, నువ్వులు, జీలకర్ర, శనగపప్పు కలిపి నూనెలో వేయించే ఈ చెక్కలను ప్రయాణ సమయంలో కూడా హాయిగా తినేయచ్చు.

ఇప్పపువ్వు లడ్డు: ఆదిలాబాద్ జిల్లాలోని గోండు తెగకు చెందిన 75 మంది ఆదివాసీ మహిళలు ఇప్పపువ్వు లడ్డూలు ప్రత్యేకంగా చేతితో తయారుచేసి సదస్సుకు పంపారు.

మక్క పేలాలు: కామారెడ్డిలో ఎక్కువగా కనిపించే సంప్రదాయ స్నాక్ ఇది. అక్కడ నుంచే నేరుగా ఈ సదస్సుకు మక్క పేలాలు తీసుకువచ్చారు. వర్షాకాలంలో ఈ మక్క పేలాలు ఎక్కువగా కనిపిస్తాయి.

నువ్వుల ఉండలు: నువ్వులు, బెల్లంతో తయారు చేసే సంప్రదాయ స్వీట్ ఇది. ఈ లడ్డూలు సహజసిద్ధంగా శక్తిని అందిస్తాయి. చలికాలంలో శరీరానికి వెచ్చదనమూ అందిస్తుంది ఈ లడ్డు.

సకినాలు: ఇది కరీంనగర్ సంప్రదాయ వంటకం. సకినాలు.. తెలంగాణ రైజింగ్ సదస్సు అతిథులకు పండుగ రుచులను అందించాయి. ఛాయ్ లేదంటే కాఫీతో కలిపి తీసుకుంటే అద్భుతమేనట!

అతిథులకు గాలా డిన్నర్

సమ్మిట్‌కు వచ్చిన అతిథులకు గాలాడిన్నర్ పేరుతో విందు ఏర్పాటుచేశారు. ఇందులో మటన్, నాటుకోడి మాంసంతో ప్రత్యేకంగా హైదరాబాద్ స్టైల్‌లో వంటకాలు చేయించారు. పలు దేశాల ప్రముఖులతో కలిసి ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులు గాలా డిన్నర్‌లో పాల్గొన్నారు. సమావేశం అనంతరం పలు అంశాలతో కూడిన కళా ప్రదర్శనలు నిర్వహించారు.

మారుమోగిన అందెశ్రీ పాట

సమ్మిట్‌లో ప్రపంచ దిగ్గజ వ్యాపారులు, ప్రముఖుల సమక్షంలో తెలంగాణ రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ... జననీ జయ కేతనం అంటూ మారుమోగింది. దీంతో గ్లోబల్ సమ్మిట్‌ను వీక్షించిన ప్రజలంతా అందెశ్రీని స్మరించుకున్నారు. 'అందెశ్రీ... నీ పాటకు ప్రపంచం లేచి నిలుచున్నది' అని సోషల్ మీడియాలో సందేశం చక్కర్లు కొట్టింది. గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ రైజింగ్ గీతం ఆకట్టుకుంది. 'తెలంగాణ రైజింగ్ స్టేట్ ఈజ్ సో షైనింగ్.. ఇట్స్ జస్ట్ అమేజింగ్, ది ఫ్యూచర్ ఈజ్ బిల్డింగ్' అంటూ సాగిన గీతం అతిథులకు ఉత్సాహం కలిగించింది.

మైమరిపించిన కీరవాణి సంగీతం

సమ్మిట్‌లో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు కీరవాణి తన అద్భుత సంగీత విభావరితో అతిథులను మైమరిపించారు. ఒకవైపు గాలా డిన్నర్‌లో ఇష్టమైన వంటకాల రుచిని ఆస్వాదిస్తూ, మరోవైపు సంగీత విభావరి, మిరుమిట్లు గొలిపే వెలుగులను ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్.. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 'మీరిచ్చిన డబ్బుతోనే ఘనంగా పెళ్లి చేసుకున్నాను.. రేవంతన్నా.. జీవితాంతం మీకు రుణపడి ఉంటాను' అని అన్నారు.

ప్రతి వైద్య కళాశాలా.. 50 గ్రామాలను దత్తత తీసుకోవాలి

- ప్రాథమిక వైద్యాన్ని పటిష్ఠం చేయాలి
- హెల్త్ ప్యానల్ చర్చలో వక్తలు
- ప్రజలకు మెరుగైన వైద్యం: దామోదర

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రతి వైద్య కళాశాల 50 గ్రామాలను దత్తత తీసుకోవాలని.. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణలో ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానాన్ని ప్రవేశపెట్టాలని, గ్రామీణ స్థాయిలో కార్పొరేట్ వైద్య సేవలను విస్తరించాలని వైద్యరంగ నిపుణులు సూచించారు. 'గ్లోబల్ సమ్మిట్'లో "అందరికీ అందుబాటులో, తక్కువ ఖర్చుతో కూడిన, సమానమైన వైద్యం" అంశంపై జరిగిన చర్చా వేదికలో వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఫార్మా రంగానికి ఉన్న నాయకత్వం, మౌలిక వసతులు.. హైదరాబాద్‌ను హెల్త్ హబ్‌గా మార్చాయని అపోలో డైరెక్టర్ సంగీత పేర్కొన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ కేర్‌లో బయోమార్కర్ల వంటి అధునాతన చికిత్సలు ఇక్కడ అందుబాటులోకి రావడం గర్వకారణమన్నారు. పేద, ధనిక తేడా లేకుండా.. వైద్యం ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని ఎంపీ, మెడిహీల్ గ్రూప్ అధినేత స్వరూప్ రంజన్ మిశ్రా స్పష్టం చేశారు. ప్రస్తుతం వైద్య ఖర్చుల్లో 45% మందులకే పోతోందని, దీనిని నియంత్రించాల్సిన అవసరం ఉందని తెలిపారు. "వేల్యూ ఫర్ మనీ" సేవల్లో హైదరాబాద్ గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని కిమ్స్ సన్‌షైన్ ఎండీ డాక్టర్ గురవారెడ్డి పేర్కొన్నారు. మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను కూడా ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలని, కనీస వైద్యం ప్రజల జన్మహక్కు అని ఎయిమ్స్ డాక్టర్ అనిత అగర్వాల్ అన్నారు. ప్రతి మెడికల్ కాలేజీ కనీసం 50గ్రామాలను దత్తత తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. పౌష్టికాహార లోపం, రక్తహీనత, ఊబకాయం.. దేశాన్ని తీవ్రంగా వేధిస్తున్నాయని ఎన్ఐఎన్ డైరెక్టర్ భారతి కులకర్ణి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని చర్చలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టంచేశారు. 2వేలపడకలతో నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం, వరంగల్ హెల్త్ సిటీ, హైదరాబాద్ నలువైపులా మూడు టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణం జరుగుతున్నట్టు వివరించారు.

కొత్తగా తెలంగాణ పర్యాటకం: జూపల్లి

తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రపంచానికి సరికొత్తగా పరిచయం చేస్తామని మంత్రి జూపల్లి అన్నారు. రాష్ట్ర పర్యాటకాన్ని విశ్వవ్యాప్తం చేయడమే తమ లక్ష్యమన్నారు. పర్యాటక శాఖ స్టాల్‌ను ప్రారంభించిన జూపల్లి మాట్లాడుతూ.. నూతన పాలసీపై పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారన్నారు.

భద్రతా ఏర్పాట్లపై డీజీపీ ఆరా

గ్లోబల్ సమ్మిట్ భద్రతా ఏర్పాట్లను డీజీపీ శివధర్ రెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. దాదాపు వంద ఎకరాల విస్తీర్ణంలోని ప్రాంగణంలో కాలినడకన కలియ తిరుగుతూ అధికారులకు సూచనలు చేశారు.

మహిళా సాధికారతలో రోల్ మోడల్‌గా తెలంగాణ

- స్టార్టప్‌ల నుంచి సౌర విద్యుత్ దాకా మహిళా సంఘాలు
- 2047 నాటికి మహిళా శ్రామిక భాగస్వామ్యం 90శాతం
- చర్చలో భవిష్యత్తు ప్రణాళికలను వెల్లడించిన మంత్రి సీతక్క

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతలో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. మహిళలు ఎదిగితేనే దేశం ఎదుగుతుందని, ఈ మార్పునకు తెలంగాణనే నాయకత్వం వహిస్తోందని పేర్కొన్నారు. సమ్మిట్‌లో సెర్ప్, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్టాల్‌ను సీతక్క ప్రారంభించారు. అనంతరం ప్యానల్ చర్చలో మాట్లాడారు. రాష్ట్రంలోని గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థల అభివృద్ధిలో 65 లక్షల మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి పథకంతో పేద మహిళలు, వికలాంగులు, అట్టడుగు వర్గాల వారికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. తెలంగాణలో ఒక్క మహిళ కూడా వెనుకంజలో ఉండకూడదనే లక్ష్యంతో పనిచేస్తున్నామని తెలిపారు. దేశంలోనే తొలిసారిగా 64 మెగావాట్ల సౌర విద్యుత్తు ప్లాంట్లు మహిళల నేతృత్వంలో ఏర్పాటు



ప్యానల్ చర్చలో పాల్గొన్న మంత్రి సీతక్క

కాబోతున్నాయని, బస్సులు కొని ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా మహిళా సంఘాలకు ప్రతి నెలా ఆదాయం సమకూరుతోందని తెలిపారు. మరెక్కడా లేని విధంగా మహిళలే పెట్రోల్ బంకులు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణతో మహిళల ఆర్థిక స్వరూపం మారిపోయిందని పేర్కొన్నారు. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ.7,600 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నారని గుర్తు చేశారు. 'రూ.500కే గ్యాస్ సిలిండర్‌తో 45లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరిందని చెప్పారు. ప్రస్తుతం 52శాతంగా ఉన్న మహిళా శ్రామిక భాగస్వామ్యాన్ని 2047 నాటికి 90శాతానికి పెంచాలని సంకల్పించామన్నారు. మహిళా పారిశ్రామిక క్లస్టర్లతో ఉపాధి అవకాశాలు సృష్టించే స్థాయికి మహిళలు ఎదిగారని చెప్పారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

నటిపై లైంగిక దాడి కేసు.. నిర్దోషిగా దిలీప్



ప్రముఖ మలయాళ నటిపై లైంగిక దాడి కేసులో నిందితుల్లో ఒకరైన నటుడు దిలీప్‌ను కేరళలోని ఎర్నాకుళం కోర్టు సోమవారం నిర్దోషిగా తేల్చింది. దిలీప్‌పై ఉన్న అభియోగాన్ని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని ధర్మాసనం పేర్కొంది. దిలీప్‌తో పాటు మరో ముగ్గురిని నిర్దోషులుగా తీర్మానించింది. అత్యాచారం, కుట్ర వంటి తదితర నేరాల కింద మరో ఆరుగురిని న్యాయస్థానం దోషులుగా తేల్చింది. ఈనెల 12న జరిగే తదుపరి విచారణలో దోషులకు శిక్షను ఖరారు చేయనుంది. కాగా, 2017 ఫిబ్రవరి 17న తెలుగు, తమిళ, మలయాళ సినిమాల్లో నటించిన ఓ ప్రముఖ నటిని కొచ్చిలో దుండగులు కిడ్నాప్ చేశారు. దాదాపు రెండు గంటలపాటు ఆమెను కారులో వేధించారు. ఈ విషయంలో 10 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అందులో దిలీప్ కూడా ఒకరు. వారిపై కిడ్నాప్, లైంగిక వేధింపులు, గ్యాంగ్ రేప్, ఉద్దేశపూర్వకంగా ఆధారాలను చెరిపివేయడం వంటి అభియోగాల కింద కేసులు నమోదయ్యాయి. 2017 ఏప్రిల్‌లో తొలి ఛార్జిషీట్ నమోదు చేశారు. ఆ ఏడాది జూలైలో పోలీసులు దిలీప్‌ను అరెస్టు చేశారు. అదే ఏడాది అక్టోబరులో బెయిలుపై బయటికి వచ్చారు. ఈ కేసులో తనకెలాంటి ప్రమేయం లేదని చెప్తూ వచ్చిన దిలీప్.. తాజాగా కోర్టు తీర్పుపై స్పందించారు. 'ఇది నాపై జరిగిన కుట్ర. నాకు మద్దతుగా నిలిచిన వారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు. దాదాపు ఎనిమిదిన్నర ఏళ్ల పాటు సాగిన ఈ కేసు అనేక మలుపులు తిరిగింది.

విజయవంతం అవ్వాలి



రానా దగ్గుబాటి

'మన ప్రేక్షకులకు టీవీ తప్పితే ఓటీటీలు పరిచయం లేని కాలంలో నేను 'ఛాయ్ బిస్కట్' వ్యవస్థాపకులు శరత్, అనురాగ్‌ను కలిశాను. వీళ్లకున్న ప్రతిభ, తెలివితేటలు, దృక్పథం అపారమైనవి. వీరు ప్రారంభించిన ఈ ప్రయాణం అందరికీ ఎంతో మేలు చేస్తుంది. నేను ఈ కొత్త ప్రయత్నానికి ఎల్లప్పుడూ తోడ్పాటును అందిస్తాను' అని రానా దగ్గుబాటి అన్నారు. తెలుగు డిజిటల్ ఎంటర్టైన్‌మెంట్ సంస్థ ఛాయ్ బిస్కట్.. దేశంలోనే తొలి ప్రాంతీయ షార్ట్ సిరీస్ వేదిక 'ఛాయ్ షాట్స్'ను సోమవారం ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రానా మాట్లాడుతూ 'ఇందులో ఉన్న కంటెంట్ సినిమాల్లాగే విజయవంతం కావాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. 'ఇది మా జీవితంలో కొత్త ఛాప్టర్. భావోద్వేగాలకి కనెక్ట్ కావడం మనం కథల నుంచే నేర్చుకున్నాం. కథలు మన జీవితంలో ముఖ్యభాగం' అని శరత్ తెలిపారు. 'మేము చేసిన ఈ ప్రయత్నం అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాం' అని అనురాగ్ పేర్కొన్నారు. రెండు నిమిషాల లోపు కథలను కొత్తగా చెప్పేలా కంటెంట్ క్రియేటర్లను ప్రోత్సహించే ఈ యాప్ అందరికీ చేరువవుతుంది. భారత దేశంలో వినోదం విభాగంలో ప్రభంజనాన్ని సృష్టిస్తుంది' అని నిర్మాత వై.రవిశంకర్ అన్నారు.

కన్నీరు పెట్టుకున్న సల్మాన్ ఖాన్



'హిందీ బిగ్‌బాస్ 19' ఫైనల్ వేదికపై వ్యాఖ్యాత సల్మాన్ ఖాన్ కన్నీరుమున్నీరయ్యారు. బాలీవుడ్ సీనియర్ నటుడు ధర్మేంద్రను గుర్తు చేసుకొని వెక్కివెక్కి ఏడ్చారు. గతంలో బిగ్‌బాస్ షోలో ధర్మేంద్ర పాల్గొన్న వీడియోను ప్రదర్శించగా సల్మాన్ భావోద్వేగానికి గురయ్యారు. 'డిసెంబరు 8వ తేదీ ధర్మేంద్రజీ పుట్టిన రోజు. మా అమ్మ పుట్టిన రోజు కూడా ఈరోజే. నా తండ్రి పుట్టిన రోజున(నవంబరు 24) ధర్మేంద్రజీ మరణించారు. మనం హీ-మ్యాన్‌ను కోల్పోయాం ఆయనకంటే గొప్పవారు ఎవరూ లేరు' అంటూ ధర్మేంద్రతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు.



సినిమాలు చేయడం ఆపేద్దామనుకున్నా

కృతి శెట్టి

'ఉప్పెన' సినిమాలో బేబమ్మగా కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన కృతి శెట్టి నటించిన తాజా చిత్రం 'అన్నగారు వస్తారు'. ఈ నెల 12న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఆమె.. పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కెరీర్ తొలినాళ్లను గుర్తుచేసుకున్నారు. సోషల్ మీడియాలో ట్రోలింగ్ వల్ల చాలా ఇబ్బందులకు గురైనట్లు తెలిపారు. 'నేను నటించిన తొలి సినిమా 'ఉప్పెన' నా జీవితాన్ని మార్చేసింది. ఆ సినిమా నుంచి చాలా నేర్చుకున్నాను. ఎప్పుడూ ఇది చేయడం కష్టం అని చెప్పలేదు. కానీ నటిగా సినిమాల విషయంలో నాకంటూ కొన్ని అంచనాలు ఉన్నాయి. దాంతో ఒత్తిడి ఉండేది. ఆ ఒత్తిడి వల్ల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నాను. దాంతో నా తల్లిదండ్రులు 'కష్టంగా ఉంటే సినిమాలు మానేయి' అని సలహా ఇచ్చారు. దీంతో సినిమాలు చేయడం మానేద్దాం అనుకున్నాను. కానీ 'ఉప్పెన' సినిమాతో వచ్చిన ప్రేక్షకాదరణతో ఇక వెనుదిరిగి చూసుకోలేదు' అని చెప్పారు. కార్తీ కథానాయకుడిగా నటించిన 'అన్నగారు వస్తారు' చిత్రాన్ని నలన్ కుమారస్వామి తెరకెక్కించారు.

ఎన్టీఆర్ వ్యక్తిగత హక్కులు కాపాడండి

- మూడు రోజుల్లో చర్యలు తీసుకోండి
- సోషల్ మీడియా, ఈ - కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు ఢిల్లీ హైకోర్టు ఆదేశం



జూనియర్ ఎన్టీఆర్ వ్యక్తిగత హక్కులు కాపాడాలని సోషల్ మీడియా, ఈ - కామర్స్ ప్లాట్‌ఫామ్‌లను ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. మూడురోజుల్లో చర్యలు తీసుకోవాలని తేల్చి చెప్పింది. తన వ్యక్తిగత హక్కుల ఉల్లంఘన, పరువునష్టం కలిగించే అంశాల నుంచి ఉపశమనం కల్పించాలని జూనియర్ ఎన్టీఆర్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ఆయన తరఫున న్యాయవాది శివ్ వర్మ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ మన్మీత్ ప్రీతమ్ సింగ్ అరోరా నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం విచారించింది. జూనియర్ ఎన్టీఆర్ తరఫున సీనియర్ న్యాయవాది జె సాయి దీపక్ వాదనలు వినిపించారు. ఈ -కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా సంస్థల్లో అనేక విషయాలు జూనియర్ ఎన్టీఆర్ హక్కులను ఉల్లంఘించేలా ఉన్నాయని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పరువుకు భంగం కలిగించేలా జరుగుతున్న చర్యలను తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఇంటర్ మీడియేటర్ గైడ్‌లైన్స్, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) - 2021 నిబంధన ప్రకారం.. జూనియర్ ఎన్టీఆర్ దావాను ఫిర్యాదుగా పరిగణిస్తున్నట్టు తెలిపింది. ఫిర్యాదుపై మూడురోజుల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ ఈ - కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, సోషల్ మీడియా సంస్థలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ డిసెంబర్ 22కు వాయిదా వేసింది.

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి)

ఆకట్టుకునేలా...



కిరణ్, అక్స ఖాన్, అలేఖ్య రెడ్డి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'ఆర్‌కే దీక్ష'. బీఎస్ రెడ్డి సమర్పణలో ఆర్‌కే ఫిల్మ్స్, సిగ్ధ క్రియేషన్స్ బ్యానర్‌పై డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ను హీరో సుమన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఈ సినిమాలో దేశ సైనికుల గురించి గొప్పదనాన్ని తెలిపేలా అద్భుతమైన పాట ఉంది. సినిమాలోని ప్రతీ సన్నివేశం ఆకట్టుకుంటుంది' అని అన్నారు. ఆర్ కే గౌడ్ మాట్లాడుతూ 'ఈ చిత్రం నాకెంతో ప్రత్యేకం. అందరి హృదయాలను బరువెక్కించే భావోద్వేగాలు ఈ సినిమాలో ఉన్నాయి. విజయంపై నమ్మకముంది' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్, నిర్మాతల మండలి కార్యదర్శి తుమ్మల ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆద్యంతం నవ్వించే కథ



తరుణ్ భాస్కర్, ఈషా రెబ్బ ప్రధాన పాత్రధారులుగా నూతన దర్శకుడు ఏ.ఆర్.సజీవ్ తెరకెక్కిస్తోన్న విలేజ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఎస్.ఒరిజినల్స్, మూవీ వెర్స్ స్టూడియోస్ బేనర్లపై సృజన్ యరబోలు, వివేక్ కృష్ణని, అనుప్ చంద్రశేఖరన్, సాధిక్ షేక్, నవీన్ శనివరపు, కిశోర్ జాలాది, బాల సౌమిత్రి నిర్మిస్తున్నారు. జనవరి 23న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. సోమవారం నిర్వహించిన వేడుకలో టీజర్‌ను మేకర్స్ ఆవిష్కరించారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ టీజర్‌లో..స్వార్థపూరిత స్వభావం గల ధనవంతుడైన చేపల వ్యాపారి అంబటి ఓంకార్ నాయుడి చుట్టూ కథ సాగుతుంది. కార్యక్రమంలో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ 'ఈ సినిమాతో బ్రహ్మాజీకి మంచి పేరు వస్తుంది. ఈ సినిమా గోదావరి యాస, సాంస్కృతికి అద్దం పడుతూ గొప్ప అనుభూతిని ఇవ్వడంతో పాటు ఆద్యంతం నవ్వులు పంచుతుంది' అని అన్నారు.

రాజమండ్రి నాది.. వరంగల్ నాది
- తరుణ్ భాస్కర్

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో అమర గాయకుడు ఎస్పీ బాల బాలసుబ్రహ్మణ్యం విగ్రహ ప్రతిష్ఠ వివాదంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు తరుణ్ భాస్కర్ స్పందించారు. 'ఈ విషయంలో నా అభిప్రాయాన్ని తెలియజేస్తా.. పాలన పరంగా మనం వేరుగా ఉండొచ్చు. సంస్కృతి, సంప్రదాయాల పరంగా మాత్రం మనమంతా ఒక్కటే. ఆంధ్రా, తెలంగాణ అని కాకుండా మనదేశంలో గొప్ప నటులు, టెక్నీషియన్లు ఉన్నారు. రెండు రాష్ట్రాల నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. రాజమండ్రి నాది..వరంగల్ నాది... సినిమా ద్వారా అందరికీ ప్రేమను పంచుదాం' అని అన్నారు.

అద్భుతమైన సినిమా



క్రాంతి, అవితేజ్, ప్రదీప్, సుపర్ణ, పవని ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఫెయిల్యూర్ బాయ్స్'. వెంకటత్రినాథ్ రెడ్డి ఉసిరిక దర్శకత్వంలో వీఎస్ఎస్‌కుమార్, ధనశ్రీనివాస్ జామి, లక్ష్మీ వెంకట్ నిర్మించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నటుడు బాబు మోహన్ మాట్లాడుతూ 'సినిమా అద్భుతంగా ఉండబోతోంది. సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. 'ప్రేక్షకులను ఆకట్టుకునే ఫీల్‌గుడ్ చిత్రమిది' అని వెంకటత్రినాథ్ రెడ్డి ఉసిరిక చెప్పారు.

ఊహించని చీకటి ప్రపంచం



త్రిగుణ్, 'రాజువెడ్స్ రాంబాయి' ఫేమ్ అఖిల్‌రాజ్, హెబ్బా పటేల్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన హారర్ థ్రిల్లర్ 'ఈశా'. నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమవేంకటేశ్వర రావు నిర్మించారు. బన్నీ వాస్ వర్క్స్, వంశీ నందిపాటి ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్స్‌పై బన్నీ వాసు, వంశీ నందిపాటి చిత్రాన్ని ఈ నెల 12న విడుదల చేస్తున్నారు. సోమవారం ఈ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. 'మీరు ఊహించని చీకటి ప్రపంచం మరొకటి ఉంది' అనే సంభాషణతో మొదలైన ట్రైలర్ ఆకట్టుకుంది.

TELANGANA RISING 2047




గ్లోబల్ సమ్మిట్‌లో ఈవీ వెహికల్‌ను ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్; స్వయంగా కారు నడుపుతున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి

తెలంగాణ నం. 1

రాబోయే పదేళ్లలో మా ప్రభుత్వ లక్ష్యం ఇదే

దేశంలో, ప్రపంచంలో అత్యుత్తమంగా తీర్చిదిద్దుతాం

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే పదేళ్లలో తెలంగాణను దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన.. ప్రపంచంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. జీడీపీలో ప్రస్తుతం 5 శాతంగా ఉన్న తెలంగాణ వాటాను 2047 నాటికి పది శాతానికి చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అభివృద్ధి విషయంలో చైనా, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్ దేశాలే తమకు ప్రేరణ అని, ఆయా దేశాలతోనే ఇప్పుడు తాము పోటీ పడాలని భావిస్తున్నామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్' అని స్పష్టం చేశారు. ఈ ప్రయాణంలో తమకు సంపూర్ణ మద్దతు ఇచ్చి.. రైజింగ్‌లో భాగస్వాములు కావాలని కోరారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ - 2025 ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి కీలకోపన్యాసం చేశారు. "దేశానికి స్వాతంత్ర్యం తర్వాత మన నాయకులు కొత్త రాజ్యాంగాన్ని రూపొందించి భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ వేశారు. అలాగే, మేం కూడా తెలంగాణ భవిష్యత్తు కోసం రోడ్ మ్యాప్ రూపొందించాలని అనుకున్నాం. ఇందుకు మహాత్మా గాంధీ, అంబేడ్కర్, ఇతర రాజ్యాంగ నిర్మాతల నుంచి ఎంతో స్ఫూర్తిని పొందాం.



తెలంగాణ ప్రజలు దశాబ్దాలుగా ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటాలు చేశారు. చివరకు, 2014లో యూపీఏ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ నాయకత్వంలో రాష్ట్ర ఏర్పాటు కల సాకారమైంది. దేశంలో యువ రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 2047 నాటికి వందేళ్లు పూర్తి కానున్న నేపథ్యంలో అప్పటికి మనం ఏం సాధించగలమో చెప్పాలని నేను నిపుణులను కోరాను. అప్పుడే 'తెలంగాణ రైజింగ్- 2047' దార్శనికతకు బీజం పడింది. మనం ఏదైనా గొప్పగా చేయాలని భావించినప్పుడు తెలంగాణ సంస్కృతిలో భాగంగా ముందుగా దేవుళ్ల ఆశీర్వాదం తీసుకుంటాం. ప్రజల మద్దతూ కోరతాం. భవిష్యత్తు కోసం మన కలలను నెరవేర్చుకోవడానికి ప్రజల ఆలోచనలు, అంచనాలు తెలుసుకున్నాం. అధికారులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, నీతి ఆయోగ్ నిపుణుల సహాయం తీసుకున్నాం. ఈ విజన్ రూపొందించడంలో సహాయపడిన వారందరికీ ధన్యవాదాలు" అని వ్యాఖ్యానించారు. అన్ని రంగాలకు చెందిన ప్రతినిధులు సదస్సుకు రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఇక్కడికి వచ్చిన వ్యాపారవేత్తలు, కార్పొరేట్ దిగ్గజాలు, విధాన నిర్ణేతలు, దౌత్యవేత్తలు, ప్రభుత్వ అధికారులు, నిపుణులకు ధన్యవాదాలు తెలిపారు. వారి సూచనలు, సలహాలు, అభిప్రాయాలను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. "తెలంగాణలో అపారమైన అవకాశాలు ఉన్నాయి. సానుకూల వాతావరణమూ ఉంది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2034 నాటికి ఒక ట్రిలియన్.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించాం. దేశ జనాభాలో రాష్ట్ర జనాభా 2.9 శాతం. కానీ, జీడీపీలో 5 శాతం వాటాను తెలంగాణ అందిస్తోంది. 2047 నాటికి దీనిని 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. విజన్‌లో భాగంగా తెలంగాణను సేవలు, తయారీ, వ్యవసాయ రంగాలుగా విభజించామని, ఇలా మూడు భాగాలుగా విభజించి ప్రాంతాలవారీగా అభివృద్ధి లక్ష్యాలను నిర్ధేశించుకున్న మొదటి రాష్ట్రం దేశంలో తెలంగాణేనని అన్నారు. ఇందులో భాగంగానే కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్), పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ (రేర్) మోడళ్లను నిర్దేశించుకున్నామని చెప్పారు.

గ్వాంగ్ డాంగ్ ప్రావిన్స్ స్ఫూర్తిగా..

"గ్వాంగ్ డాంగ్ ప్రాంతం చైనాలోని ప్రావిన్స్‌లు అన్నిటికంటే పెద్దది. గడిచిన 20 ఏళ్లలో ఆ ప్రావిన్స్ ప్రపంచంలోనే అత్యధిక పెట్టుబడులను, వృద్ధి రేటును సాధించింది. తెలంగాణలో మేం కూడా అదే నమూనాను అనుసరించాలని భావిస్తున్నాం. ఈ విజన్ కష్టంగా అనిపించవచ్చు. కానీ, సాధించగలం. ఈ విషయంలో మా టీమ్‌కు నేను చెప్పేదొక్కటే..! కష్టంగా ఉంటే.. వెంటనే చేపడదాం! అసాధ్యం అని అనుకుంటే.. కొంత గడువు తీసుకుందాం" అని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. తెలంగాణ రైజింగ్ ప్రయాణంలో సహకరించడానికి, పెట్టుబడి పెట్టడానికి తమకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని ప్రతినిధులను కోరారు. నిన్నటి కంటే ఇవాళ తాను ఎక్కువ విశ్వాసం.. నమ్మకంతో ఉన్నానని, మీరంతా ఈ ప్రయాణంలో భాగస్వాములుగా ఉండాలని ఆశిస్తున్నానని చెప్పారు. అందరి మద్దతుతో లక్ష్యాలన్నింటినీ సాధించగలమని బలంగా నమ్ముతున్నానని చెప్పారు. తెలంగాణ రైజింగ్ అనేది అన్‌స్టాపబుల్ అని, వచ్చి దానిలో భాగస్వాములు కావాలని కోరారు.



రేవంత్ విజన్‌తో 'సరికొత్త తెలంగాణ'

"సీఎం రేవంత్‌రెడ్డి విజన్ చూస్తుంటే.. భవిష్యత్తులో 'సరికొత్త తెలంగాణ'ను చూస్తామన్న నమ్మకం కలుగుతోంది. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 20లక్షల మంది రైతుల రుణమాఫీ, ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు అభినందనీయం. తెలంగాణ విజయబాటలో నడుస్తుందన్న నమ్మకం సీఎం రేవంత్‌రెడ్డి, ఆయన బృందం ముఖాల్లో ఆత్మవిశ్వాసం రూపంలో వ్యక్తమవుతోంది. గత రెండేళ్లలో వైద్య రంగాన్ని పునర్నిర్మించడం, నాణ్యమైన విద్యకు ప్రాధాన్యమివ్వడం అభినందించాల్సిన అంశాలు. 2034 నాటికి తెలంగాణను 'వన్ ట్రిలియన్ డాలర్' ఎకానమీగా మార్చాలన్న విజన్ అసాధ్యమేమీ కాదు. 'వికసిత్ భారత్'లో తెలంగాణది ప్రధాన పాత్ర అవుతుంది. 'నీ జీవితంలో నువ్వు చూసిన అత్యంత నిరుపేద, అట్టడుగు మనిషి ముఖాన్ని గుర్తుతెచ్చుకో. నువ్వు చేసే చట్టం, నీ విధానాలు ఆ మనిషి ముఖంలో చిరునవ్వు తేగలిగితేనే దాన్ని అమలు చెయ్యి. లేదంటే చెత్తబుట్టలో పడెయ్యి' అన్న మహాత్మాగాంధీ సూత్రాన్ని అనుసరించడమే సరైన పాలన అవుతుంది.

- నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి



సమ్మిట్ ప్రాంగణంలో సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి, దుద్దిళ్ల, పొన్నం, కోమటిరెడ్డితో హీరో నాగార్జున

జీడీపీలో 10% వాటాయే లక్ష్యం

దృఢమైన సంకల్పం, దార్శనికతతో ముందుకు..

అదనంగా 20 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం

ఇంధన రంగంపై ప్యానల్ చర్చలో భట్టి విక్రమార్క

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దేశ జీడీపీ (స్థూల జాతీయ ఉత్పత్తి)లో తెలంగాణ వాటా 10 శాతంగా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని.. 2047 నాటికి 3 లక్షల కోట్ల డాలర్ల (3 ట్రిలియన్) ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు. ఇంధన రంగంపై జరిగిన ప్యానల్ చర్చల్లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధిపై ఒక దార్శనికతతో ముందుకు సాగుతున్నామని, దీని వెనుక స్పష్టమైన జాతీయవాద దృక్పథం, ప్రయోజనం, దృఢమైన సంకల్పం ఉన్నాయని చెప్పారు. అభివృద్ధి అందరికీ సమానంగా అందేలా చూడటంతోపాటు పర్యావరణానికి మేలు చేసేదిగా, సుస్థిరంగా నిలిచేలా ఉండాలనేదే తమ అభిమతమని తెలిపారు. "విద్యుత్ అనేది మా దార్శనికతలో విడదీయరాని అంశం. మా సంకల్పానికి ఒకరకంగా గుండెకాయ వంటిది. పరిశ్రమలు రావాలన్నా, ఉద్యోగాలు పెరగాలన్నా, వ్యవసాయం అభివృద్ధి చెందాలన్నా, జీవితం బాగుండాలన్నా విద్యుత్ రంగం పాత్ర కీలకం. ఇందులోనూ పర్యావరణ హిత ఇంధనాలు, వాహనాలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. 2030 నాటికి దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్సుల వ్యవస్థ హైదరాబాద్‌లో ఉండాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఇప్పటికే ఉన్న 11.4 గిగావాట్ల (11,400 మెగావాట్ల) పునరుత్పాదక విద్యుత్‌కు అదనంగా మరో 20 గిగావాట్ల (20 వేల మెగావాట్ల) విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం సంతరించుకునే దిశగా పనిచేస్తున్నాం. విద్యుత్ రంగంలో ఇప్పటికే చాలా సాధించాం. తలసరి విద్యుత్ వినియోగంలో దేశంలోని టాప్ రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. ప్రభుత్వం నిర్దేశించుకున్న అభివృద్ధి లక్ష్యాలు చేరుకోవాలంటే.. 2047 నాటికి 1.39 లక్షల మెగావాట్ల విద్యుత్ అవసరం. ఈ డిమాండ్‌ను సాధారణ పద్ధతుల్లో తీర్చలేం. ఇందుకోసం మరిన్ని సౌర, థర్మల్ ప్లాంట్లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ వ్యవస్థలు అవసరం" అని భట్టి చెప్పారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడానికి గ్రీన్ బాండ్ల జారీ, ప్రత్యేకంగా రుణాల సమీకరణ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. రాష్ట్రంలోని కోల్ బెల్ట్‌ను ఆర్థిక కేంద్రాలుగా మారుస్తామన్నారు. తెలంగాణ విద్యుత్ వ్యవస్థలో సమూల మార్పులు చేయాలనే అంశంలో రాజీ లేదని ప్రకటించారు.



రక్షణ, అంతరిక్ష రంగాలకు హైదరాబాదే బెస్ట్

- ఈ రంగాల్లో గ్లోబల్ హబ్‌గా ఎదగనున్న నగరం
- డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి
- రక్షణ రంగ అభివృద్ధికి సూచనలివ్వండి : మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రక్షణ, అంతరిక్ష రంగాల్లో పరిశోధన/అభివృద్ధి(ఆర్‌అండ్‌డీ)తో పాటు ఉత్పత్తుల పరంగా హైదరాబాద్ నగరం ప్రపంచానికి కేంద్రంగా మారనుందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి తెలిపారు. ఈ రంగాల్లో మౌలిక వసతుల కల్పనతోపాటు మరింత వేగంగా ప్రగతి సాధించేందుకు నిపుణులు సూచనలు ఇవ్వాలని కోరారు. సతీష్‌రెడ్డి అధ్యక్షతన రక్షణ, అంతరిక్ష రంగాలపై ప్యానల్ చర్చ జరిగింది. ఈ చర్చలో మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఈడీ మసూద్ హుస్సేనీ, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సీఎండీ మాధవరావు, బ్రహ్మోస్ ఏరోస్పేస్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జయతీర్థ్ రాఘవేంద్ర జోషి, అనంత్ టెక్నాలజీస్ ఎండీ సుబ్బారావు, స్కైరూట్ ప్రతినిధి నాగభరత్, సాఫ్రాన్ కంపెనీ సీఈవో జితేంద్ర గవాంకర్ పాల్గొన్నారు. సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలోని రక్షణ, అంతరిక్ష రంగ పరిశ్రమలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏం ఆశిస్తున్నాయో నివేదిక రూపంలో అందించాలని సూచించారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చటంలో రక్షణ, అంతరిక్ష రంగాలు కీలకపాత్ర పోషిస్తాయని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు వాడే హెలికాప్టర్‌లోని పరికరాలు హైదరాబాద్‌లోనే తయారయ్యాయని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మసూద్ హుస్సేనీ తెలిపారు. రాఫెల్ విమాన ఫ్యూజ్‌లేజ్ లలో 50 శాతం హైదరాబాద్‌లోనే తయారు చేస్తున్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో మరో మూడు బీడీఎల్ యూనిట్లు: మాధవరావు

రానున్న రోజుల్లో తెలంగాణలో బీడీఎల్ మరో మూడు యూనిట్లను నెలకొల్పనుందని ఆ సంస్థ సీఎండీ మాధవరావు ప్రకటించారు. రాష్ట్రంలో 3,500 కంపెనీలు రక్షణ ఉత్పత్తులను అందించడానికి 25 పెద్ద కంపెనీలతో ఒప్పందాలు చేసుకోగా, వాటిలో 1,500 వరకు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా కంపెనీలు ఉన్నాయని తెలిపారు. హైదరాబాద్ నగరం రక్షణ, అంతరిక్ష పరిశ్రమకు హబ్‌గా మారిందని చెప్పారు. అస్త్ర క్షిపణి తయారీ కోసం త్వరలో మెదక్‌లో 1,000 ఎకరాల్లో యూనిట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో ఇబ్రహీంపట్నంలో కూడా 500 ఎకరాల్లో ఒక యూనిట్‌తోపాటు పరీక్షా కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రంలో కోర్ ఇంజినీరింగ్ (మెటలర్జీ, ఎలక్ట్రానిక్స్, మెకానికల్) రంగంలో నిపుణులు దొరకడం లేదని, ఈ విషయంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని బ్రహ్మోస్ ఏరోస్పేస్ డీజీ జయతీర్థ్ రాఘవేంద్ర జోషి కోరారు. రక్షణ రంగ కంపెనీల ఏర్పాటుకు దేశంలో మరే రాష్ట్రానికి లేని అనుకూలతలు తెలంగాణకు ఉన్నాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలకు శాటిలైట్ ఆధారిత టెక్నాలజీ బదిలీ కావాల్సిన అవసరం ఉందని అనంత్ టెక్నాలజీస్ ఎండీ సుబ్బారావు అభిప్రాయపడ్డారు. దేశంలో ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్‌ను హైదరాబాద్‌లోనే అభివృద్ధి చేసినట్లు స్కైరూట్ సంస్థ ప్రతినిధి నాగభరత్ గుర్తుచేశారు. రాఫెల్, ఫాల్కన్ విమానాల ఇంజిన్ల విడిభాగాలను హైదరాబాద్‌లో ఉత్పత్తి చేస్తున్నామని సాఫ్రాన్ కంపెనీ సీఈవో జితేంద్ర గవాంకర్ వెల్లడించారు.

తెలంగాణలో ఏరో స్పేస్ వర్సిటీ ఏర్పాటు చేయాలి: సతీష్‌రెడ్డి

తెలంగాణలో ఏరో స్పేస్ యూనివర్సిటీని ఏర్పాటుచేయాలని సతీష్ రెడ్డి సూచించారు. వర్సిటీ ఏర్పాటువల్ల ఈ రంగంలో రాష్ట్రం మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ప్యానల్ చర్చ అనంతరం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'రాష్ట్రంలో ఏరోస్పేస్ అభివృద్ధిపై ప్రభుత్వం ఒక ఆలోచనతో ఉంది. అందుకోసమే సమ్మిట్‌లో ఈ అంశంపై ప్రత్యేకంగా చర్చ నిర్వహించింది. అంతరిక్ష రంగంలో ప్రపంచ స్థాయి తయారీదారుగా రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లాలనేదానిపై చర్చ జరిగింది. రాష్ట్ర యువతలో ఏరోస్పేస్ మాన్యుఫ్యాక్చరింగ్‌కు కావాల్సిన నైపుణ్యాలను పెంచాలి. అందుకోసం ఏరోస్పేస్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సూచించాం. దీనిపై ప్రభుత్వం ఒక నిర్ణయానికి వస్తుందని ఆశిస్తున్నాం' అని తెలిపారు.

ప్రపంచం చూపు... తెలంగాణ వైపు



ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ అడుగులు వేస్తోంది. ఇక్కడి అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ప్రపంచ స్థాయి సంస్థలు ముందుకు వస్తున్నాయి. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా రూపొందించిన ప్రణాళికే తెలంగాణ రైజింగ్-2047. ఈ లక్ష్యాన్ని తెలంగాణ సాధిస్తుందన్న విశ్వాసం నాకు ఉంది. వికసిత్ భారత్-2047లో తెలంగాణ కీలక పాత్ర పోషించనుండడం అభినందనీయం. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో ప్రగతే లక్ష్యంగా పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. సౌర విద్యుత్ ప్రాజెక్టులు, బస్సుల నిర్వహణ, రిటైల్ వ్యాపారాలతో మహిళలే ఆర్థిక వ్యవస్థలో చురుకైన భాగస్వామ్యులుగా మారుతున్నారు. రానున్న రోజుల్లో జరగనున్న అభివృద్ధితో తెలంగాణ ముఖచిత్రమే మారిపోనుంది. యువతలో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఏర్పాటైన స్కిల్ యూనివర్సిటీ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. మహిళలు, రైతులు, యువత, చిన్నారుల అభ్యున్నతే లక్ష్యంగా సమ్మిళిత అభివృద్ధిని సీఎం రేవంత్ రెడ్డి ఎంచుకున్నారని ప్రశంసించారు. మౌలిక సదుపాయాలు, విమానాశ్రయాలు, పునరుత్పాదక ఇంధనం, రవాణా నెట్‌వర్క్‌లు... 3 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం వైపు ఆధునిక తెలంగాణను నడిపించడానికి చోదకం కానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న స్థిరమైన, స్పష్టమైన విధానాల వల్లే భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. గిగ్ వర్కర్స్ పాలసీ, విశ్రాంతి కేంద్రాల ఏర్పాటు వంటివి భవిష్యత్తు దృక్పథానికి ఉదాహరణలుగా నిలుస్తున్నాయి.

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నినాదం కాదు.. కార్యాచరణ ప్రణాళిక



తెలంగాణ విజన్ డాక్యుమెంట్ కేవలం నాలుగు గోడల మధ్య కూర్చొని తయారు చేసింది కాదు. ప్రముఖుల సలహాలు, నిపుణులతో చర్చించడమే కాకుండా ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన పత్రమది. అంటే, ఈ విజన్ డాక్యుమెంట్ ప్రభుత్వ పత్రం మాత్రమే కాదు.. అది ప్రజా పత్రం కూడా. అలాగే, '3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ' అనేది కేవలం నినాదం మాత్రమే కాదు. తెలంగాణలోని ప్రతీ జిల్లా, ప్రతీ రంగాన్ని అభివృద్ధి చేయాలన్న కార్యాచరణ ప్రణాళిక అందులో ఉంది. ఈ విజన్ డాక్యుమెంట్ ఒక సంవత్సరం కోసమో, ఎన్నికల కోసమో కాదు. 2047 నాటికి రాష్ట్రం ఎలా ఉండాలో ఊహించి ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి దీర్ఘకాలిక ప్రణాళికలతో దీన్ని రూపొందించాం. అలాగే, తెలంగాణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన సంస్థల పేర్లను.. రోడ్లు, మౌలిక వసతులకు పెడుతున్నాం. ఓ యువకుడు 'టాటా అవెన్యూ' లేదా 'గూగుల్ స్క్వేర్' దగ్గరికి వెళ్తుంటే... అది ఒక రోడ్డు పేరు అనుకోవద్దు. యువతకు అదో ఉపాధి మార్గమని భావించాలి. అలాంటి ప్రేరణను కలిగించడమే మా ప్రభుత్వ ఉద్దేశం.

- భట్టి విక్రమార్క, డిప్యూటీ సీఎం

భవిష్యత్తు కోసం ఎదురుచూడం.. నిర్మిస్తాం



"భవిష్యత్తు కోసం ఎదురుచూడకుండా.. దానిని మనమే నిర్మించాలన్నదే తెలంగాణ ప్రభుత్వ సంకల్పం. మేం వేసే ప్రతి అడుగు, చేసే ప్రతి ఆలోచన భావితరాల అవసరాల కోసం, రేపటి తెలంగాణ కోసమే. ఫీనిక్స్ పక్షి స్ఫూర్తితో.. సృజనాత్మకత, మానవ మూలధనం, స్థిరత్వం, అంతర్జాతీయ పెట్టుబడులకు నెలవుగా తెలంగాణను మార్చాలనే లక్ష్యంతోనే 'తెలంగాణ రైజింగ్'కు శ్రీకారం చుట్టాం. 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చేందుకు దార్శనికతతో కూడిన అడుగులు వేస్తున్నాం. భౌగోళిక విస్తీర్ణం, జనాభాలో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ చిన్నదే అయినా.. దేశ జీడీపీలో 5 శాతం వాటాను కలిగి ఉంది. 2024-2025లో రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధిరేటు 10.1 శాతం కాగా, జాతీయ సగటు 9.9 శాతంగా నమోదైంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.3.79 లక్షలు, జాతీయ సగటు కంటే 1.8 రెట్లు ఎక్కువ. రాష్ట్ర సేవల రంగం వృద్ధిరేటు 11.9 శాతం కాగా, జాతీయ సగటు 10.7 శాతంగా ఉంది. రాష్ట్ర పారిశ్రామిక జీఎస్‌వీఏ 12.6 శాతం వృద్ధిరేటుతో రూ.2.46 లక్షల కోట్ల నుంచి రూ.2.77 లక్షల కోట్లకు పెరిగింది. దేశంలోనే తొలి ఏఐ ఆధారిత గ్రామంగా మారిన మంథని నియోజకవర్గంలోని ఒక మారుమూల గ్రామం 'రేపటి తెలంగాణ'కు మార్గదర్శిగా నిలిచింది."

- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రపంచంతోనే తెలంగాణ పోటీ



"రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్నందుకు సీఎం రేవంత్, మంత్రివర్గానికి అభినందనలు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎంచుకున్నది గ్లోబల్ విజన్. ఈ విజన్ చాలా గొప్పది. తెలంగాణ, బెంగళూర్ మధ్య పోటీ లేదు. తెలంగాణ ప్రపంచంతో పోటీ పడుతోంది. భారీ ఎగుమతులు, గ్లోబల్ కెపాసిటీ సెంటర్‌లకు కేంద్రంగా బెంగళూర్ ఉంది. హైదరాబాద్, బెంగుళూర్ దేశంలో అత్యంత శక్తివంతమైన నగరాలు. దేశ అభివృద్ధి కోసం దక్షిణాది రాష్ట్రాలన్నీ కలిసి పనిచేయాలి. దక్షిణ భారత దేశం జనాభాపరంగా చిన్నదే అయినా.. దేశ జీడీపీలో 31 శాతం వాటా ఉంది. 2030 నాటికి ఈ వాటా 40-45 శాతానికి పెరగనుంది. పెట్టుబడిదారుల్లో పూర్తి నమ్మకం ఉంది. అభివృద్ధి అనేది ఇంద్రజాలం కాదు. సంకల్పంతో నిజాయతీగా, కష్టపడి పనిచేస్తేనే సాధ్యమవుతుంది. సీఎం రేవంత్ మరింత బలపడాలి. సీఎం, మంత్రులు కలిసికట్టుగా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడాలి"

- కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

తెలంగాణ విజన్.. ప్రపంచానికి ఆదర్శం!



రైజింగ్ తెలంగాణ- 2047 విజన్.. ప్రపంచంలోని ఇతర నగరాలు, ప్రాంతాలకు కూడా ఆదర్శం. మానవ వనరుల సామర్థ్యాన్ని వెలికి తీసి, సామాజిక-ఆర్థిక పురోగతిని ఎలా సాధించాలనే దానికి తెలంగాణ రాష్ట్రం ఒక మోడల్‌గా నిలుస్తోంది. తెలంగాణతో కలిసి పనిచేయడానికి మేం అనేక కొత్త రంగాలను గుర్తించాం. ఐటీ, ఫైనాన్స్, లైఫ్ సైన్సెస్ రంగాల్లో తెలంగాణ రాష్ట్రం గ్లోబల్ హబ్‌గా నిలిచింది. ఈ రంగాలన్నీ కలిసి "తెలంగాణ రైజింగ్" విజన్‌కు బలమైన పునాదిని వేస్తున్నాయి. భారీస్థాయి పారిశ్రామిక ప్రాజెక్టులు మాత్రమే కాకుండా ఏఐ సిటీ, ఫ్యూచర్ సిటీ, బలమైన ఇన్నోవేషన్ వ్యవస్థ, స్థిరమైన అభివృద్ధిపై దృష్టిపెట్టిన అంశాలు ప్రత్యేకంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వ యంత్రాంగంతో కలిసి పని చేసేందుకు ఆసక్తిగా ఉన్నాం. విజన్- 2047 సాధన దిశగా తెలంగాణ రాష్ట్రం ముందుకు సాగాలని.. ఈ సమ్మిట్ విజయవంతం కావాలని కోరుకుంటున్నాం. 2026 జనవరిలో దావోస్‌లో జరిగే సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రిని ఆహ్వానిస్తున్నాం.

- జెరిమీ జుర్గెన్స్, మేనేజింగ్ డైరెక్టర్, వరల్డ్ ఎకనమిక్ ఫోరం

గ్రామీణ ప్రాంతాలకూ అభివృద్ధి విస్తరించాలి



"గ్లోబల్ సమ్మిట్ కేవలం ఒక సదస్సు కాదు.. భవిష్యత్తు తెలంగాణ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ప్రపంచానికి ఇచ్చిన ఆహ్వానం. పెట్టుబడులే కాకుండా.. సమ్మిళిత వృద్ధి, గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దిశగా ప్రభుత్వంతో కలిసి నడుస్తాం. రాష్ట్ర అభివృద్ధి అంతా హైదరాబాద్‌కే పరిమితం కాకూడదు. గ్రామీణ జిల్లాలకూ విస్తరించాలి. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తరఫున మేం హైదరాబాద్ వెలుపల కూడా దృష్టి సారిస్తాం. ప్రాంతీయ సమానతాభివృద్ధి, లింగ సమానత్వం, ఎంఎస్ఎంఈల బలోపేతమే మా ప్రధాన ఎజెండా. సుమారు 50 వేల నుంచి లక్ష మంది రైతులను ఎంఎస్ఎంఈల నిర్వాహకులుగా మార్చేందుకు మద్దతు ఇస్తాం. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో కొత్త అవకాశాలు సృష్టిస్తాం. సులభతర వాణిజ్యంతోపాటు వ్యాపార వ్యయం తగ్గించడంపై సర్కారు దృష్టి సారించడం శుభపరిణామం."

టీవీఎస్ దినేశ్, టీవీఎస్ లాజిస్టిక్స్ చైర్మన్, సీఐఐ మాజీ అధ్యక్షుడు

అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి



రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమంటే ఆర్థిక గణాంకాలను పెంచడం కాదు. సృష్టించిన సంపదలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడమే అభివృద్ధి. సమాజంలోని చివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందినప్పుడే 'తెలంగాణ రైజింగ్' అనే మాటకు నిజమైన సార్థకత చేకూరుతుంది. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వంటి భారీ లక్ష్యాలను నిర్దేశించుకోవడం మంచిదే. అయితే ఆచరణలో చిన్న చిన్న అడుగులే గొప్ప మార్పులకు నాంది పలుకుతాయి. అభివృద్ధికి సూచికగా విద్యారంగాన్ని, ముఖ్యంగా ప్రాథమిక విద్యను తీసుకోవాలి. నా దృష్టిలో ఒక నిర్దిష్టమైన లక్ష్యం ఎలా ఉండాలంటే.. మూడో తరగతి చదువుతున్న పిల్లల్లో కనీసం 80 శాతం మంది తమ గ్రేడ్ స్థాయికి తగినట్లుగా లెక్కలు చేయగలగాలి, చదవగలగాలి. ఇది సాధించగలిగే లక్ష్యం. అత్యంత కీలకమైన లక్ష్యం కూడా. ఇలాంటి ప్రాథమిక అంశాలే రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాదులు వేస్తాయి.

- ప్రొఫెసర్ అభిజిత్ బెనర్జీ, నోబెల్ బహుమతి గ్రహీత

TELANGANA RISING 2047

తెలంగాణ ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్న సమ్మిట్

అదానీ గ్రూప్ పోర్ట్స్ అండ్ సెజ్ ఎండీ కరణ్ అదానీ

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆత్మ విశ్వాసాన్ని ఈ సమ్మిట్ ప్రతిబింబిస్తోందని అదానీ గ్రూప్ పోర్ట్స్ అండ్ సెజ్ ఎండీ కరణ్ ఆదానీ అన్నారు. రాష్ట్రంలో అదానీ గ్రూప్ వివిధ రంగాల్లో పెట్టిన పెట్టుబడుల గురించి వివరించారు. ముఖ్యంగా.. గత మూడేళ్ల కాలంలో రాష్ట్రంతో బలమైన బంధాన్ని ఏర్పరచుకున్నట్టు వివరించారు. డిఫెన్స్, ఏరోస్పేస్ రంగంలో సేవలందించే దిశగా హైదరాబాద్ కేంద్రంగా ఏరో స్పేస్ పార్కును అభివృద్ధి చేశామన్నారు. దేశంలోనే తొలి లాంగ్ ఎండ్యూరెన్స్ యూఏవీ తయారీ కేంద్రం ఇదేనని గుర్తుచేశారు. ఇక్కడి నుంచి భారత సాయుధ దళాలకు, అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతులు చేస్తున్నామన్నారు. ఈ కేంద్రంలో 1500 మంది ఉపాధి పొందుతున్నారని తెలిపారు.



డిజిటల్ మౌలిక సదుపాయాలకు సంబంధించి రూ.2500 కోట్ల పెట్టుబడితో 48 మెగావాట్ల గ్రీన్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని.. అది కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత అభివృద్ధికి, క్లౌడ్ టెక్నాలజీకి, హైపెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్‌కు ఉపయోగపడుతుందన్నారు. దాదాపు రూ.4000 కోట్లతో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలను కలుపుతూ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. మణుగూరు, సూర్యాపేట, కొత్తగూడెం, ఖమ్మం వంటి జిల్లాలను కలుపుతూ 100 కిలోమీటర్లకు పైగా జాతీయ రహదారులు నిర్మించినట్లు చెప్పారు. సిమెంట్ తయారీ రంగంలో రూ.2 వేల కోట్లతో అత్యాధునిక సిమెంట్ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అదానీ గ్రూప్ నుంచి గత మూడేళ్లలో తెలంగాణలో తయారీ కేంద్రాల నిర్మాణంలో రూ.10 వేల కోట్ల పెట్టుబడులు పెట్టామని.. తద్వారా 7000 మందికి ఉపాధి కల్పించామని వివరించారు.

ఎరిక్ కంటే ఎక్కువ పెట్టుబడి పెడతారా?

కరణ్ ప్రసంగానికి ముందు.. ఆయన్ను ఆహ్వానిస్తూ.. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడారు. "మీకన్నా ముందు ప్రసంగించిన ఎరిక్ స్విడర్ తెలంగాణలో లక్ష కోట్లపెట్టుబడులు పెడుతున్నట్లు చెప్పారు. మీరు దాన్ని అధిగమిస్తారా.. అదే స్థాయిలో పెట్టుబడి పెడతారా?"అని చమత్కరించారు.

లక్ష కోట్ల పెట్టుబడి పెడతా

ఫ్యూచర్ సిటీ పెట్టుబడులకు అనుకూలమైన ప్రాంతం

20 ఏళ్ల క్రితం భారత్‌ను కేవలం కాల్ సెంటర్ల కేంద్రంగా చూసేవారు

ఇప్పుడు ప్రపంచ టెక్నాలజీని శాసించే వ్యక్తులు భారత్ నుంచే వస్తున్నారు

సాంకేతికతలో ప్రపంచానికి నాయకత్వం వహిస్తుందని నమ్ముతున్నా

తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన గౌరవం, ఆతిథ్యం మరువలేనివి

ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): భారత్ ఫ్యూచర్ సిటీలో రాబోయే పదేళ్లలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెడతానని ట్రంప్ మీడియా, టెక్నాలజీ గ్రూప్ డైరెక్టర్ ఎరిక్ స్విడర్ అన్నారు. పెట్టుబడులకు తెలంగాణ అనుకూలమైన ప్రాంతమన్నారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వం తరఫున అన్నిరకాల సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసా ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వ ప్రకటన పెట్టుబడులను ఆకర్షించేలా ఉందన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో ఎరిక్ మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం భారత్‌ను చూస్తే కేవలం కాల్ సెంటర్ల కేంద్రంగా కనిపించేదని, ఇప్పుడు ప్రపంచ టెక్నాలజీ రంగాన్ని శాసించే మేధావులు భారత్ నుంచే వస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ సంస్థల్లో ప్రతిభావంతులుగా భారతీయులు రాణిస్తున్నారని, రాబోయే రోజుల్లో సాంకేతికతలో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహిస్తుందని నమ్ముతున్నట్లు చెప్పారు. భావ వ్యక్తీకరణ ప్రతి మనిషికీ ప్రాథమిక హక్కు అని, ఆ స్వేచ్ఛ అందరికీ ఉండాలనే కారణంతోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అతిపెద్ద వాటాదారుగా ఉన్న ట్రూ సోషల్ మాధ్యమాన్ని పబ్లిక్‌లోకి తీసుకొచ్చేందుకు రెండేళ్ల పోరాటం చేశారని గుర్తు చేశారు. గ్లోబల్ సమ్మిట్ వేదికపై ప్రముఖులతోపాటు తనకు ఇచ్చిన గౌరవాన్ని, ప్రభుత్వం ఇచ్చిన ఆతిథ్యాన్ని మరువలేనని ఎరిక్ తెలిపారు. ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించి తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఎరిక్ స్విడర్ ప్రసంగానికి ముందు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఓ ప్రముఖ వీధికి డొనాల్డ్ ట్రంప్ పేరు పెడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారని గుర్తు చేశారు.



ట్రంప్ వ్యాపార భాగస్వామి.. ఎరిక్ స్విడర్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాపారాల్లో ఎరిక్ స్విడర్ ఒక భాగస్వామి. అయితే రక్త సంబంధీకుడు కాదు. ప్రస్తుతం ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్‌కు డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఈ సంస్థ డొనాల్డ్ ట్రంప్‌కు చెందిన ట్రూత్ సోషల్ మాధ్యమానికి మాతృసంస్థ. అంతకుముందు ఎరిక్.. డిజిటల్ వరల్డ్ ఆక్విజిషన్ కార్పొరేషన్ (డీడబ్ల్యూఏసీ)లో ఇంటీరియం సీఈవోగా ఉండేవారు. ఆ తరువాత పూర్తి స్థాయి సీఈవో అయ్యారు. దీంతోపాటు డేటా సెక్యూరిటీ కంపెనీ రుబిడెక్స్ ఎల్ఎల్‌సీ అనే సంస్థకు కూడా సీఈవోగా ఉన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్, న్యూక్లియర్ సైన్స్‌లో పట్టభద్రుడు.

రాష్ట్ర వైద్య రంగంలో మా పెట్టుబడి 1,700 కోట్లు

అపోలో ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ శోభన కామినేని వెల్లడి



హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య రంగంలో వచ్చే మూడేళ్లలో 1,700 కోట్లు పెట్టుబడి పెడుతున్నామని.. ప్రోటాన్ థెరపీ, ఇన్నోవేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అపోలో ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ శోభన కామినేని తెలిపారు. తమ సంస్థ 'ఆస్క్ అపోలో' అనే ఐటీ మోడల్‌ను అభివృద్ధి చేసిందని.. ఆరోగ్య రంగంలో అంతర్జాతీయ స్థాయి సాంకేతికత జెమిని కంటే కూడా ఇది అద్భుతంగా పనిచేస్తోందని చెప్పారు. ఇది మన దేశ సత్తా, హైదరాబాద్ సృజనాత్మక శక్తి అని పేర్కొన్నారు. భారత్ అత్యంత వేగంగా సృజనాత్మక ఆవిష్కరణలను అందించగల దేశమని.. అందులోనూ తెలంగాణ ఉత్తమ వేదికగా మారిందని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ సహకారంతో ఆరోగ్య రంగం వేగంగా విస్తరిస్తోందని తెలిపారు. దేశంలోని ఫార్మా కంపెనీల్లో మూడోవంతు తెలంగాణలోనే ఉన్నాయని, ప్రపంచానికి ఎగుమతి అవుతున్న వ్యాక్సిన్లలో మూడో వంతు రాష్ట్రం నుంచే వెళ్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ఏర్పడిన జీనోమ్ వ్యాలీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, ఐడీపీఎల్ వంటి కంపెనీలు, ఇతర పరిశోధన సంస్థలు, ఇక్కడ మౌలిక వసతులే కారణమని చెప్పారు. "సీఎం రేవంత్‌రెడ్డి చాలా ఎనర్జిటిక్ లీడర్. ఆయన ఏం చేసినా అందులో ఒక ప్రత్యేక ఎనర్జీ కనిపిస్తుంది. ఆయన విజన్ చూస్తుంటే ఫుట్‌బాల్ లెజెండ్ మెస్సీతో కలిసి గోల్ కొట్టినంత కిక్ వస్తుంది. సీఎం రేవంత్ విజన్‌తో హైదరాబాద్ దేశంలోనే వేగంగా ఎదుగుతున్న నగరాల్లో ఒకటిగా మారింది" అని శోభన కామినేని పేర్కొన్నారు.

పెట్టుబడుల వేటలో బిజీగా ముఖ్యమంత్రి!

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడుల సాధన, వివిధ రంగాల్లో ఒప్పందాలే లక్ష్యంగా పారిశ్రామికవేత్తలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, నిపుణులతో సీఎం రేవంత్‌రెడ్డి విస్తృతంగా చర్చలు జరుపుతున్నారు. కొరియా ప్రతినిధులతో ఎలక్ట్రానిక్స్ గ్రీన్ ఎనర్జీలో పెట్టుబడులకు సంబంధించి చర్చలు జరిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు చెందిన మీడియా ప్రతినిధులతో భేటీ అయ్యారు. అమెజాన్ ప్రతినిధులు సీఎం రేవంత్‌తో సమావేశంలో తెలంగాణలో లాజిస్టిక్స్, రిటైల్ రంగాల విస్తరణపై ఆసక్తి చూపారు. ఐకియా సంస్థ ప్రతినిధులతో భేటీలో ఫర్నీచర్, టెక్స్‌టైల్ రంగాల్లో చిన్న, మధ్యతరహా పరిశ్రమల భాగస్వామ్యంపై సీఎం చర్చించారు. వియత్నాంకు చెందిన ప్రముఖ సంస్థ విన్ గ్రూప్ ప్రతినిధులతో సమావేశంలో ఎలక్ట్రిక్ వాహనాలు, హెల్త్‌కేర్ రంగంలో పెట్టుబడులపై చర్చలు జరిపారు. ఎలక్ట్రానిక్స్ రంగ ప్రతినిధులతో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో.. ఫ్యూచర్ సిటీలో ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ హబ్ స్థాపనపై చర్చించారు. మాన్యుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్, వేర్‌హౌజింగ్ రంగ ప్రతినిధులతో సమావేశమై చర్చలు జరిపారు. యూనివర్సిటీ ఆఫ్ లండన్‌తో ఉన్నత విద్యా భాగస్వామ్యానికి సంబంధించి ఎంవోయూ కుదిరింది. చివరగా ఆసియాన్ దేశాల రాయబారులు, వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు.

వికసిత్ భారత్-2047లో తెలంగాణదే కీలకపాత్ర



'వికసిత్ భారత్-2047'లో తెలంగాణ కీలక పాత్ర పోషించనుంది. తెలంగాణ ఎదుగుదలను ప్రపంచానికి చాటి చెప్పే వేదికగా గ్లోబల్ సమ్మిట్ నిలుస్తోంది. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత శక్తిమంతమైన దేశంగా భారత్ అవతరించింది. హైదరాబాద్ కేవలం తెలంగాణ రాజధాని మాత్రమే కాదు.. దేశ ఆర్థిక వ్యవస్థకు ఓ మూల స్తంభం లాంటిది. ఐటీ హబ్‌గా, ఇన్నోవేషన్ కారిడార్‌గా, ఫార్మాసూటికల్ క్యాపిటల్‌గా, ఏరోస్పేస్ టెక్నాలజీ సెంటర్‌గా పురోగమిస్తోంది. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని మరింత పెంచేందుకు అందరం కలిసి కట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. 2014 నుంచి 2025 వరకు దేశానికి 748.78 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అంతకుముందు దశాబ్దంతో పోలిస్తే 143 శాతం వృద్ధి నమోదైంది. గ్లోబల్ నార్త్, గ్లోబల్ సౌత్ కు మధ్య వారధిగా, భారత్ పెద్దన్న పాత్ర పోషిస్తోంది. గత పదేళ్లలో తెలంగాణకు గ్రాంట్లు, కేంద్ర ప్రాయోజిక పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాల రూపంలో 10లక్షల కోట్లకుపైగా నిధులు అందాయి.

- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

వంతారా స్థాయిలో కొత్త జూ పార్కు!



అక్కడున్న సదుపాయాలన్నీ ఇక్కడా ఉండాలి.. నెలాఖరులో వంతారాను సందర్శిస్తా: సీఎం రేవంత్

ఫ్యూచర్‌సిటీలో జూపార్కుపై వంతారాతో ఒప్పందం

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జంతువులకు వంతరాలో ఉన్న సదుపాయాలన్నీ ఫ్యూచర్ సిటీలో కొత్తగా ఏర్పాటు చేసే జూ పార్కులో ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కొత్త జూ పార్కుకు సంబంధించి సీఎం సమక్షంలో అటవీ శాఖ, ముఖేశ్ అంబానీకి చెందిన 'వంతారా' ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జంతువులకు సేవ అనే నినాదంతో వంతారా పనిచేస్తోందని, ఇది అభినందనీయమని అన్నారు. ఈ నెలాఖరులో తాను వంతారాను సందర్శిస్తానని చెప్పారు. ఫ్యూచర్‌సిటీలో అంతర్జాతీయ ప్రమాణాలతో కొత్తగా జూ ఏర్పాటు చేసే ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం వంతారాతో అవగాహనా ఒప్పందం చేసుకుంది. ఇందులో భాగంగా వంతారా నిర్వాహకులు కొత్త జూ రూపకల్పన, సాంకేతికత, అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులపై మార్గదర్శకత్వం అందించనున్నారు. వంతారా జూ ప్రపంచ స్థాయి జంతు సంరక్షణ, పునరావాస, శాస్త్రీయ నిర్వహణలో ప్రసిద్ధి చెందిన సంస్థ. అక్కడ అమలు చేస్తున్న వివిధ నమూనాలను తెలంగాణలో ప్రతిపాదిత కొత్త జూ కోసం ఉపయోగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో కొత్త జూ దేశంలోనేగాక ఆసియాలో ఒక ప్రత్యేక ఆకర్షణ, అంతర్జాతీయ మోడల్ జూగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.



సమ్మిట్ ప్రాంగణంలో తెలంగాణతల్లి వద్ద సీఎం రేవంత్, భట్టి, నాగార్జున

విన్ గ్రూప్ రూ.27 వేల కోట్లు

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయి. తొలి రోజు వచ్చిన పెట్టుబడుల్లో విన్ గ్రూప్ సంస్థ పునరుత్పాదక ఇంధనం, విద్యుత్తు వాహనాల పరికరాల తయారీ పరిశ్రమలకు సంబంధించి రూ.27 వేల కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. అలాగే బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ రూ.10 వేల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకున్నారు.

అమరరాజా రూ.9 వేల కోట్ల పెట్టుబడులు



తెలంగాణలో అమర రాజా కంపెనీ రూ.9 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుందని కంపెనీ అధినేత గల్లా జయదేవ్ అన్నారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'తెలంగాణలో రెండేళ్ల క్రితమే మా కంపెనీ కొంతమేర పెట్టుబడులు పెట్టింది. వచ్చే పదేళ్లలో 9 వేల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నాం. దాదాపు 6-7 వేల మందికి ఉపాధి లభిస్తుంది' అని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ చాలా బాగుందన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వ మద్దతు కావాలి

'ఆంధ్రజ్యోతి'తో డ్రిల్ మెక్ సీఈవో మార్కో టోజీ



హైదరాబాద్, డిసెంబరు 8, (ఆంధ్రజ్యోతి): గ్లోబల్ కంపెనీలకు మౌలిక సదుపాయాలు, ఆర్థిక అంశాలు, ఎగుమతులు, దిగుమతులు, కస్టమ్స్ అంశాల్లో తెలంగాణ ప్రభుత్వం సహకరించాలని డ్రిల్ మెక్ ఇంటర్నేషనల్ సీఈవో మార్కో టోజీ కోరారు. తెలంగాణలో తమ సంస్థ ఇప్పటికే డ్రిల్లింగ్ పరికరాల ఉత్పత్తి ప్లాంట్‌ను ప్రారంభించిందని, అందులో 600 మంది పనిచేస్తున్నారని తెలిపారు. మెగా ఇంజనీరింగ్ సంస్థ కూడా తమకు భారత్‌లో భాగస్వామి అని చెప్పారు. ఈ కంపెనీ విస్తరణపైనా ఆలోచన చేస్తున్నామని అన్నారు. భారత ప్రభుత్వం.. ప్రత్యేకించి తెలంగాణ ప్రభుత్వం ఇంధన రంగంలో వైవిధ్యం కోసం పనిచేస్తున్నాయని, గ్రీన్ ఎనర్జీ వైపు చూస్తున్నాయని, ఇది మంచి పరిణామమని పేర్కొన్నారు. హైదరాబాద్ బాగా అభివృద్ధి చెందుతోందని, ఇటలీకి చెందిన తాను భారత్‌లో తమ సంస్థ వ్యవహారాల కోసం మూడేళ్లుగా ఇక్కడే ఉంటున్నానని తెలిపారు.

కొరియా తర్వాత హైదరాబాదే మాకు కీలకం

'ఆంధ్రజ్యోతి'తో హ్యుందయ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్ యో చో



హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కొరియాలోని తమ ప్రధాన కార్యాలయం తరువాత హైదరాబాద్ తమకు కీలక కేంద్రమని ప్రముఖ కార్ల తయారీ కంపెనీ హ్యుందయ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్ యో చో అన్నారు. 30 ఏళ్ల క్రితం చెన్నైలో తొలి కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా తెలంగాణ, కొరియా ఆర్థిక సంబంధాలపై జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా తమకు ఐదు పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఉండగా.. భారత్ కేంద్రం హైదరాబాద్‌లో ఉందని చెప్పారు. ఇందులో 1200 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నట్లు తెలిపారు. అత్యుత్తమ మానవ వనరులు హైదరాబాద్ సొంతమని, అందుకే తమ విస్తరణ ప్రణాళికలకు తెలంగాణకు ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులు పెట్టే విషయంలో కంపెనీ సీరియస్‌గా ఆలోచిస్తోందన్నారు.

వ్యవసాయం, ఆయిల్‌పామ్‌ల్లో అవకాశాలు పుష్కలం

[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

ఖమ్మంలో సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్సు ఏర్పాటు

హైదరాబాద్ శివారుల్లో డెయిరీ ప్రాసెసింగ్ యూనిట్

గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామి

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ సంస్థ తెలంగాణలో నిర్మాణ, వ్యవసాయం.. అనుబంధ రంగాల్లో రూ.450 కోట్ల పెట్టుబడులు పెడుతుందని గోద్రెజ్ గ్రూప్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్ స్వామి చెప్పారు. రాకేశ్ స్వామి 'ఆంధ్రజ్యోతి'కిచ్చిన ఇంటర్వ్యూ.. ఆయన మాటల్లోనే.. 'వ్యవసాయం, ఆయిల్ పామ్ రంగాల అభివృద్ధి అవకాశాలు పుష్కలం. ఇప్పటికే కోకాపేట, రాజేంద్రనగర్‌లలో భారీ ప్రాజెక్టులు చేపట్టాం. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్లతో వచ్చే ఏడాది మేం ఏర్పాటు చేసే సమీకృత ఆయిల్ పామ్ కాంపెక్స్‌తో ప్రత్యక్షంగా 200 మంది, పరోక్షంగా 300 మందికి ఉపాధి లభిస్తుంది. రూ.150 కోట్ల అంచనాతో 40 ఎకరాల్లో హైదరాబాద్ శివార్లలో డెయిరీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు ప్రభుత్వంతో మంగళవారం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంటున్నాం. దీనివల్ల 300 మందికి ప్రత్యక్షంగా, 500 మందికి పరోక్ష ఉపాధి లభిస్తుంది. పారిశ్రామిక పెట్టుబడులకు తెలంగాణ వ్యూహాత్మక ప్రాంతం. పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహం అద్భుతం. సీఎం రేవంత్ రెడ్డి విజనరీ లీడర్. సింగిల్ విండో క్లియరెన్సులు, అన్ని పరిశ్రమలకు ఓపెన్ డోర్ పాలసీ ప్రకటించిన సీఎం రేవంత్‌కు ధన్యవాదాలు. రాష్ట్ర పురోభివృద్ధిలో ఫ్యూచర్ సిటీ కీలకమవుతుంది. అందుబాటులో ఉన్న సాంకేతిక నిపుణులు, పర్యావరణ అనుకూల పరిస్థితులు, పటిష్ఠమైన ఐటీ వ్యవస్థ వంటి సానుకూలతలు హైదరాబాద్‌తోపాటు చుట్టు పక్కల ప్రాంతాల అభివృద్ధికి దోహద పడతాయి. మేం చేపట్టే ప్రతి కార్యక్రమం పర్యావరణ హితం. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై రైతులు, గ్రామీణ మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణ మహిళల్లో చైతన్యం తేవడానికి వచ్చే ఏడాది వివిధ కార్యక్రమాలు అమలు చేయనున్నాం. పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదలకు సర్కారుకు సహకరించబోతున్నాం. విద్యారంగంలో నైపుణ్యాభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, సామాజిక అభివృద్ధి, మా ప్రాధాన్యాలు' అని తెలిపారు.






హైదరాబాద్‌లో బీచ్!

» 235 కోట్లతో కొత్వాల్‌గూడలో 35 ఎకరాల్లో ఏర్పాటు
» దుబాయ్, సింగపూర్ తరహాలో టన్నెల్ అక్వేరియం
» ఫ్లయింగ్ థియేటర్, వికారాబాద్‌లో క్యారవాన్ పార్కు
» నేడు ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకోనున్న సంస్థలు

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరవాసులు సేదతీరేందుకు ఇకపై సముద్ర తీరాల దాకా వెళ్లాల్సిన పనిలేదు. అచ్చం అలాంటి అనుభూతి అందించేలా ఇక్కడే కృత్రిమ బీచ్ అందుబాటులోకి రానుంది. దానితోపాటు వినూత్న అనుభూతిని అందించే ఫ్లయింగ్ థియేటర్, టన్నెల్ అక్వేరియం, దేశ విదేశాల సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రంగా నిలిచే కల్చరల్ సెంటర్, పర్యాటకానికి ఊతమిచ్చేలా వికారాబాద్‌లో క్యారవాన్ పార్కు.. వంటి ఎన్నెన్నో సరికొత్త ప్రాజక్టులు వస్తున్నాయి. గ్లోబల్ సదస్సులో భాగంగా ఆయా సంస్థలు మంగళవారం ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) కుదుర్చుకోనున్నాయి. "కొత్వాల్‌గూడలో 35 ఎకరాల్లో కృత్రిమ బీచ్ ఏర్పాటు చేస్తున్నాం. అక్కడ సాధారణ ప్రజలు బీచ్‌లో ఎంజాయ్ చేయవచ్చు. అదే సమయంలో డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రాలు, ఇతర ఏర్పాట్లు కూడా చేస్తున్నాం. ఇందుకోసం స్పెయిన్ నుంచి సాంకేతిక సహకారం తీసుకుంటున్నాం. ఇది 235 కోట్ల ప్రాజెక్టు. సాధారణ ప్రజలకోసం 200 వరకు చార్జీ ఉంటుంది. బీచ్‌లో స్నానంతోపాటు బోటింగ్ అనుభూతి కూడా పొందవచ్చు" అని ఈ ప్రాజెక్టులో భాగస్వామి హరి దామెర తెలిపారు.

టన్నెల్ అక్వేరియం.. క్యారవాన్ పార్కు

దుబాయ్, సింగపూర్‌లలో ఉన్న తరహాలో రూ.300 కోట్ల పెట్టుబడితో టన్నెల్ అక్వేరియం ఏర్పాటు చేయనున్నారు. నీటి అడుగున నడుస్తూ జలచరాలను చూస్తున్న అనుభూతిని దీనితో పొందవచ్చు. ఈ టన్నెల్ అక్వేరియంను కెడార్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఇక ఫ్యూచర్ సిటీలో వంద ఎకరాల్లో వెయ్యి కోట్ల పెట్టుబడితో అంతర్జాతీయ సాంస్కృతిక కేంద్రం ఏర్పాటు కానుంది. ఇతర దేశాల్లో మాదిరిగా అన్ని రంగాల వారికి అవసరమైన సేవలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. ఇక హైదరాబాద్ సమీపంలోని వికారాబాద్‌లో క్యారవాన్ పార్కు ఏర్పాటుకానుంది. క్యారవాన్‌లో పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారికి పార్కింగ్, దానిపక్కనే బస, వాహనం చార్జింగ్, ఫ్యూటవర్, 24 గంటల పాటు ఆహారం వంటివి ఈ క్యారవాన్ పార్కులో అందుబాటులో ఉంటాయి. ప్రేక్షకులు ప్రత్యేకంగా రూపొందించిన కుర్చీలో కూర్చుని సినిమా చూస్తూ స్వయంగా అక్కడే ఉన్న అనుభూతిని పొందేలా ఫ్లయింగ్ థియేటర్‌ను ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్నారు. మరోవైపు పర్యాటక రంగంలో ఉపాధి పొందేందుకు శిక్షణ, అవగాహన కల్పించే 'స్కూల్ ఆఫ్ టూరిజం ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ అండ్ ప్రాజెక్ట్స్(స్టెప్)'ను స్థాపించనున్నారు. ఉదాహరణకు రాజులు, రాణుల తరహాలో ప్రత్యేకంగా దుస్తులు తయారు చేసి చారిత్రక కోటల వద్ద సిద్ధంగా ఉంచితే, సందర్శకులు కొంత అద్దె చెల్లించి ఆ దుస్తుల్ని ధరించి అనుభూతి పొందవచ్చు. 'స్టెప్'ను ఔత్సాహిక పారిశ్రామికవేత్త లాస్య ఏర్పాటు చేయనున్నారు.



క్యారవాన్ పార్కు ప్రతీకాత్మక చిత్రం

ఆకట్టుకున్న వినూత్న ఆవిష్కరణలు..!

గ్లోబల్ సమ్మిట్‌లో ప్రదర్శించిన వినూత్న ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. వ్యవసాయం, పరిశ్రమలు, మార్కెట్, మహిళా ఆధారిత రంగాలకు సంబంధించిన కొత్త ఆవిష్కరణలను విద్యార్థులు ప్రదర్శించారు. ముఖ్యంగా వీధి వ్యాపారుల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన వాణిజ్య ఎలక్ట్రికల్ యుటిలిటీ వాహనం ఆకట్టుకుంది. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థినులు తయారుచేసిన మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషీన్ కూడా వ్యవసాయ రంగానికి దోహదపడేలా ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్సీ సంక్షేమ హాస్టల్ విద్యార్థి గగన్‌చంద్ర తయారుచేసిన 'త్రీ ఇన్ వన్ సైకిల్'.. సంగారెడ్డి ఏటీసీ విద్యార్థుల మల్టీపర్పస్ మూవబుల్ రోబో కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సాగులో సహాయకారి మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషీన్..



వ్యవసాయ రంగంలో అన్ని రకాల పనులు చేసేందుకు రూపొందించిందే మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషీన్.. దుక్కి, దున్నడం, విత్తనాలు చల్లడం, నీరు పోయడం, ఎరువులు వేసుకోవడం, పురుగుల మందుల పిచికారీ దీని ద్వారా చేసుకోవచ్చు. ఈ యంత్రం వెనుక హ్యాండిల్ ఉంటుంది. దీనికి కరెంట్ సరఫరా ఉన్నా లేకపోయినా నడుపుకోవచ్చు. ఒకవేళ కరెంటు అవసరమైతే.. ఒక డీసీ మోటర్‌కు 5 ఓల్ట్స్ బ్యాటరీ కనెక్ట్ చేసుకోవచ్చు. పురుగుల మందులు చల్లుకోవాలనుకుంటే.. పెస్టిసైడ్ బాక్స్ కూడా ఉంటుంది. ఒకే మెషీన్‌తో అన్ని రకాలు సాగు పనులు చేసుకునేందుకు ఈ యంత్రాన్ని రూపొందించామని ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఇంటర్ (ఎంపీసీ) విద్యార్థినులు వైష్ణవి, రనూషలు తెలిపారు.

వీధి వ్యాపారులకు అండగా ఈ-వాహనం



చిరు వ్యాపారుల కోసం ఐఐటీ హైదరాబాద్ విద్యార్థులు ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రదర్శించారు. వీధి వ్యాపారులకు అనుగుణంగా వాణిజ్య ఎలక్ట్రిక్ యుటిలిటీ వాహనాలను అందుబాటులోకి తెచ్చారు. దీనికి ఒకసారి చార్జింగ్ పెడితే 100 కి.మీ. ప్రయాణించొచ్చు. 500 కిలోల బరువు మోస్తుంది. వాహనం సీటుపైన వంట చేసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. దీని ఖరీదు లక్ష. అద్దెకు తీసుకోవాలనుకుంటే రోజుకు 250-300 వరకు కిరాయి ఉంటుంది. వాహన పనితీరును పరేశ్ మిశ్రీ వివరించారు.

దూసుకెళ్లే 'త్రీ ఇన్ వన్ సైకిల్'!



సాధారణ సైకిల్‌ను.. సోలార్ పవర్‌తోపాటు ఎలక్ట్రిక్ బ్యాటరీతో అనుసంధానించి 'త్రీ ఇన్ వన్ సైకిల్'ను నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్సీ సంక్షేమ హాస్టల్ ఉంటూ పీఎంశ్రీ జెడ్పీహెచ్‌ఎస్ బల్మూర్ పాఠశాలలో చదివే గగన్‌చంద్ర తయారుచేశాడు. 'ఇది మూడు రకాలుగా నడుస్తుంది. సాధారణంగా సైకిల్‌ను పెడలింగ్ విధానంలో మాత్రమే వాడతారు. కానీ ఈ సైకిల్‌ను సోలార్ పవర్‌తోనూ చార్జ్ చేసి వాడుకోవచ్చు. ఇక ఎలక్ట్రిక్ బ్యాటరీని చార్జింగ్ చేసుకుంటే 30 కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. ఇక ఈ సైకిల్‌కు కారు తరహాలో సెంట్రల్ లాకింగ్ సిస్టమ్ ఉంది. దీంతో ఎవరైనా తీసుకెళ్లాలని ప్రయత్నించినా వెంటనే అలారం మోగుతుంది. సైకిల్ ముందుభాగంలో ఏర్పాటు చేసిన స్ర్కీన్‌లో గూగుల్ మ్యాప్ ద్వారా నావిగేషన్ ఉపయోగించొచ్చు. అత్యవసర సమయాల్లో అవసరమైన వారికి ఫోన్ చేసే వెసులుబాటు కూడా ఈ సైకిల్‌లో ఏర్పాటుచేశాం' అని గగన్‌చంద్ర వివరించాడు.

అన్ని పనులు చేసే మల్టీపర్పస్ రోబో..!

గడ్డి కోయడానికి, ఇల్లు శుభ్రం చేయడానికి పలు ఇతర పనులకు మల్టీపర్పస్ మూవబుల్ రోబోను సంగారెడ్డి జిల్లా అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) విద్యార్థులు భవానీ తేజ, భానుప్రకాశ్‌లు తయారుచేశారు. పదో తరగతి వరకు చదివిన వీరిద్దరూ ఏటీసీలో చేరారు. అందరికీ ఉపయోగపడేలా పరికరం తయారుచేయాలన్న ఆలోచనతో ఈ మల్టీపర్పస్ మూవబుల్ రోబోను రూపొందించారు. దీని తయారీకి 6 నెలల సమయం పట్టిందని, దాదాపు రూ.15 వేల వరకు ఖర్చయిందని వారు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఈ రోబో పరిశ్రమలు, వ్యవసాయం, ఇళ్లలో బాగా ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఒక్కసారి చార్జ్ చేస్తే 2 గంటల వరకు పనిచేస్తుందని వెల్లడించారు.

TELANGANA RISING 2047

పెట్టుబడుల సునామీ!

సదస్సు తొలిరోజు సూపర్ సక్సెస్.. రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చిన 35 కంపెనీలు

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పెట్టుబడులు సునామీలా పోటెత్తాయి! తొలిరోజే 35కుపైగా సంస్థలు ఏకంగా రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చాయి! వీటిలో రాష్ట్రంలోని మై హోం, అపోలో గ్రూపుల నుంచి విదేశాల్లోని డొనాల్డ్ ట్రంప్, విన్ గ్రూపులూ ఉన్నాయి. రాష్ట్రంలో ఉన్న పెట్టుబడి అవకాశాలను ప్రపంచ పారిశ్రామికవేత్తల ముందు ఆవిష్కరించే ప్రధాన ఉద్దేశంతో భారత ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసిన రెండు రోజుల తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ సోమవారం మధ్యాహ్నం ప్రారంభమైంది. సదస్సును గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించి మాట్లాడారు. అనంతరం వేదికపై ఆశీనులైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతోపాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, నోబెల్ బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థి, అపోలో గ్రూపుల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ శోభన కామినేని, ట్రంప్ గ్రూపు డైరెక్టర్ ఎరిక్ స్విడర్ తదితరులు ప్రసంగించారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ, విదేశాల నుంచి పలువురు పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. పలు రాష్ట్రాల పెట్టుబడిదారులు, కన్సల్టెంట్లు, బ్యాంకింగ్ ప్రతినిధులు, అనేక రంగాల ప్రముఖులు తరలి వచ్చారు. ప్రధాన వేదిక కిక్కిరిసిపోవడమే కాకుండా పలువురు ప్రతినిధులు నిలబడే ఉండాల్సి వచ్చింది. దాంతో, కార్యక్రమ వ్యాఖ్యాతలు పలుమార్లు వారిని కూర్చోవాలని పిలుపునివ్వాల్సి వచ్చిందంటే సదస్సు ఏ స్థాయిలో విజయవంతం అయ్యిందో అర్థం చేసుకోవచ్చు. ఇక, 'రండి.. మా రాష్ట్రంలోని అవకాశాలు చూడండి' అని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిస్తే.. వాటిని అందిపుచ్చుకునేందుకు సిద్ధం అంటూ పెట్టుబడిదారులు ఒప్పందాలు చేసుకున్నారు. నిజానికి, రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలంటూ కంపెనీలను ఆహ్వానించడానికి ఇప్పటి వరకూ ప్రభుత్వ ప్రతినిధులు స్విట్జర్లాండ్‌లోని దావోస్ వెళ్లేవారు. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుల్లో పాల్గొనేవారు. కానీ, దానికి భిన్నంగా రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారిగా దావోస్‌నే హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. హైదరాబాద్‌లో తొలిసారిగా నిర్వహించిన సదస్సు సూపర్ హిట్ అయింది. తొలిరోజే ఏకంగా 35కిపైగా సంస్థలు రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. గత పదేళ్లలో ఎప్పుడూ లేనట్లుగా తెలంగాణకు ఒక విజన్‌ను రూపొందించి.. రాష్ట్రాభివృద్ధికి భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేసిన సీఎం రేవంత్ రెడ్డిని ప్రపంచ ఆర్థిక వేదిక ఎండీ నుంచి.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతినిధి ఎరిక్ స్విడర్ వరకూ ప్రతి ఒక్కరూ ప్రశంసల్లో ముంచెత్తారు.

ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ రూ.41 వేల కోట్లు

తొలిరోజు ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్ 41 వేల కోట్లు పెట్టుబడి పెట్టేందుకు తెలంగాణ ప్రభుత్వంతో ఒప్పందాలను చేసుకుంది. ఈ సంస్థ తరపున సమ్మిట్‌కు హాజరైన దాని డైరెక్టర్ ఎరిక్ స్విడర్ అయితే సీఎం రేవంత్‌ను ఆకాశానికి ఎత్తేశారు. అంతేనా.. రాబోయే పదేళ్లలో లక్ష కోట్లు పెట్టుబడి పెడతామని ప్రకటించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో బ్రూక్‌ఫీల్డ్ యాక్సిస్ వెంచర్స్ కూటమి రూ.75 వేల కోట్లతో గ్లోబల్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, డీప్ టెక్ హబ్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అలాగే, పునరుత్పాదక విద్యుత్తు, ఈవీ ఇన్ఫ్రా విస్తరణకు విన్ గ్రూప్ రూ.27,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.



విభిన్న రంగాల్లో వేల కోట్ల పెట్టుబడులు

రైజింగ్ సదస్సుల్లో విభిన్న రంగాల నుంచి రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, గ్రీన్ ఎనర్జీ, విద్యుత్, రవాణా, విద్య, వైద్యం, పర్యాటకం, వినోదం.. ఇలా పలు రంగాల పారిశ్రామికవేత్తలు తెలంగాణ ప్రభుత్వంతో పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఒక్క ఇంధన రంగంలోనే లక్ష కోట్ల రూపాయలకుపైగా పెట్టుబడులు తరలివచ్చాయి. తద్వారా 1,52,300 మందికి ఉద్యోగాలు కల్పిస్తామంటూ 14 సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఫ్యూచర్ సిటీలో కొత్త జూ పార్క్ ఏర్పాటుకు రిలయన్స్‌కు చెందిన వంతారా ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే, సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో తొలి రోజు డీప్ టెక్, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్ రంగాల్లో పలు పెట్టుబడుల ఒప్పందాలపై సంతకాలు చేశారు.

పెట్టుబడులు పెట్టిన ఇతర సంస్థలు ఇవే..

- స్థానిక వెంచర్లకు సిడ్బీ స్టార్టప్ ఫండ్ ఆఫ్ ఫండ్స్ సంస్థ రూ.1,000 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది. దీనికితోడు వరల్డ్ ట్రేడ్ సెంటర్ ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు రూ.1000 కోట్లను పెట్టుబడి పెట్టనుంది.
- ఎవ్రెన్/యాక్సిస్ ఎనర్జీ రూ.31,500 కోట్లతో సోలార్ పవర్, విండ్ పవర్ మెగా ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది.
- మేఘా ఇంజనీరింగ్ గ్రూప్ రూ.8 వేల కోట్లతో సోలార్, పంప్డ్ స్టోరేజ్, ఈవీ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది.
- ఏరో స్పేస్, డిఫెన్స్ రంగాల్లో నిర్వహణ, మరమ్మత్తు, ఓవర్ హాలింగ్ (ఎంఆర్వో)తోపాటు కార్గో విస్తరణకు జీఎంఆర్ గ్రూప్ రూ.15,000 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం చేసుకుంది. డిఫెన్స్, ఏవియానిక్స్ తయారీకి అపోలో మైక్రో సిస్టమ్ లిమిటెడ్ రూ.1,500 కోట్లు పెట్టుబడులకు సిద్ధపడింది.
- సోలార్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో మిస్సైల్ భాగాలు, ఏరో ఇంజన్ స్ట్రక్చర్‌కు రూ.1,500 కోట్లు, ఎంపీఎల్ లాజిస్టిక్స్ కంపెనీ రూ.700 కోట్లు, టీవీఎస్ ఐఎల్‌పీ రూ.200 కోట్లు పెట్టుబడులకు ముందుకొచ్చాయి.
- రెన్యూసిస్, మిడ్‌వెస్ట్, అక్షత్, గ్రీన్ టెక్ ఎలక్ట్రానిక్స్, హైడ్రోజన్ టెక్ విస్తరణకు రూ.7,000 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి.
- డిస్ట్రిబ్యూటెడ్ హైడ్రోజన్ టెక్నాలజీ రంగంలో సోహీ టెక్ ఇండియా రూ.1,000 కోట్లు, ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు కృష్ణా పవర్ యుటిలిటీస్ రూ.5,000 కోట్లు, సిమెంట్ రంగ విస్తరణకు అల్ట్రాబ్రైట్ సిమెంట్స్, రెయిన్ సిమెంట్స్ రూ.2000 కోట్లకు ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.
- సీతారాం స్పిన్నర్స్ రూ.3 వేల కోట్లతో టెక్స్‌టైల్ యూనిట్ నెలకొల్పనుంది.
- షోలాపూర్ తెలంగాణ టెక్స్‌టైల్ అసోసియేషన్ అండ్ జీనియస్ ఫిల్టర్స్ పవర్ లూమ్ టెక్నికల్ యూనిట్ రూ.960 కోట్లు పెట్టుబడులు పెట్టనుంది.
- ప్రముఖ సంస్థ అతిరథ్ హోల్డింగ్స్ రాష్ట్రంలో 25 కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్లు నెలకొల్పనుంది. వీటిని స్థాపించేందుకు 4 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది.
- హైదరాబాద్‌లో అత్యాధునిక విశ్వవిద్యాలయం, వైద్య విద్య, పరిశోధనా కేంద్రం నిర్మాణానికి రూ.200 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు అపోలో గ్రూప్ ఒప్పందం చేసుకుంది. రాబోయే మూడేళ్లలో రూ.1700 కోట్ల పెట్టుబడి పెడుతున్నామని, ప్రోటాన్ థెరపీ, ఇన్నోవేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది.
- అంతర్జాతీయ మోటార్ స్పోర్ట్స్ సంస్థ సూపర్ క్రాస్ ఇండియా తెలంగాణలో ప్రపంచస్థాయి రేసింగ్ ట్రాక్, శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఇది క్రీడా పర్యాటకం అభివృద్ధికి దోహదం చేయనుంది. యూనివర్సిటీ ఆఫ్ లండన్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లో ఆధునిక నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది.

రూ.1,08,850 కోట్లతో 14 ఎంవోయూలు

ఇంధన రంగంలో రూ.1,08,850 కోట్ల పెట్టుబడులు పెట్టడం ద్వారా 1,52,000 మందికి ఉద్యోగాలు కల్పించే 14 సంస్థలతో ఈ సందర్భంగా ఒప్పందాలు చేసుకున్నారు. వాటిలో సంస్థలు.

సంస్థ	నెలకొల్పే ప్లాంట్	ఒప్పందం విలువ (రూ. కోట్లలో)	ఉద్యోగాల సంఖ్య
ఏఎం గ్రీన్ ఇండియా	ఈ-మెథనాల్ ప్లాంట్	8000	4,000
ఏఎం గ్రీన్ ఇండియా	2జీ ఈథనాల్ ప్లాంట్	10,000	35,000
ఎస్ఎల్ఆర్ సురభి పవర్	1 గిగావాట్ సోలార్, 1.2 గిగావాట్ సోలార్‌సెల్	3000	1000
అతిరత్ హోల్డింగ్స్	25 కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్	4000	9,000
శ్రీసురాస్ ఇండస్ట్రీస్	కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్లాంట్, క్యాప్టివ్ సోలార్	3500	5,000
సోలానిక్స్ పవర్	సోలార్‌తో500 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ	2400	500
హైజెన్‌కో గ్రీన్	1000 టీపీఏ గ్రీన్ హైడ్రోజన్	1250	850
ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్	వ్యవసాయ వ్యర్థాలతో 1000 మెగావాట్లప్లాంట్	1600	25,000
అస్త్రా గ్రీన్ ఎనర్జీ	500 మెగావాట్ల క్యాప్టివ్‌ప్లాంట్-బ్యాటరీ ఎనర్జీతో	5600	200-300
యునైటెడ్ టెలికామ్స్	200 టీపీడీ బయోగ్యాస్ ప్లాంట్	2500	16,500
ఏఎంఆర్ ఇండియా	2 వేల మెగావాట్ల రెన్యూబుల్ ఎనర్జీ	12,500	18,000
యాక్సిస్ ఎనర్జీ వెంచర్స్	2750 మెగావాట్ల రెన్యూబుల్ ఎనర్జీ పార్కులు	31,500	19,750
ఏకోరెన్	1000 మెగావాట్ల పీఎస్‌పీ, 500 మెగావాట్ల ఆర్‌ఈ	16000	5,000
మై హోమ్ పవర్	750 మెగావాట్ల పీఎస్‌పీ, 500 మెగావాట్ల సోలార్	7000	12,500
మొత్తం		1,08,850	1,52,300

ప్రజా ప్రభుత్వ విధానాలపై అంతర్జాతీయ విశ్వాసానికి ప్రతీక: సీఎం రేవంత్‌రెడ్డి

రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులు తెలంగాణలో ప్రజా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై దేశీయ, అంతర్జాతీయ విశ్వాసానికి నిదర్శనమని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇక్కడ పెట్టే ప్రతి రూపాయి పెట్టుబడి నాణ్యమైన ఉపాధి అవకాశంగా, మౌలిక సదుపాయాలుగా మార్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. డీప్‌టెక్ సిటీ నుండి టెక్స్‌టైల్ యూనిట్ వరకు అన్ని రంగాల్లో పెట్టుబడుల ఒప్పందాలు, వైవిధ్యమైన పరిశ్రమల స్థాపనకు కంపెనీలు ముందుకు రావటం తెలంగాణ సుస్థిర పరిశ్రమల విధానాన్ని ప్రపంచానికి చాటిచెపుతోందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.

ఆకట్టుకున్న ప్రభుత్వ శాఖల స్టాళ్లు

ప్రత్యేక ఆకర్షణగా మూసీ రివర్ స్టాల్

ఫ్యూచర్ సిటీకి అన్నపూర్ణ స్టూడియోస్!

సమ్మిట్ ఖర్చు రూ 280 కోట్లు!

హైదరాబాద్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ స్టాల్‌లో ఎల్ఈడీ స్ర్కీన్‌లతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇంధన శాఖ నెట్ జీరో స్టాల్‌లో నిర్వహించిన క్విజ్ పోటీలో పలువురు ఐఏఎస్‌లు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్, ఏరో స్పేస్ రంగంలో ఉన్న మెగా ఇంజనీరింగ్ కంపెనీ స్టాల్ ఆకట్టుకున్నాయి. మూసీ రివర్ ఫ్రంట్ స్టాల్‌లో ఉంచిన కొన్ని ఫోటోలు చూపిస్తూ మూసీ గురించిన అంశాలను సీఎం రేవంత్ సినీ నటుడు అక్కినేని నాగార్జునకు వివరించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ రైజింగ్ తెలంగాణ విజన్-2047 డాక్యుమెంట్ బాగుందని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ఫిలిం హబ్ ఏర్పాటు చేయాలని చర్చలు జరుగుతున్నాయన్నారు. అన్నపూర్ణ స్టూడియోస్‌ను కూడా ఫ్యూచర్ సిటీకి తీసుకొస్తామని నాగార్జున ప్రకటించారు. ఈ సదస్సు కోసం ప్రభుత్వం దాదాపు రూ.280 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు సమాచారం. సమ్మిట్ ఏర్పాట్ల విషయంలో సీఎస్ రామకృష్ణారావు ప్రత్యేక శ్రద్ధ చూపారు. సమ్మిట్ కోసం ఆన్లైన్‌ద్వారా రిజిస్టర్ చేసుకున్న వారికి పాసులు అందించడంలో విఫలమయ్యారనే విమర్శలొచ్చాయి. దీంతో వేదిక దగ్గరే దాదాపు 1,750 పాసులు అప్పటికప్పుడు జారీ చేశారు.



ఇందిరమ్మ చీరలను పరిశీలిస్తున్న ఓ మహిళ

ఫ్యూచర్ సిటీకి కొత్త కళ

హైదరాబాద్/(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌తో భారత్ ఫ్యూచర్‌సిటీ ప్రాంతం కొత్త కళను సంతరించుకుంది. దాదాపు రాష్ట్ర ప్రభుత్వమంతా ఇక్కడే కొలువుదీరింది. 3 వేల మంది ప్రతినిధుల రాకతో తొలిరోజు ప్రభుత్వ లక్ష్యం నెరవేరింది. ముఖ్య అతిథుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. సీఎం రేవంత్‌ను నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాశ్ సత్యార్థి, ట్రంప్ మీడియా టెక్నాలజీ సంస్థ డైరెక్టర్ ఎరిక్ పొగడ్తలతో ముంచెత్తారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, సినీహీరో నాగార్జున ప్రధాన ఆకర్షణగా నిలిచారు.

సీఎంకు హాయ్ చెప్పిన రోబో..

సమ్మిట్‌లో రోబో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ప్రాంగణంలోపలికి ప్రవేశించిన అతిథులకు రోబో స్వాగతం చెబుతూ హాయ్ అని పలకరించింది. సీఎం రేవంత్‌రెడ్డిని రోబో హాయ్ అని పలకరిస్తూ చేయి పైకి ఎత్తింది. దీంతో ఆయన కూడా హాయ్ అని పలకరించారు. సమ్మిట్‌కు వచ్చిన అతిథులు అక్కడి స్టాల్స్‌లో సందడి చేశారు. అతిథులకు ప్రభుత్వం ఘనస్వాగతం పలికింది. హైదరాబాద్ నుంచి దారిపొడవునా స్వాగత తోరణాలు, డిజిటల్ స్ర్కీన్లు ఏర్పాటు చేసింది. ప్రాంగణం వద్ద తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా గిరిజన నృత్యాలు, డప్పు కళాకారులతో అతిథులకు స్వాగతం పలికారు. ప్రధాన వేదిక వద్ద సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. సమ్మిట్ ప్రాంగణంలోకి పాస్ లేనిదే ఎవరినీ అనుమతించలేదు. అతిథులు బసచేసే హోటళ్ల వద్ద కూడా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. నగరం నుంచి సమ్మిట్‌కు అతిథులు పెద్ద సంఖ్యలో రావడంతో శ్రీశైలం హైవే వాహనాలతో కిక్కిరిసింది.

ప్రత్యేక ప్యాక్‌లో మంచినీళ్లు

సమ్మిట్ ప్రాంగణంలో ఏమాత్రం ప్లాస్టిక్ వినియోగం లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రత్యేక ప్యాక్‌లో మంచినీళ్లను అందించింది. రీయూజబుల్ టెట్రా ప్యాకెట్‌లో నీళ్లు అందించారు. 350 మిల్లీలీటర్ ప్యాకెట్‌పై ధర రూ.78 ఉండగా, అరలీటర్ ప్యాకెట్‌పై రూ.110 ధర అని ముద్రించి ఉంది.

రేపు ఓయూకు సీఎం రేవంత్‌రెడ్డి

- ఆర్ట్స్ కళాశాల వద్ద భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ దేవసేన, వీసీ, ఏసీపీ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 10న సీఎం రేవంత్‌రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీకి రానున్నారు. ఈమేరకు ఆర్ట్స్ కళాశాల ప్రాంగణాన్ని అధికారులు ముస్తాబు చేస్తున్నారు. భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నారు. సోమవారం సభ ఏర్పాట్లను కళాశాల, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేన, ఓయూ ఉప కులపతి కుమార్ మొలుగరం, ఏసీపీ జగన్, సీఐ అప్పలనాయుడు పరిశీలించారు. అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం ఉదయం 9 గంటలకు సభ ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు. సుమారు 5 వేలమంది కూర్చునేందుకు కుర్చీలు ఏర్పాటు చేయనున్నారు. ఈ పర్యటనలో రూ.వెయ్యి కోట్ల నిధులతో సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. మరి కొన్ని కీలక ప్రకటనలు చేసే అవకాశం ఉంది.

భక్తుల చెంతకు యాదగిరి లక్ష్మీనృసింహుడు

- ఇకపై ఊరూరా స్వామి వారి కల్యాణ ఉత్సవాలు
- 20న భూపాలపల్లి.. 27న నాగర్‌కర్నూల్‌లో నిర్వహణ

యాదగిరిగుట్ట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తపన ఎంత ఉన్నా.. తనను దర్శించుకోలేని భక్తుల చెంతకు స్వయంగా లక్ష్మీనృసింహుడే చేరనున్నాడు. దీనిని నిజం చేసేందుకు యాదగిరిగుట్ట దేవస్థానం అధికారులు సమాయత్తమవుతున్నారు. పుణ్యక్షేత్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రచార రథం ద్వారా ఊరూరా స్వామి వారి కల్యాణం జరిపించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందు కోసం ఉత్సవమూర్తులను ఆయా ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించారు. మారుమూల పల్లెలకు ప్రచార రథం ద్వారా ఆలయ స్వామివారిని చేరువ చేస్తున్నారు ఈవో ఎస్. వెంకట్రావు. దీని వల్ల వృద్ధులు, దివ్యాంగులు, ఇతర రుగ్మతలతో బాధపడుతున్న భక్తులకు స్వామి వారి దర్శనభాగ్యం కలగనుంది. లక్ష్మీనృసింహుడి కల్యాణం ఈ నెల 20న భూపాలపల్లి జిల్లాలో, 27న నాగర్‌కర్నూల్ జిల్లాలో నిర్వహించేందుకు అధికారులు నిర్ణయించారు. అనంతరం దీనిని ఇతర జిల్లాలకు విస్తరించేందుకు సన్నద్ధమవుతున్నారు. రెండు జిల్లాల్లో స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఇద్దరు ఏఈవోలను నోడల్ అధికారులుగా నియమించారు. ఆయా జిల్లాల ప్రముఖులు, అధికారులతో సమన్వయం చేసుకుని కల్యాణాలు జరిపించాలని ఈవో ఆదేశించారు.

అప్పుడు నిర్లక్ష్యం.. ఇప్పుడు ప్రాధాన్యం

- 'విజయ్ దివస్' వెనుక బీఆర్ఎస్ వ్యూహమేంటి?

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్న పదేళ్లు డిసెంబరు 9కి ఎలాంటి ప్రత్యేకత ఇవ్వని బీఆర్ఎస్.. ప్రస్తుతం ఆ తేదీకి ప్రాధాన్యం కల్పిస్తూ విజయ్ దివస్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టడం రాజకీయవర్గాల్లో చర్చకు దారితీస్తోంది. 2009లో 10 రోజులకు పైగా నిరాహార దీక్ష చేపట్టిన కేసీఆర్, ఆనాటి కేంద్ర హోం మంత్రి పి.చిదంబరం డిసెంబరు 9న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను మొదలుపెడుతున్నట్లు ప్రకటన చేయగానే దీక్ష విరమించారు. ఇటువంటి చారిత్రక ప్రాధాన్యం ఉన్నప్పటికీ, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నన్ని రోజులు ఈ తేదీని ప్రత్యేకంగా గుర్తుచేసుకున్న దాఖలాల్లేవు. ఇప్పుడెందుకు ఈ తేదీకి ప్రాధాన్యం ఇస్తున్నారనే అంశంపై రాజకీయ వర్గాలు విశ్లేషించుకుంటున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ పుట్టినరోజు కూడా డిసెంబరు 9నే కావడంతో, అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతల పుట్టినరోజున వేడుకలు జరిపితే విమర్శలు వస్తాయనే ఉద్దేశంతో బీఆర్ఎస్ దూరంగా ఉండి ఉండవచ్చని ఒక అభిప్రాయం వ్యక్తమవుతోంది. కానీ, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ ఈ తేదీని విజయ్ దివస్‌గా జరుపుకోవడం ద్వారా తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్ పాత్రను హైలైట్ చేస్తూ, పరోక్షంగా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ప్రయత్నిస్తోందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. కాగా, తెలంగాణ ఏర్పాటు ప్రక్రియలో డిసెంబరు 9 కీలక మలుపు అని, ఆ రోజున విజయ్ దివస్ పేరిట ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నామని బీఆర్ఎస్ ప్రధాన కార్యాలయ కార్యదర్శి రావుల చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకం, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

తెలంగాణకు కొత్త ఐఏఎస్‌లు ఇద్దరే

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు కేంద్రం ఇద్దరు కొత్త ఐఏఎస్ అధికారులను కేటాయించింది. 2024 సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌లో వీరి క్యాడర్‌ను కేంద్రం నిర్ధారించింది. తెలంగాణకు చెందిన ఎర్రబోయిన సాయి శివాణి, కర్ణాటక వాసి సచిన్ బసవరాజ్ గుట్టూర్‌లను రాష్ట్రానికి కేటాయించింది. వివిధ రాష్ట్రాలకు 92 మంది ఐఏఎస్‌ల కేడర్‌ను నిర్ధారించిన కేంద్రం.. తెలంగాణకు ఇద్దరిని మాత్రమే కేటాయించడం గమనార్హం.

ఏపీలో స్క్రబ్ టైఫస్ కలకలం

- ఆ లక్షణాలతో 9 మంది మృతి..1566 మందికి పాజిటివ్

అమరావతి, సత్తెనపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏపీలో ఇప్పటివరకు 1,566 స్క్రబ్ టైఫస్ పాజిటివ్ కేసులు నమోదైనట్టు ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మిగిలిన రాష్ట్రాలతో పోల్చితే ఏపీలో తక్కువ కేసులే నమోదయ్యాయని తెలిపారు. ఈ జ్వరం వచ్చి మరణించిన వారిలో తొమ్మిది మంది ఉన్నా.. స్క్రబ్ టైఫస్ వల్లే ఈ మరణాలు సంభవించినట్టు ఇప్పటివరకూ నిర్ధారణ కాలేదని స్పష్టం చేశారు. ఆ మరణాలకు సరైన కారణాలు తెలుసుకునేందుకు పరిశోధన చేయాల్సి ఉందన్నారు. దీనికి 2-3 నెలల సమయం పట్టొచ్చని తెలిపారు. తాజాగా పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కొమెరపూడిలో స్క్రబ్ టైఫస్ వ్యాధి లక్షణాలతో ఒకరు మృతిచెందారు. గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం వెనిగండ్లలో ఒకరికి ఈ వ్యాధి లక్షణాలు కనపడడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది.

నిర్మల్‌లో మహిళ దారుణ హత్య

- సహజీవన భాగస్వామే నిందితుడు


అశ్విని (ఫైల్)

భైంసా, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో ఓ మహిళ సోమవారం దారుణ హత్యకు గురైంది. ఉపాధి కోసం టీ పాయింట్ నిర్వహిస్తున్న సదరు మహిళ .. ఆమె సహజీవన భాగస్వామి చేతిలో హతమైంది. భైంసా టౌన్ సీఐ గోపినాథ్ కథనం ప్రకారం.. భైంసా మండలంలోని కుంసర గ్రామానికి చెందిన అశ్విని (28)అనే వివాహిత కుటుంబ కలహాలతో భర్త, ఇద్దరు పిల్లలకు కొంత కాలంగా దూరంగా ఉంటోంది. ఈ క్రమంలో భైంసాలోని అంబేడ్కర్ నగర్ కాలనీకు చెందిన నగేష్‌తో ఏర్పడిన పరిచయం, సహజీవనానికి దారితీసింది. ఇద్దరు కలిసి సంతోషీమాత ఆలయ సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకుని జీవిస్తూ.. ఉపాధి కోసం టీ పాయింట్ నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం టీ పాయింట్ తెరిచిన కొద్ది సమయానికే అశ్విని, నగేష్‌ల మధ్య గొడవ తలెత్తింది. అశ్విని వ్యవహార శైలిపై అనుమానం పెంచుకున్న నగేష్.. కత్తి, రాడుతో విచక్షణరహితంగా ఆమెపై దాడికి తెగబడ్డాడు. అశ్విని రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండగా.. నిందితుడు నగేష్ పక్కనే కూర్చొని ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నగేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓటమి బెంగతో

సర్పంచ్ అభ్యర్థి ఆత్మహత్య

- అయ్యప్ప మాలలోనే ఉరేసుకుని బలవన్మరణం
- గుండెపోటుతో మరో ఇద్దరు అభ్యర్థులు మృతి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)


సర్పంచ్ అభ్యర్థి రాజు (ఫైల్)


వార్డు అభ్యర్థి పల్లె లత (ఫైల్)

సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం పిప్పడ్‌పల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ మద్దతుతో పోటీ చేస్తున్న సీహెచ్ రాజు(36) ఆత్మహత్య చేసుకున్నారు. ఎన్నికల్లో ఓడిపోతాననే ఆందోళనతో ఉరేసుకుని ప్రాణాలు తీసుకున్నారు. నమ్ముకున్న వారే ఎన్నికల్లో ప్రచారానికి దూరంగా ఉంటున్నారని మనోవేదనకు గురై 3రోజులుగా ఒంటరిగానే ప్రచారాన్ని కొనసాగించారు. ఆదివారం సాయంత్రం ఛాతీలో నొప్పి ఉందంటూ రాయికోడ్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించుకున్నారు. అయ్యప్ప మాల వేసుకున్న రాజు శంషొద్దీన్‌పూర్ గ్రామ శివారులో గల అయ్యప్ప సన్నిధానంలో తోటి స్వాములతో ఉంటున్నారు. తాను ఓడిపోతానని, తనకు చావే శరణ్యమని ఆదివారం రాత్రి ఆవేదన వ్యక్తం చేయగా తోటి స్వాములు ధైర్యం చెప్పారు. తెల్లవారాక రాజు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రచారంలో కుప్పకూలిన వార్డు అభ్యర్థి

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మంచర్లగూడకు చెందిన పల్లె లత(42) గ్రామంలోని 8వ వార్డుకు పోటీ చేస్తున్నారు. ఆదివారం రాత్రి ప్రచారం నిర్వహిస్తూ గుండె నొప్పితో కుప్పకూలిపోయారు. చికిత్స నిమిత్తం శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా మెరుగైన వైద్యం కోసం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబీకులు కాంటినెంటల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందారు.

గుండెపోటుతో వార్డు అభ్యర్థి మృతి

సంగారెడ్డి చౌటకూర్ మండలం చక్రియాల గ్రామ పంచాయతీలో 8వ వార్డుకు పోటీ చేస్తున్న కొత్తొల్ల పద్మారావు(50) గుండెపోటుతో మృతిచెందారు. ఆదివారం రాత్రి వరకు ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన మధ్యరాత్రి నిద్రలోనే గుండెపోటుతో కన్నుమూశారు. మూడో విడతలో ఎన్నికలు జరగనున్న ఈ వార్డుకు ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉండగా, పద్మారావు మృతితో పోటీ చేస్తున్న అభ్యర్థుల సంఖ్య రెండుకు చేరింది. ఇక్కడ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి అడ్డంకి లేదని అధికారులు తెలిపారు.

వంగపల్లి సర్పంచ్ అభ్యర్థిపై కేసు నమోదు

తనను సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాభివృద్ధికి కృషి చేస్తానంటూ హామీ పత్రంతో ప్రచారం చేస్తున్న అభ్యర్థిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలోని వంగపల్లికి చల్ల కమలాకర్ రెడ్డి బాండ్‌పేపరతో ప్రచారం చేస్తుండగా.. ఎన్నికల నిబంధన ఉల్లంఘనగా పేర్కొంటూ పోలీసులు కేసు నమోదు చేశారు.

నేటితో ముగియనున్న తొలివిడత ఎన్నికల ప్రచారం

- ఈనెల 11న తొలివిడత సర్పంచ్, వార్డు స్థానాలకు పోలింగ్

తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో భాగంగా 4236 గ్రామాల్లో ప్రచార పర్వం నేటితో ముగియనుంది. ఈనెల 11న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో తొలివిడత ఎన్నికల్లో తలపడుతున్న సర్పంచ్, వార్డు సభ్యులు ఎన్నికల నియమావళి ప్రకారం మంగళవారం సాయంత్రం 6గంటల వరకే తమ ప్రచారాన్ని కొనసాగించనున్నారు. అదే విధంగా పోలింగ్ జరిగే ప్రాంతాల్లో నేటి సాయంత్రం నుంచి మద్యం దుకాణాలను మూసివేయనున్నారు. 11న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్, ఆ తర్వాత ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడించాక మద్యం దుకాణాలను తెరుస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా 564 మండలాల్లోని 12,723 గ్రామ పంచాయతీల పరిధిలో 3విడతల్లో జరిగే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో 1,66,48,496మంది ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

బ్రాండ్‌కు తగ్గేదేలే!

పంచాయతీ ఎన్నికల వేళ గ్రామాల్లో బ్రాండెడ్ మద్యానికి గిరాకీ

గత ఎన్నికల్లో గోవా, కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్‌ల సరఫరా

బ్రాండ్ మద్యంతో ఖర్చు ఎక్కువ అవుతుందంటున్న అభ్యర్థులు

ఎక్కువ ఖర్చు చికెన్, మందుకే.. రెండింతలు పెరిగిన మద్యం అమ్మకాలు

మహబూబ్‌నగర్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పంచాయతీ ఎన్నికల వేళ బ్రాండెడ్ మద్యానికి తగ్గేదేలేదని ఓటర్లు సర్పంచ్ అభ్యర్థులకు తేల్చి చెబుతున్నారు. చీప్ లిక్కర్ తాగేవారు కూడా మీడియం రేంజ్ మద్యం ఇవ్వాలని అడుగుతున్నారు. దీంతో అభ్యర్థులకు ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఉదయం లేచిన దగ్గర నుంచి వెంట నడిచే వారికి టిఫిన్లు, టీ, కాఫీలు, మధ్యాహ్నం తర్వాత నుంచి దావత్‌లు ఉండాల్సిందే. ఇంటికి కిలో చికెన్ చొప్పున కూడా అభ్యర్థులు ఆఫర్ చేస్తున్నారు. మొత్తం ఖర్చులో మద్యం, చికెన్‌కే ఎక్కువ ఖర్చవుతోంది. ఎన్నికల్లో గెలిచేందుకు అవతలి అభ్యర్థి కంటే టాప్ బ్రాండ్ మద్యం ఇవ్వాల్సి వస్తోందని అభ్యర్థులు చెబుతున్నారు. గతంలో మాదిరిగా 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు కొనుగోలు చేస్తారని ఐఎంల్ డిపోల్లో స్టాక్ చేస్తే వాటిని ఎవరూ తీసుకెళ్లడం లేదు. గతంలో ఓసీ, ఐబీ, ఎంసీడైట్ వంటి ప్రీమియం బ్రాండ్ల మాదిరిగా పంపిణీ చేసేవారు. కానీ, ఇప్పుడు ఓసీ ఎవరూ కొనుగోలు చేయడం లేదు. ఐబీ, ఎంసీ డైట్, రాయల్ స్టాగ్, రాయల్ గ్రీన్, రాయల్ చాలెంజ్, బ్లెండర్స్ ప్రైడ్, సిగ్నేచర్ లాంటి బ్రాండ్ల మద్యం కొనుగోళ్లు మాత్రమే జరుగుతున్నాయి.

మద్యం డిపోల్లో సీలింగ్....

ఎక్సైజ్ పాలసీ గత నెలలో ముగిసి డిసెంబరు 1 నుంచి నూతన పాలసీ ప్రారంభమైన విషయం తెలిసిందే. లక్కీడిప్‌లో దుకాణాలు దక్కించుకున్న వారు ప్రస్తుతం ఫుల్ జోష్‌లో ఉన్నారు. అయితే మీడియం రేంజ్ బ్రాండ్ల ఇండెంట్ బాగా కోరుతుండటంతో ఐఎంల్ డిపోల నుంచి సరఫరా కాని పరిస్థితి ఏర్పడింది. ఒక ట్రక్ వస్తే ఒక్కో దుకాణానికి 4 నుంచి 5 కాటన్ల మద్యం మాత్రమే ఇవ్వాలని సీలింగ్ పెట్టుకున్నారు. ఐబీ, ఎంసీడైట్, రాయల్‌స్టాగ్, రాయల్ ఛాలెంజ్, రాయల్ గ్రీన్, బ్లెండర్స్ ప్రైడ్, సిగ్నేచర్‌కు సంబంధించి ప్రస్తుతం సీలింగ్ విధించారు. ఒక్కో దుకాణానికి 5 కాటన్లను మించనివ్వడం లేదు. దీనికి తోడు దుకాణదారులు అడ్వాన్సులు కూడా చెల్లిస్తున్నారు. ఈ బ్రాండ్ల మద్యం కంపెనీకి ప్రభుత్వం నుంచి కొంత పేమెంట్ పెండింగ్‌లో ఉన్నందుకు ఆయా కంపెనీలు సరఫరా తక్కువ చేశాయనే అనిపిస్తోంది. అయితే గతంలో కంటే మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి రెండు ఐఎంల్ డిపోలు ఉండగా సేల్స్ రెట్టింపు అయ్యాయి. సుమారు రెండింటిలో కలిపి ఒక్క లిక్కర్ మాత్రమే రోజుకు రూ.15 కోట్ల వరకు సరఫరా అవుతుంది. బీర్ కలుపుకుంటే రూ.22 కోట్ల వరకు ఉండొచ్చు. గతంలో ఇందులో సగం మాత్రమే ఒకరోజు అమ్మకాలు ఉండేవని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

27 సాధారణ సెలవు దినాలు

మరో 26 ఐచ్ఛిక సెలవులు

- 2026 సంవత్సరానికి సెలవులు ప్రకటించిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2026 సంవత్సరానికి సంబంధించిన సాధారణ, ఐచ్ఛిక సెలవులను ప్రకటించింది. ఏడాదిలో 27 సాధారణ, 26 ఐచ్ఛిక సెలవులు ఉంటాయని పేర్కొంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు. సాధారణ సెలవు దినాల్లో ప్రభుత్వ కార్యాలయాలు మూసి ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి ఆది, రెండో శనివారాలు కూడా కార్యాలయాలను మూసి ఉంచాలని ఆదేశించారు. 26 ఐచ్ఛిక సెలవు దినాల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఐదుకు మించి వినియోగించుకోరాదని స్పష్టం చేశారు. అయితే... ప్రభుత్వ రంగ సంస్థలు, విద్యాలయాలు, పరిశ్రమల్లో ఈ సెలవు దినాలు ఉన్నది ఉన్నట్లుగా వర్తించవని, వాటిలో పని చేసే ఉపాధ్యాయులు, సిబ్బంది, కార్మికుల కోసం సంబంధిత శాఖలు ప్రత్యేకంగా సెలవులను ప్రకటిస్తాయని పేర్కొన్నారు. రంజాన్, బక్రీద్, మొహర్రం సందర్భంగా సెలవు తేదీల్లో నెలవంక కనిపించడం ఆధారంగా మార్పులుంటాయని ఉత్తర్వుల్లో తెలిపారు.

సాధారణ సెలవు దినాలు

పండుగ/పర్వదినం/ప్రత్యేక దినం	తేదీ
భోగి	జనవరి 14
సంక్రాంతి/పొంగల్	జనవరి 15
గణతంత్ర దినోత్సవం	జనవరి 26
మహా శివరాత్రి	ఫిబ్రవరి 15
హోలి	మార్చి 3
ఉగాది	మార్చి 19
ఈద్ ఉల్ ఫితర్(రంజాన్)	మార్చి 21
రంజాన్ తర్వాతి దినం	మార్చి 22
శ్రీ రామ నవమి	మార్చి 27
గుడ్ ఫ్రైడే	ఏప్రిల్ 3
బాబు జగ్జీవన్‌రామ్ జయంతి	ఏప్రిల్ 5
అంబేద్కర్ జయంతి	ఏప్రిల్ 14
ఈద్ ఉల్ అదా(బక్రీద్)	మే 27
మొహర్రం	జూన్ 26
బోనాలు	ఆగస్టు 10
స్వాతంత్ర్య దినోత్సవం	ఆగస్టు 15
ఈద్ మిలాద్ ఉన్ నబీ	ఆగస్టు 26
శ్రీ కృష్ణాష్టమి	సెప్టెంబరు 4
వినాయక చవితి	సెప్టెంబరు 14
గాంధీ జయంతి	అక్టోబరు 2
సద్దుల బతుకమ్మ	అక్టోబరు 18
విజయ దశమి	అక్టోబరు 20
విజయ దశమి మరుసటి దినం	అక్టోబరు 21
దీపావళి	నవంబరు 8
కార్తీక పౌర్ణమి/గురు నానక్ జయంతి	నవంబరు 24
క్రిస్మస్	డిసెంబరు 25
క్రిస్మస్ మరుసటి దినం/బాక్సింగ్ డే	డిసెంబరు 26

రేవంత్ హయాంలో తెలంగాణ ఫాలింగ్!

గ్లోబల్ సమ్మిట్ కాదు.. గోబెల్స్ సమ్మిట్
బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు

హైదరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి హయాంలో తెలంగాణ రైజింగ్ కాదని.. ఫాలింగ్ బాట పట్టిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదాయాన్ని పెంచుకోవడంలో, అభివృద్ధిలో తిరోగమనంలో ఉందని విమర్శించారు. రేవంత్ రెండేళ్ల పాలన ప్రజలకు శాపంలా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం నిర్వహిస్తున్నది గ్లోబల్ సమ్మిట్ కాదని.. గోబెల్స్ సమ్మిట్ అని ఎద్దేవా చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలన, వైఫల్యాలపై హరీశ్‌రావు సోమవారం తెలంగాణ భవన్‌లో చార్జిషీట్‌ను ప్రకటించారు. కేసీఆర్ పదేళ్లలో సాధించిన ప్రగతిని కాంగ్రెస్ పాలకులు రెండేళ్లలోనే అథోగతిపాలు చేశారని, అన్ని వర్గాలకు మొండిచేయి చూపారని ఆరోపించారు. ప్రజాకంటక రేవంత్ పాలనను నిర్వచించాలంటే.. 'నిస్సారం, నిష్ఫలం, నిరర్థకం' ఈ మూడు మాటలు చాలన్నారు. బకాయిలు చెల్లించాలంటూ ఆస్పత్రులు, విద్యాసంస్థల యాజమాన్యాలు ఆందోళనలు చేస్తే వారిపై విజిలెన్స్ దాడులు చేయిస్తూ రేవంత్ బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి వ్యవస్థీకృత అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అనధికార ట్యాక్సులతో సీఎం, మంత్రులు తమ జేబులు నింపుకొనే పనిలో పడ్డారన్నారు. కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపుకు ఆర్థిక మంత్రి 30 శాతం ట్యాక్స్ వసూలు చేస్తున్నారన్నారు. ఆర్ఆర్, భట్టి, ఉత్తమ్, పొంగులేటి, ఎనుముల బ్రదర్స్ ట్యాక్స్. ఇలా ఎవరుపడితే వాళ్లు దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. దోచుకున్న దాంట్లో కొంత ఢిల్లీకి కప్పం రూపంలో కడుతుండడంతో కాంగ్రెస్ అధిష్ఠానం చోద్యం చూస్తోందన్నారు. ప్రగతిభవన్ ప్రజాభవన్‌గా మారుతుందని, రోజూ తానే ప్రజాదర్బార్ నిర్వహిస్తానంటూ బిల్డప్ బాబాయ్ రేవంత్ రెడ్డి చెప్పిన మొదటి మాటే అబద్ధమైందని అన్నారు. ప్రస్తుతం ప్రజాభవన్ కాంగ్రెస్ నేతల జల్సాలు, విందులు, వినోదాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్, మధ్యాహ్నం డిప్యూటీ సీఎం కుటుంబం దందాలు, సాయంత్రం గానాభజానాలతో ప్రజాభవన్ ప్రీమియం భవన్‌గా మారిందని విమర్శించారు. సాగునీరు, విద్యుత్తు శాఖల్లోని కీలక స్థానాల్లో రేవంత్ సర్కారు ఆంధ్రా వ్యక్తుల్ని నియమించిందని, ఇది ఆంధ్రా అజెండా అమలుకు నిదర్శనమని అన్నారు. ఇక విద్య, హోం, పురపాలక శాఖలను తన వద్దే ఉంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. వాటి నిర్వహణలో పూర్తిగా విఫలమయ్యారని చెప్పారు. రేవంత్ పాలనలో హత్యలు 58 శాతం పెరిగాయని, మహిళలపై అత్యాచారాలు 35 శాతం పెరిగాయని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో స్థిరమైన వృద్ధి (+15శాతం)ఉంటే, కాంగ్రెస్ హయాంలో -22 శాతానికి పడిపోయిందని చెప్పారు.

అది 'గోబెల్స్ రాష్ట్ర సమితి': మంత్రి సీతక్క

తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను హరీశ్‌రావు గోబెల్స్ సమ్మిట్‌గా అభివర్ణించడంపై మంత్రి సీతక్క మండిపడ్డారు. సమ్మిట్ విజయవంతమై, లక్షల కోట్ల పెట్టుబడులు వస్తుండడంతో హరీశ్‌రావు సహించలేకపోతున్నారని విమర్శించారు. తప్పుడు ప్రచారంతో బీఆర్ఎస్ గోబెల్స్ రాష్ట్ర సమితిగా మారిందన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారి హత్య

కత్తులతో నరికి, తుపాకీతో కాల్చి చంపిన దుండగులు

కాప్రాలో ఘటన.. పాతకక్షలే కారణం

హత్యలో ఆరుగురి ప్రమేయం


వెంకటరత్నం (ఫైల్)

హైదరాబాద్ సిటీ/మౌలాలీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణహత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని ఆరుగురు దుండగులు కాపుగాసి కత్తులతో పొడిచి, తుపాకీతో కాల్చి చంపారు. శుక్రవారం ఉదయం 7:55 గంటలకు హైదరాబాద్‌లోని కాప్రాలో ఈ ఘటన జరిగింది. హతుడు 54 ఏళ్ల వెంకటరత్నం. పాతికేళ్ల నాటి పాతకక్షలు, ఆర్థిక లావాదేవీలే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పోలీసు వర్గాల సమాచారం ప్రకారం.. వెంకటరత్నానికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాప్రాలోని సాకేత్ కాలనీ పోస్టర్ స్కూల్ సమీపంలో దాదాపు 500 గజాల స్థలంలో అతడు ఇల్లు కట్టుకున్నాడు. వెంకటరత్నం కుటుంబం, అతడి తమ్ముడి కుటుంబం, తల్లి ఆ ఇంట్లోనే ఉమ్మడిగా నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం చిన్న కుమార్తెను బడిలో దిగబెట్టిన తర్వాత స్కూటీపై తిరిగివస్తున్న వెంకటరత్నాన్ని ది గ్రిడ్ పికిల్ బాల్ కోర్టు సమీపంలో ఆరుగురు అడ్డుకున్నారు. దుండగుల్లో ఇద్దరు బైక్‌పై, మరో నలుగురు ఆటోలో వచ్చి కాపుగాశారు. వెంకటరత్నం సమీపంలోకి రాగానే చుట్టుముట్టి విచక్షణరాహితంగా దాడి చేసి చంపారు. తీవ్రగాయాలతో వెంకటరత్నం అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులొచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా హతుడు వెంకటరత్నం 24 ఏళ్ల క్రితం ధూల్‌పేటకు చెందిన సుదేశ్ సింగ్ అనే వ్యక్తి దగ్గర డ్రైవర్‌గా పని చేసేవాడు. సుదేశ్ ఆర్థిక వ్యవహారాలనూ చూసేవాడు. అక్కడ జరిగిన హత్యలు, గంజాయి కేసులు, ఇతర గ్యాంగులతో వెంకటరత్నానికి కూడా వివాదాలు ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలో 2001లో జరిగిన పోలీసుల ఎన్‌కౌంటర్‌లో సుదేశ్ సింగ్ చనిపోయాడు. ఆ తర్వాత సుదేశ్ సింగ్ కుటుంబం నుంచి వెంకటరత్నం దూరంగా వెళ్లిపోయాడు. సుదేశ్ సింగ్ కుటుంబ సభ్యులకు వెంకటరత్నం పాత్రపై అనుమానాలు ఏర్పడ్డాయి. అప్పటి నుంచి వెంకటరత్నంపై సుదేశ్‌సింగ్ కుమారుడు పగ పెంచుకున్నాడు. ఈ క్రమంలో కాప్రాలో నివాసం ఉంటున్న వెంకటరత్నం రోజువారీ కార్యకలాపాలపై రెక్కీ నిర్వహించి.. చంపేశాడు. హత్య తర్వాత.. 'నా తండ్రి హత్యకు ప్రతీకారం తీర్చుకున్నాను' అంటూ ఆరుగురిలో ఒకరు అరుచుకుంటూ వెళ్లినట్లు సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. తల, మెడ, పొట్ట భాగాల్లో తీవ్రగాయాలతో వెంకటర్నం మృతిచెందాడని మల్కాజిగిరి డీసీపీ సీహెచ్.శ్రీధర్ పేర్కొన్నారు. ప్రత్యేక బృందాలతో హత్య ఘటనపై ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక లావాదేవీలు, పాతకక్షల కారణంగానే అతడిని ప్రత్యర్థులు చంపి ఉంటారని భావిస్తున్నామని చెప్పారు. హత్య ఘటనలో పాల్గొన్న ఆరుగురు నిందితులు జవహర్‌నగర్ పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. అయితే పోలీసులు ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు.

పూలమ్మిండు.. పాలమ్మిండు.. వేల ఎకరాలు కబ్జా పెట్టిండు!

- మల్లారెడ్డి పేదలకు చేసిందేమీ లేదు
- కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యేలు కబ్జాలు ఆపాలి: కల్వకుంట్ల కవిత

కేపీహెచ్‌బీకాలనీ/కూకట్‌పల్లి, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): బంగారు తెలంగాణ(బీటీ) బ్యాచ్ ఎమ్మెల్యేలు తాము అధికారంలో ఉన్నప్పుడు మేడ్చల్ జిల్లా అభివృద్ధిని పక్కనపెట్టి చెరువులు, భూములను కబ్జా చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన ఇంటిలో జరిగిన శుభకార్యానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించి మనుమడితో ఆయన కాళ్లు మొక్కించారని.. దీంతో రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా మల్లారెడ్డి ఆక్రమణలపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. 'ఐదేళ్లు మంత్రిగా, ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న మల్లారెడ్డి.. పూలమ్మిండు, పాలమ్మిండు, వేల ఎకరాలు కబ్జా పెట్టిండు. ఆయన పేదలకు చేసిందేమీ లేదు' అని తీవ్ర విమర్శలు చేశారు. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యేలు కబ్జాలు చేయడం ఆపి, తమ నియోజకవర్గాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. కూకట్‌పల్లిలోని సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో మంత్రి పదవులు బీటీ బ్యాచ్‌కే దక్కాయని, ఉద్యమకారుడు శంభీపూర్ రాజుకు పదవి దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో మౌలిక వసతులు లేవన్నారు. మేడ్చల్ కలెక్టరేట్ కూడా అందరికీ ఆమోదయోగ్యంగా లేదని చెప్పారు. జిల్లాలో ఒక్కటంటే ఒక్క ప్రభుత్వ 100 పడకల ఆస్పత్రి లేకపోవడం ఇక్కడి ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ సర్కారుకు కూకట్‌పల్లి భూములు కామధేనువులాగా మారాయని ఆరోపించారు. కేపీహెచ్‌బీలో ఇప్పటికే రూ.2వేల కోట్ల భూములు అమ్ముకున్న ప్రభుత్వంఇక్కడి ప్రజల అవసరాల కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడుగుతున్న నాయకులు ఇక్కడి ప్రజల సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.